PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 204 | విజయవాడ, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 25 February 2025 | Rs

ముందుకు సాగని సహాయక చర్యలు

- ఊట, ఒండ్రు మట్టితో ఆటంకం
- ర్యాట్ మైనర్స్, స్నిఫ్పర్‌డాగ్‌ల సేవలు
- ఉత్తరాఖండ్ మాదిరి సహాయక చర్యలు

7

4 నియోజకవర్గాల్లో విజన్-2047

- నివేదికలు సిద్ధం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

తొలి విడత రాష్ట్రంలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల విజన్-2047 డాక్యుమెంట్లు సిద్ధమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తోన్న మంగళగిరి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న ఉరవకొండ నియోజకవర్గాలకు సంబంధించి స్థానిక అంశాల ఆధారంగా ప్రణాళిక శాఖాధికారులు డాక్యుమెంట్లను సిద్ధం చేసి వారికి అందజేశారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సౌకర్యాల కల్పనపై శాఖల వారీగా నివేదికల్లో పేర్కొన్నారు. ప్రతి రంగంలో 15 శాతం వృద్ధి రేటు సాధించాలనే లక్ష్యంతో రూపొందించారు. వీటిని సంబంధిత శాఖల రాష్ట్ర అధికారులు పరిశీలిస్తున్నారు. వీటిపై కసరత్తు తర్వాత ప్రభుత్వం ఇచ్చే సూచనలకు అనుగుణంగా మిగతా 171 నియోజకవర్గాల విజన్ డాక్యుమెంట్లను ఏప్రిల్ 30 నాటికి సిద్ధం చేయనున్నారు.

షేర్ మార్కెట్లలో ఆరని ట్రంప్ కుంపటి

సెన్సెక్స్ 856 పాయింట్ల పతనం

రూ.4 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబయి : ట్రంప్ టారిఫ్‌ల కుంపటి భారత స్టాక్ మార్కెట్లను మండేలా చేస్తూనే ఉంది. ఎఫ్ఐఐలు తరలిపోవడం, ఐటి, టెలికం, లోహ షేర్లలో ఒత్తిడితో సోమవారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 856.65 పాయింట్లు లేదా 1.14 శాతం పతనమై 74,454కి దిగజారింది. రోజంతా నష్టాల్లోనే ట్రేడయింది. ఒక దశలో 900 పాయింట్లకు పైగా పడిపోయి 74,387 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 242.55 పాయింట్లు లేదా 1.06 శాతం నష్టంతో 22,553 వద్ద ముగిసింది. ఇరు సూచీలు 2025లో ఇప్పటి వరకు 5 శాతం పతనమయ్యాయి. వరుస పతనంతో సెన్సెక్స్ ఎనిమిది నెలల కనిష్టానికి పడిపోయింది. ఒక్క పూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.4.42 లక్షల కోట్లు ఆవిరై.. బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.422.98 లక్షల కోట్లకు పరిమితమైంది. "భారత్‌లో ఎన్నికలకు డబ్బులిస్తున్నాం. వారికి అవి అవసరం లేదు. వారు మనల్ని అవకాశంగా తీసుకుంటున్నారు. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో ఇండియా ఒకటి. మనపై 200శాతం సుంకాలు విధిస్తుంది." అని మరోమారు ట్రంప్ భారత్‌పై విరుచుకుపడటం ఇన్వెస్టర్లలో మరింత ఆందోళనలను పెంచింది. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఆందోళనలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నెలకొనడంతో భారత మార్కెట్లపై ఆ ప్రభావం పడింది. మరోవైపు దేశీయంగా కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండటం, జిడిపి వృద్ధిపై ఆందోళనలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. గడిచిన శుక్రవారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.3,449 కోట్లకుపైగా విలువ చేసే షేర్లను విక్రయించారు. ఈ ఫిబ్రవరి నెల మొత్తంలో రూ.23,740 కోట్ల విదేశీ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. బిఎస్ఇలో స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 1.31 శాతం, 0.78 శాతం చొప్పున నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే మన దేశ కరెన్సీ రూపాయి విలువ 4 పైసలు కోల్పోయి రూ.86.720 వద్ద ముగిసింది. ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసిజి రంగాలు మినహా దాదాపు అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా ఐటి, టెలికం, లోహ రంగాల సూచీలు 2 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ సూచీలో విప్రో, హెచ్‌సిఎల్ టెక్, ఇన్ఫోసిస్, టిసిఎస్ సహా టాటా స్టీల్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్, హీరో మోటార్స్, కొటాక్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

రైతులు కష్టాల్లో లేరట..!

ఉభయసభలనుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ • జాప్యాలు, నష్టాల వ్యవస్థను మార్చామని ప్రకటన

సమృద్ధి, సమ్మిళితత్వం, సుస్థిరత ద్వారా స్వర్ణాంధ్ర • పి4 తోనే ముందడుగు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోనే కాదు... దేశ వ్యాప్తంగా రైతులు ఎలా ఉన్నారో, వారి స్థితి గతులేంటో ప్రజలందరికీ తెలుసు. కానీ, ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దీనికి భిన్నమైన ప్రకటన చేశారు. 'నేడు ఏ రైతు కూడా కష్టాల్లో లేరు.' అని ఆయన చెప్పారు. అంతే కాదు. ఆ విషయం చెప్పడానికి తాము గర్విస్తున్నామని కూడా ఆయన అన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభల సభ్యులనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ చేసిన ప్రసంగంలో ఈ అంశం చోటుచేసుకుంది. గత ప్రభుత్వ విధానాలను ఆయన చాలాసార్లు ప్రస్తావించారు. 'గత పాలనా వ్యవస్థ దుష్పరిపాలన కారణంగా విధానాలు ఎంతో మంది రైతులను నిరాశ అంచులకు నెట్టాయి. నేడు, ఏ రైతు కూడా కష్టాల్లో లేరని చెప్పడానికి మేము గర్విస్తున్నాము.' అని ఆయన అన్నారు. 'గత ఐదేళ్ళుగా రైతులను ప్రభావితం చేస్తున్న జాప్యాలు, నష్టాలతో రాష్ట్రంలో వరి సేకరణ గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంది. నేడు మేము, ఈ విధానాలను మార్చాము' అని ఆయన ప్రకటించారు. సమీకృత, సాంకేతిక ఆధారిత చొరవలపై దృష్టి సారించడం ద్వారా ఆర్థికంగా లాభదాయకంగా ఉండేలా చూస్తున్నట్లు తెలిపారు. సమృద్ధి, సమ్మిళితత్వం, సుస్థిరతతో స్వర్ణాంధ్రను సాధించడం తమ ప్రభుత్వ లక్ష్యమని గవర్నర్ చెప్పారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' అనే నినాదంపై దృష్టి సారిస్తూ ఉపాధికల్పనకు బలమైన పునాది వేయడమే తమ ప్రభుత్వ సమగ్ర విధానమని చెప్పారు. ఆత్మగౌరవం ఆర్థిక స్థిరత్వం రెండింటినీ తీసుకొచ్చే వృత్తులకు విలువ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేటు- ప్రజల భాగస్వామ్యం అనే ఒక వినూత్న పి-4 విధానానికి నాందిపలుకుతున్నట్లు గవర్నర్ తెలిపారు.అట్టడుగున ఉన్న 20శాతం మందికి మద్దతివ్వడానికి అగ్రస్థాయిలోని 10శాతం మందిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తులు, కుటుంబాలకు సాధికారిత కల్పించడం ద్వారా రోబోయో కొన్నేళ్లలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం స్వర్ణాంధ్ర లక్ష్యమని గవర్నర్ తెలిపారు. ఎస్‌సిల వర్గీకరణ కోసం, వర్గీకరణ విధి విధానాలను నిర్ణయించడానికి ఏక సభ్య సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు గవర్నర్ తెలిపారు. 4.93లక్షల మంది బలహీన, గిరిజన సమూహాలతో కలుపుకుని 27.39 లక్షల షెడ్యూల్డ్ తెగల మిగతా 7లో

అసెంబ్లీలోకి గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు, మోషేన్‌రాజు తదతరులు

'నరేంద్ర చంద్రబాబు' : గవర్నర్

గవర్నర్ ప్రసంగ ప్రారంభంలో సిఎం నారా చంద్రబాబునాయుడు పేరును నరేంద్ర చంద్రబాబునాయుడు అని గవర్నర్ పేర్కొన్నారు. దీంతో వైసిపిసభ్యులు షేమ్ షేమ్ అంటూ నినాదాలు చేశారు.

మాటలు ఘనం - ఆచరణ శూన్యం

- గవర్నర్ ప్రసంగంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు 2

ఎన్నికల వాగ్దానాలను వల్లెవేసిన గవర్నర్

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ 2

ప్రసంగంలో పస లేదు

- పిసిసి చీఫ్ షర్మిల 2

28న బడ్జెట్

- 17 రోజులు అసెంబ్లీ
- మార్చి 21వరకు నిర్వహణ
- బిఎసిలో నిర్ణయం

2

20న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నిక

- ఎపి, తెలంగాణల్లో చెరో ఐదు స్థానాలకు ఎన్నిక
- కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నగారా మోగింది. మార్చి 20న ఎన్నిక జరగగా, అదే రోజు ఫలితాలు వెల్లడవుతా యి. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ లో ఐదు, తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలకు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో జంగా కృష్ణమూర్తి (2024 మే 15 నుంచి ఖాళీ), దువ్వారపు రామారావు, పర్చూరి అశోక్ బాబు, బి.తిరుమలనాయుడు, యనమల రామకృష్ణుడు పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. తెలంగాణలో మొహమ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, సెరి సుభాష్ రెడ్డి, మల్లేశం యాగీ, మీర్జా రియాజుల్ హసన్ పదవీ కాలం కూడా మార్చి 29తో ముగియనుంది. మార్చి 3న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మార్చి 10 వరకూ నామినేషన్ దాఖలు చేసేందుకు గడువు. 11న నామినేషన్ల పరిశీలన, 13 వరకూ ఉపసంహరణకు గడువు ఉంటుందని ఇసి పేర్కొంది. మార్చి 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ప్రతిపక్ష హోదా కోసం..

- గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన వైసిపి
- పోడియం ముట్టడి .. నినాదాల హోరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమను ప్రతిపక్ష పార్టీగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గవర్నర్ ప్రసంగం సందర్భంగా వైసిపి సభ్యులు అసెంబ్లీలో ఆందోళనకు దిగారు. 'వుయ్‌వాంట్' జస్టిస్ అంటూ ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. వైసిపి సభ్యుల నినాదాలకు ప్రతిగా అధికారపక్ష సభ్యులూ నినాదాలకు దిగడంతో గవర్నర్ ప్రసంగం కొద్దిసేపు గందరగోళంగా మారింది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సోమవారం ఉదయం గవర్నర్ మహ్మద్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగాన్ని ప్రారంభిం చిన వెంటనే వైసిపి సభ్యులు తమను ప్రతిపక్షంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు ప్రారంభించారు. ప్లకార్డులతో పోడియం వద్దకు వెళ్లారు. జగన్‌మోహన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణ మినహా మిగిలిన సభ్యులందరూ పోడియం ముందుకు వెళ్లారు, టిడిపి సభ్యులు కూడా వారికి ప్రతిగా వ్యాఖ్యానాలు చేయడంతోపాటు గవర్నర్ ప్రసంగానికి మద్దతుగా బల్లలు చరచడం మొదలుపెట్టారు. ఒకవైపు నినాదాలు, మరోవైపు అరుపులు కేకలతో సభ గందరగోళంగా తయారైంది. కొద్దిసేపు నినాదాలు చేసిన అనంతరం వైసిపి సభ్యులు సభనుండి బయటకు వెళ్లిపోయారు.

గవర్నర్ ప్రసంగిస్తుండగా బయటకు వెళ్లిపోతున్న వైసిపి ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు

ప్రజల్లోకి వెళ్తాం : బొత్స

గవర్నర్ ప్రసంగాన్ని బాయ్‌కాట్ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రభుత్వ వైఖరికి నిరసనగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి పోరాడుతామని, ప్రభుత్వ వైఫల్యాలను చొక్కా పట్టుకు నిలదీస్తామని అన్నారు తమకు . ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ప్రభుత్వం భయపడుతోందని పేర్కొన్నారు.

ఎపిలో తాలిబన్ పాలన : పెద్దిరెడ్డి

కూటమి ప్రభుత్వం వైసిపి లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున విష ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రంలో టిడిపి తాలిబన్ పాలన చేస్తోందని మిగతా 2లో

ప్రజలకు తెలియాలనే ...

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వైఎస్ జగన్ 2

ఈ ఐదేళ్లలో రాదు

- పవన్‌కల్యాణ్ 2

నిర్దిష్టత, స్పష్టత లేదు

గవర్నర్ ప్రసంగంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లల్లో ప్రభుత్వం ఏం చేస్తుందో నిర్దిష్టత, స్పష్టత గవర్నర్ ప్రసంగంలో లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు, సభ్యులు ఐ వెంకటేశ్వరరావు, బి గోపిమూర్తి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రసంగం లేదన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, దీని గురించి ప్రస్తావించలేదన్నారు. రైతుల ఆర్థిక సహాయానికి సంబంధించిన అన్నదాతా.. సుఖీభవపై కూడా ప్రస్తావన లేదని విమర్శించారు. తల్లికి వందనం గురించి ప్రస్తావించినా ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టత ఇవ్వలేదని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర గురించి చెప్పలేదన్నారు. 2024 నవంబర్ నాటికి డిఎస్సి పోస్టులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. ఇప్పటి వరకూ ఆ పోస్టులు భర్తీ కాలేదని, ఎప్పుడు చేస్తారో స్పష్టత లేదన్నారు.

ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలోచంద్రబాబు ప్రకటించిన స్వర్ణాంధ్రప్రదేశ్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని, ఇప్పుడు విజన్-2047 వల్ల కూడా ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలను ఏం చేస్తారో చెప్పలేదన్నారు. నీటి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలను అమలేప్పుడు చేస్తారో నిర్దిష్టంగా ప్రస్తావించలేదన్నారు. రాష్ట్రప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీం వర్కర్లు కనీస వేతనం అమలు, పిఆర్‌సి వంటి అంశాల ప్రస్తావన లేదన్నారు. బి గోపిమూర్తి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ గురించి చెప్పలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వలేదని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పెన్షనర్ల గురించి ప్రస్తావించలేదన్నారు

క్వింటాలుకు రూ.20 వేలివ్వాలి

- మిర్చిని మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి
- గుంటూరు మిర్చి యార్డు పర్యటనలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రైతులతో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న మిర్చి రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్ఫెడ్ ద్వారా క్వింటాలును రూ.20 వేలకు కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గుంటూరు మిర్చి యార్డులో సిపిఎం బృందం సోమవారం సందర్శించి రైతులతో మాట్లాడింది. యార్డులో పల్నాడు, నంద్యాల, కర్నూలు, ప్రకాశం జిల్లాల రైతులు ఈ బృందం వద్ద తమ సమస్యలను వివరించారు. గిట్టుబాటు ధరలు రావడం లేదని, గతేడాది కన్నా ఈ ఏడాది ధరలు సగానికి సగం పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది గరిష్టంగా క్వింటాలుకు రూ.28 వేలు లభించగా, ప్రస్తుతం రూ.13,500 మాత్రమే వస్తోందన్నారు. రోజు లక్ష టిక్కీలు వస్తే ఇందులో పది శాతం సరుకుకు మాత్రమే గరిష్ట ధర వస్తోందని తెలిపారు. మిగతా సరుకుకు సగటున రూ.9 వేల వస్తుందని, కనిష్టంగా రూ.4 వేలు లేదా రూ.5 వేలు వస్తున్న పరిస్థితి కూడా ఉందని, మిర్చి నాణ్యతను సాకుగా చూపి వ్యాపారులు ధర దిగ్గోస్తున్నారని వాపోయారు. ఎకరాకు రూ.2 లక్షలకుపైగా పెట్టుబడి పెట్టామని, తెగుళ్ల వల్ల దిగుబడులు తగ్గాయని, క్వింటాలు ధర రూ. 20 వేలకు తగ్గితే తమ కుటుంబాలు బతకడం కష్టమవుతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మిర్చికి గిట్టుబాటు ధర కోసం రైతుల తరపున నిలిచి పోరాడతామన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ నాఫెడ్, మార్క్ఫెడ్ ద్వారా మిర్చిని ప్రభుత్వం కొనుగోలు ప్రారంభిస్తే ధరలు పెరుగుతాయన్నారు. యార్డులో వందేళ్లగా ఉన్న కొనుగోలు పద్ధతులే ఇప్పటికీ కొనసాగుతున్నాయని, నష్టపోతున్న రైతులకు అధికారులు భరోసా ఇవ్వలేకపోతున్నారని వివరించారు. మిర్చి యార్డులో జరుగుతున్న మోసాలను ఆర్టిఫిషియల్, డ్రోన్ టెక్నాలజీ ద్వారా ఎందుకు కనుగొనలేకపోతున్నారని ప్రశ్నించారు. యార్డులో రైతులకు సాయం చేసేందుకు ఒక్క అధికారి కూడా లేరన్నారు. ధరలు సగానికి సగం పడిపోతే, మార్కెట్ ఇంటర్‌వెన్షన్ మిగతా 7లో

'మిర్చి'కి కేంద్రం షరతులు

- 25 శాతం పంటకే రూ.11,781 ధర
- నెల రోజులే అమలు
- కేంద్రం, రాష్ట్రం చెరి సగం భరించాలి
- వర్కింగ్ క్యాపిటల్ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మార్కెట్ ప్రైస్ సపోర్ట్ స్కీం కింద మిర్చి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం పలు షరతులు విధించింది. 25 శాతం మిర్చికే క్వింటా ధర రూ.11,781.25 వర్తిస్తుందని పేర్కొంది. మిర్చి మొత్తం ఉత్పత్తి 10,32,950 మెట్రిక్ టన్నుల్లో 2,58,238 మెట్రిక్ టన్నుల(25 శాతం)కే ధర వర్తింపజేస్తామని తెలిపింది. ఈ మేరకు మార్కెట్ ప్రైస్ సపోర్టు (ఎంపిఎస్) డిప్యూటీ కమిషనర్ బినోద్ గిరి, రాష్ట్ర వ్యవసాయం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్‌కు లేఖ రాశారు. మిర్చి ధర కోసం ఏపి ప్రభుత్వ ప్రతిపాదనతో మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద ప్రైస్ డెఫిసెన్సీ పేమెంట్ (పిడిపి) అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నుండి 2024 డిసెంబర్ 19, 2025 ఫిబ్రవరి 5, 11 తేదీల్లో కేంద్రానికి వచ్చిన లేఖలను పరిశీలించామని, 2024-25 సీజన్‌లో మిర్చికి ఎంఐఎస్ కింద పిడిపి అమలకు ఆమోదాన్ని తెలిపామని పేర్కొన్నారు.

మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రైస్ (ఎంఐపి) క్వింటాలుకు రూ.11,781.25 నిర్ణయించాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన ఏర్పడిన కమిటీ అమ్మకపు ధరను నిర్ణయిస్తుంది. ఎంఐపి, అమ్మకపు ధరల మధ్య గరిష్ట చెల్లింపు పరిమాణం ఎంఐపిలో 25 శాతం వరకు ఉంటుంది" అని పేర్కొన్నారు.

"పిడిపి కింద ప్రయోజనాలను పొందే రైతులు తమ ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్‌లోని నోటిఫైడ్ మార్కెట్ యార్డుల్లో పిడిపి అమలు కాలం మొదటి లావాదేవీ తేదీ నుండి ఒక నెల వరకు ఉంటుంది. పిడిపి అమలులో కలిగే నష్టాలను కేంద్రం, రాష్ట్రం 50:50 నిష్పత్తిలో భరించాల్సి ఉంటుంది" అని సూచించారు. "ఎంఐపి, అమ్మకపు ధరల మధ్య ధరల వ్యత్యాసం నిర్ణయించడానికి ధరల నిర్ధారణకు ఎజిమార్కెట్ పోర్టల్, ఎపి ప్రభుత్వ ఈ-పంట డేటాను ఆధారంగా తీసుకోవాలి. ఎంఐసి, అమ్మకపు ధరల మధ్య ధరల వ్యత్యాసాన్ని నేరుగా రైతులకు చెల్లించడానికి వర్కింగ్ క్యాపిటల్‌ను ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత' అని పేర్కొన్నారు.

ఫైబర్ నెట్‌లో కలకలం

- చైర్మన్ జివిరెడ్డి రాజీనామా
- జిఎడికి ఎమ్‌డి దినేష్ బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఫైబర్ నెట్‌లో కలకలం రేగింది. ఆ సంస్థ చైర్మన్ జివి రెడ్డి రాజీనామా చేయడం, ఎమ్‌డిని ప్రభుత్వం జిఎడికి బదిలీ చేయడంతో వంటి ఆకస్మిక పరిణామాలు సోమవారం చోటుచేసుకున్నాయి. ఫైబర్ నెట్‌లో భారీ అవినీతి జరిగిందని కొద్దిరోజుల క్రితం జివిరెడ్డి వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా కొత్త కనెక్షన్ ఒక్కటి కూడా ఇవ్వలేకపోయామని ఆరోపించారు. ఎండి దినేష్‌కుమార్ ఫైబర్ నెట్‌కు ఇబ్బందులు వస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చైర్మన్ ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి ఎన్ యువరాజ్, ఫైబర్ నెట్ ఎమ్‌డి దినేష్‌ను సంబంధిత శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. ఈ పరిణామం తరువాత సిఎం చంద్రబాబు జివిరెడ్డిని పిలిపించుకొని ఐఎఎస్‌లపై ఆరోపణలు చేయడం సరికాదని మందలించిన్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం సిఎంకు లేఖ రాశారు. అదేవిధంగా టిడిపికి కూడా రాజీనామా చేశారు. మరోపక్క ఫైబర్ నెట్ ఎండిని కూడా రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. జిఎడిలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు విడుదల చేశారు.

కృష్ణా నీటివాటాలపై కెఆర్‌ఎంబిలో చర్చ

- ప్రత్యేకంగా ఇరు రాష్ట్రాల ఇఎన్‌సిలతో భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా జలాల వాటాపై హైదరాబాద్‌లోని జల సౌధలో బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్‌ఎంబి) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, తెలంగాణ ఇఎన్‌సి జి అనిల్‌కుమార్, ఎపి ఇఎన్‌సి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నీటి వాటాలపై సుదీర్ఘంగా చర్చించారు. కాగా రెండు తెలుగు రాష్ట్రాల ఇంజనీర్ ఇన్ ఛీఫ్ (ఇఎన్‌సి)లు ప్రత్యేకంగా భేటీ అయ్యేందుకు చైర్మన్ సమయమిచ్చారు. దాదాపు గంటపాటు జరిగిన సమావేశంలో నాగార్జునసాగర్ సిఇ, ఎపి సిఇలతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశారు. మంగళవారం వారిద్దరూ సమావేశం కావాలని సూచించారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పంటలు ఎంత? నీరు ఎంత కావాలో సిఇలు చర్చించుకుంటారు. వారిద్దరూ ఒక అంచనాకు వచ్చిన తర్వాత కెఆర్‌ఎంబి దృష్టికి తేనున్నారు. ఈ మేరకు అంగీకారం కుదిరింది. కాగా శ్రీశైలం నీళ్లు తెలంగాణకే దక్కాలనీ తెలంగాణ నీటిపారుదల అధికారులు పట్టుబట్టారు. తాగునీటి కోసం నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో కనీసం పది టిఎంసిలు ఉంచాలని తెలంగాణ అధికారులు కెఆర్‌ఎంబి దృష్టికి తెచ్చారు. వేసవి నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాలకు 119 టిఎంసిలు కేటాయించాలన్న తెలంగాణ విజ్ఞప్తిపై కెఆర్‌ఎంబి వెంటనే నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపించడం లేదు.

వంశీ పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి

ప్రజాశక్తి- గన్నవరం

కృష్ణా జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను మూడు రోజులపాటు పోలీసు కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు. గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై దాడి, సాక్షి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి దాడి చేయడం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో వంశీ విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీని విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన పిటిషన్‌పై విచారించిన కోర్టు గురువారం తీర్పును వెలువరించింది. ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మూడు రోజులపాటు విచారణకు అనుమతి ఇచ్చింది. తన అనారోగ్యంపై వంశీ వేసిన పిటిషన్‌పై విచారించిన కోర్టు ఆయనకు వెస్ట్రన్ బాత్‌రూమ్, బెడ్డు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించింది. కాగా, వంశీ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ మైనింగ్ సహా భూ కబ్జాలపై విచారణకు జివిజి అశోక్‌కుమార్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసింది.

28న బడ్జెట్

- 17 రోజులు అసెంబ్లీ
- మార్చి 21వరకు నిర్వహణ
- బిఎసిలో నిర్ణయం

బిఎసి సమావేశంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు, సిఎం చంద్రబాబు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఆర్థిక సంవత్సరం (2025-26) బడ్జెట్ ఈ నెల 28 వ తేదే అసెంబ్లీ ముందుకు రానుంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన సోమవారం జరిగిన శాసనసభ కార్యక్రమాల సలహాకమిటీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ -బిఎసి) సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఈ విషయమై నెలకొన్న సందిగ్ధత తొలిగిపోయింది. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన అసెంబ్లీలో సోమవారం ఈ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈ సమావేశంలో పాల్గొనగా వైసిపి నుంచి ఏవరూ హాజరు కాలేదు.

గవర్నర్ ప్రసంగంతో పాటు కలుపుకొని 17 రోజుల పాటు అసెంబ్లీ జరపాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.ొలుత మార్చి 19వ తేది వరకే నిర్వహించాలన్న అభిప్రాయం సమావేశంలో వచ్చింది. అనంతరం మరో రెండు రోజులు పొడిగించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో మార్చి 20, 21వ తేదిల్లో కూడా సభ జరగనుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం చర్చ జరగనుంది. శివరాత్రి సందర్భంగా 26వ తేదిన, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 27వ తేదిన సెలవు దినాలు ప్రకటించారు. 28వ తేదిన రాష్ట్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 3వ తేది సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు. అదే రోజు బడ్జెట్‌పై చర్చ ప్రారంభించి, 4,5 తేదీల వరకు కొనసాగించనున్నారు. 28 అంశాలపై చర్చ జరపాలని టిడిపి, 13 అంశాలపై చర్చించాలని బిజెపి ప్రతిపాదించింది.

జనసేన ఎలాంటి ప్రతిపాదనలు ఇవ్వలేదు. తమ సభ్యులు అడిగిన ప్రశ్నలు ఎక్కువగా ఉండేలా చూడాలని ఆ పార్టీ నుంచి హాజరైన మంత్రి నాదెండ్ల మనోహర్ కోరినట్లు సమాచారం. ఈ సమావేశంలో బిజెపి శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్ రాజు, టిడిపి ఛీఫ్ విప్, జివి ఆంజనేయులు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాటలు ఘనం - ఆచరణ శూన్యం

- గవర్నర్ ప్రసంగంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ మహ్మద్ అబ్దుల్ నజీర్ ఉభయ సభల్లో చేసిన ప్రసంగం టిడిపి కూటమి అరిగిపోయిన ఎన్నికల మేనిఫెస్టోలా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఎన్నికల హామీల్లో పేర్కొన వివిధ పథకాలను ప్రసంగంలో పునశ్చరణ చేశారే తప్ప, వాటి అమలు గురించి నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదని, ఇది ప్రజలకు నిరాశ కలిగించిందని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉందన్న తీరులో సాగిన ప్రసంగం వాస్తవ పరిస్థితిని చూడ నిరాకరించడమే అవుతుందని పేర్కొన్నారు. కీలకమైన వ్యవసాయ మద్దతు ధరల కల్పన, గ్రామీణ పేదల ఉపాధి హామీ, పరిశ్రమల్లో భద్రతా చర్యలు వంటి అంశాల ఊసే లేదని వివరించారు. సూపర్ సిక్స్, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ హామీల అమల్లో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. మెగా డిఎస్‌సి ప్రకటన గురించి పేర్కొన్నా, ఎప్పుడు ఆచరణలోకి వచ్చేదీ చెప్పలేదన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో క్లాస్ 3,4 పోస్టులు, టీచర్ల భర్తీ వంటివి వంద శాతం ఆదివాసులకు రిజర్వ్‌చేసే జిఒ 3 పునరుద్ధరణపట్ల మౌనం దాల్చడం దారుణమని విమర్శించారు. ముఖ్యమంత్రి వాగ్దానం మాటల్లో తప్ప గవర్నర్ ప్రసంగంలో పేర్కొనకపోవడం ఆదివాసీ యువతను వంచించడమేనన్నారు. దళితులు, బిసి, మైనార్టీల సంక్షేమం గురించి నిర్దిష్టంగా ఏమీ లేదని, మహిళలపై నిత్యం అత్యాచారాలు జరుగుతున్నా స్పందన లేదని తెలిపారు. యాప్‌లు సృష్టించడం దానికి పరిష్కారం కాదని, ఇప్పటికే టీచర్లు, అంగన్‌వాడీ, ఆశా తదితర ఉద్యోగులు మొబైల్ యాప్స్ వద్దు, మొర్రో అంటుంటే ఎన్నెన్నో కొత్త యాప్స్ తెస్తామని, గొప్పగా చెప్పడం దారుణమని పేర్కొన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల గురించి ప్రస్తావనే లేదని, ప్రత్యేకహోదాను వదులుకొని పెట్టుబడులకోసం దేశాలు పట్టుకొని తిరగడం వల్ల ప్రయోజనం ఉండదని వివరించారు. ప్రసంగంలో పేర్కొన్న పెట్టుబడుల ఒప్పందాలు ఇంత వరకు ఒక్కటీ ఆచరణకు రాలేదని, ప్రభుత్వ రంగ పరిశ్రమల్లోనే ఎంతో కొంత పురోగతి ఉందని, పైగా దాన్ని విస్మరించడంతోపాటు కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టుగా దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. మిర్చి,ధాన్యం,పత్తి తదితరపంటలకు మద్దతు ధర లభించడం లేదని, కొన్ని పంటలకు పెట్టుబడులు పెరిగి రైతులు, కౌలుదార్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న దయనీయస్థితిలో 'నేడు ఏ రైతు కూడా కష్టాల్లో లేరని చెప్పడాన్ని గర్విస్తున్నాము' అని (పేరా 47) గవర్నర్ ప్రసంగంలో చెప్పడం వాస్తవాలను కప్పిపుచ్చడమేనని విమర్శించారు. ప్రభుత్వమే ఇంత 'గర్వపడుతుంటే' రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి గురించి సానుకూల చర్యలు తీసుకుంటుందని ఆశించగలమా అని ప్రశ్నించారు. వ్యవసాయానికి ఆయువుపట్టయిన సాగునీటి విషయంలోనూ సర్కారు దృష్టి తేడాగా ఉందని, కొత్తగా నీటి విధానం (వాటర్ పాలసీ) తీసుకొస్తామంటూ అందులో 'గృహ అవసరాలు, పారిశ్రామిక, వ్యవసాయ ఇతర వినియోగదార్లకు' (పేరా 39) అని ప్రాధాన్యత నిర్ణయించడం పలు సందేహాలకు తావిస్తోందని పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీల భారం, అదాని-సెకీ తప్పుడు ఒప్పందాల గురించి ప్రస్తావన లేదని, గిరిజన హక్కులకు ముప్పు ఏర్పడిందంటూ ఇటీవల ఏజన్సీ బంద్ సైతం నిర్వహించిన నేపథ్యంలో ఆ హక్కుల రక్షణ గురించి ప్రసంగంలో ప్రస్తావించకపోవడం నిర్లక్ష్యం వహించడమేనన్నారు. టిడిపి కూటమి మేనిఫెస్టోలో వివిధ పథకాలను ఎప్పుడు, ఎంత విస్తృతంగా అమలు చేసేదీ, సమాజంలో అట్టడుగువర్గాలు, తరగతుల సంక్షేమానికి తీసుకోబోయే చర్యల గురించి నిర్దిష్టంగా పేర్కొంటూ గవర్నర్ ప్రసంగాన్ని సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం కోరింది.

పోలింగ్ ఏజెంట్లు బూత్‌లలోకి

ఓటర్ల లిస్టులు తీసుకెళ్లేందుకు అనుమతివ్వండి

- సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచండి
- సిఇఓకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టభద్రుల ఎన్నికల్లో పోలింగు ఏజెంట్లు ఓటరు లిస్టులు తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు చీఫ్ ఎలక్టోరల్ అధికారిని కోరారు. ఈ మేరకు సోమవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జయరామ్‌తో కలిసి సిఇఓ వివేక్‌యాదవ్‌కు పలు అంశాలతో వినతిపత్రాన్ని సమర్పించారు. దీనికి స్పందించిన సిఇఓ అన్నిచోట్ల ఓటర్ల లిస్టులు తీసుకురావడానికి నిబంధనలు అనుమతిస్తాయని, అన్నిచోట్ల వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, సమస్యాత్మక ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 22వ తేదీన గుంటూరులో రిటర్నింగ్ ఆఫీసర్ (కలెక్టర్) పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం నిర్వహించిన అభ్యర్థులు/ఎలక్షన్ ఏజెంట్ల సమావేశంలో పోలింగ్ రోజున (ఫిబ్రవరి 27) ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల తరపున ఆయా బూత్‌లో ఉండే పోలింగ్ ఏజెంట్లు ఓటర్ల లిస్టును తీసుకురాకూడదని చెప్పారని పేర్కొన్నారు. వారికేమైనా ఓట్లు వేసేవారి పట్ల అనుమానాలు, అభ్యంతరాలు ఉంటే పోలింగ్ అధికారుల వద్ద రెండు లిస్టులు ఉంటాయని వాటిని పరిశీలించాలని చెప్పారని పేర్కొన్నారు. ఈ రకంగా సూచనలు చేయడం, దానిని అమలు చేయాలని భావించడం ఎలక్షన్ కమిషన్ అభ్యర్థులకు ఇచ్చిన హ్యాండ్ బుక్‌లో ని(12, 12.1, 13.1) నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ రకంగా చేయడం వల్ల పోలింగ్ ఏజెంట్ల వ్యవస్థ నిష్ప్రయోజనం అవుతుందని, కొంతమంది అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు మాత్రమే తోడ్పడుతుందని వివరించారు. అభ్యర్థుల తరపున 25 మంది ఉన్నప్పుడు ఇటువంటి పద్ధతి ఏరకంగానూ ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితాలో కూడా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎన్నికల రోజున వాటిని నివారించేందుకు కూడా పోలింగ్ ఏజెంట్లు ఓటర్ల లిస్టు తీసుకెళ్లడం తప్పనిసరని వినతిపత్రంలో పేర్కొన్నారు. తక్షణమే దీనిపై జోక్యం చేసుకొని ప్రతి పోలింగ్ ఏజెంట్ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తనతోపాటు ఓటర్ల లిస్టును తీసుకు వెళ్లేందుకు అనుమతినిస్తూ తక్షణమే తగు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరారు. ఎన్నికల రోజున స్వేచ్ఛగా ఓటు వేసేందుకు వీలుగా పూర్తి స్థాయి భద్రతా మరియు నిఘా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకించి పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వెల్దుర్తి మండలం, అమరావతి మండలంలోని గ్రామాలు, పెదకూరపాడు, బాపట్ల జిల్లా వేమూరు, అమృతలూరు ప్రాంతాల్లో ఓటర్లను రాకుండా నిరోధించే అవకాశం ఉందని, అలాగే భయబ్రాంతులను చేసే ప్రమాదమూ ఉందని సిఇఓ దృష్టికి తీసుకువచ్చారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేసి సిఇఓ కార్యాలయం నుండి వీటిని పర్యవేక్షించి ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేటట్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఓటర్లను వివిధ రూపాల్లో ప్రలోభపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో వాటిని నివారించేందుకు విస్తృతంగా దళాలు ఏర్పాటు చేయాలని, ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేసేవారిపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్లలో వాట్సాప్ గవర్నెన్స్ సెల్

- ప్రజలకు విస్తృత అవగాహన
- డ్రోన్‌తో పెట్రోలింగ్ వ్యవస్థ
- ఆర్‌టిజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో ప్రత్యేకంగా 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సెల్ ఏర్పాటు చేసి, ప్రజలు విస్తృతంగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌తో 500 సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తుందని చెప్పారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభతరంగా అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా ఆ ప్రాంతా ప్రజలకు దీనిపై అవగాహన కల్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఇంట్లో ఒక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నిపుణులు ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో టెక్నాలజీని విరివిగా వాడుకుని సత్ఫలితాలు సాధించాలని ఆదేశించారు. పోలీసుల గస్తీకి సమాంతరంగా డ్రోన్లను విరివిగా వినియోగించుకుని డ్రోన్ పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దీనివల్ల పోలీసులకు గస్తీ మరింత సులభతరమవుతుందని తెలిపారు. పెన్షన్ల పంపిణీకి జిపిఎస్ ట్రాకింగ్ వ్యవస్థ పెట్టి పర్యవేక్షించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో బెల్టు షాపులపట్ల అధికారులు కఠినంగా ఉండాలని, వాటిని ఏమాత్రం ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో బెల్టు షాపులు నడుస్తున్నాయని ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. వీటిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. బెల్టుషాపులకు ఎవరు మద్యం సరఫరా చేస్తున్నారనేది నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిఎస్ విజయానంద్, జిఎడి ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సిఎం కార్యదర్శులు ప్రద్యుమ్న, రవిచంద్ర, రాజమౌళి, ఆర్టిజిఎస్ సిఇఒ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

- ఎమ్మెల్సీ ఎన్నికలపై మంత్రి లోకేష్ సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉభయ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు తొలి ప్రాధాన్యత ఓట్లుతోనే భారీ మెజార్టీతో ఘన విజయం సాధించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నేతలతో ఉండవల్లిలోని తననివాసంలో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ప్రచారానికి అతితక్కువ సమయం మాత్రమే ఉందని టెక్నాలజీని వినియోగించాలని చెప్పారు. ప్రతి ఓటరు పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.

ఫలించిన బాబు ప్రయత్నాలు

రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రయత్నాలు ఫలించాయని లోకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు చెరోసగం భరించేలా మిర్చి రైతులకు క్వింటాలు కనీస మద్దతు ధర రూ.11,781లు చెల్లించేందుకు కేంద్రం అంగీకరించిందని ఆయన తెలిపారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే పిడిఎఫ్ ఎజెండా

- అసత్యాలను ప్రచారం చేయడం బాధాకరం
- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర సమగ్రాభివృద్ధి మాత్రమే ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎజెండా అని, ప్రజల పక్షాన నిరంతరం నిలబడటం మాత్రమే పిడిఎఫ్ ఆచరణ, లక్ష్యమనిమాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తటస్థంగా ఉంటూ 18 ఏళ్ల నుంచి 14 మంది శాసన మండలి సభ్యులుగా కొనసాగుతున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలిచినా ఇదే పద్ధతి పాటిస్తామన్నారు. ఈ విషయాన్ని విద్యావంతులు గుర్తించాలని కోరారు. ఎన్నికలలో పరిస్థితి సానుకూలంగా మారుతోందని, క్షేత్ర స్థాయిలో ఈ విషయంపై చర్చ జరుగుతుందన్నారు. ఈ దశలో తప్పుదొవ పట్టించే ఏ ప్రయత్నానైనా వినయంగానే ఖండిస్తున్నట్లు చెప్పారు. పిడిఎఫ్ అభ్యర్థిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ పిల్లలు, తల్లిదండ్రుల పాలిట తీవ్రమైన భారంగా మారిందన్నారు పాఠశాల విద్యలో రాష్ట్రం 11వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యపరమైన ఖర్చుల వల్ల 29 శాతం మంది పేదరికంలోకి వెళుతున్నారని తెలిపారు. విభజన అనంతరం నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందని, దీన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చకు రావాలన్నారు. విభజన అనంతరం కేంద్ర సాయం కూడా లేదన్నారు. ఈ మధ్య కాలంలో రాజ్యాంగ హక్కులను హరించడం చూస్తూనే ఉన్నామన్నారు. ఈ పరిస్థితిలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి గురించి చర్చించుకునేందుకు వేదికగా ఈ ఎన్నికలు జరగాలని కోరుతున్నామన్నారు. దురదృష్టవశాత్తు... కొన్నాళ్ల కిందట మాజీ సిఎంను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న సమయంలో ఒక కాగితం కింద పడితే దానిని తీసేందుకు వంగితే, మాజీ సిఎం కాళ్లపై పడ్డారని వీడియో ట్రోల్ చేయడాన్ని తప్పుబట్టారు. ఆనారోగ్యంతో ఒక రోజు సభకు రాకపోతే అది పెద్ద తప్పిదమైనట్లు చూపడం బాధాకరమైన విషయమన్నారు. లక్ష్మణరావుకు 14 ఏళ్లకుపైగా ఎమ్మెల్సీగా పని చేశారని, 25 ఏళ్లకుపైగా ప్రజల కోసం పోరాటం చేస్తున్నారని, 30 ఏళ్లకుపైగా అధ్యాపకులుగా పని చేస్తున్నారని చెప్పారు. లక్ష్మణరావు జీవితం ఒక తెరిచిన పుస్తకమన్నారు.

ఒక రకంగా చెప్పాలంటే ఇది విద్యావంతులను అవమానపరిచినట్లని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలుగా తాము ఏ పరిస్థితుల్లోను ఎన్నికల కంటే విలువలను ప్రధానంగా చూస్తామన్నారు. ప్రత్యర్థుల మీద దూషణలు చేయమని, నిందలు వేయమన్నారు. ప్రధాన అంశాల గురించే మాట్లాడతామన్నారు. గ్రూప్ 2 అంశం వివాదంగా మారే పరిస్థితి కనిపిస్తుందన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయప్రకాష్, విశ్రాంత ప్రిన్సిపాళ్లు ఎస్.పి రామరాజు, ఎన్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

తప్పులను ప్రశ్నిస్తామనే భయం

- మాజీ మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తప్పులను ప్రశ్నిస్తామనే భయంతోనే వైసిపి ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం భయపడుతోందని మాజీ మంత్రి, వైసిపి నాయకులు ఆర్‌కె.రోజా విమర్శించారు. సోమవారం సాయంత్రం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారని అన్నారు., హామీలు అమలుపై ఎక్కడా స్పష్టత లేదని అన్నారు. ఐదేళ్ల పాలనకే ప్రజలు చంద్రబాబుకు ఓటు వేశారని, గవర్నర్ ప్రసంగంలో విజన్ 2047 గురించి మాట్లాడించడం హాస్యాస్పదమని తెలిపారు. గవర్నర్ ప్రసంగంలో మద్యం రేట్లు పెంచబోమని చెప్పించారని, ఇటీవలే మద్యం రేట్లు పెంచారని విమర్శించారు. ప్రతిపక్ష హోదాపై పవన్ వ్యాఖ్యలు అర్థరహితమని చెప్పారు. ఆయన డిప్యూటీ సిఎంగా రాజీనామా చేసి ప్రతిపక్షంగా చంద్రబాబునాయుడిని నిలదీయాలని పవన్‌ను కోరారు.

ప్రతిపక్ష హోదా కోసం..

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందని చెబుతున్నారే తప్ప ప్రజలకు వారేం చేస్తారో చెప్పడం లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రజల గళాన్ని వినిపిస్తామనే కక్షతోనే తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వైసిపి ఎంఎల్‌ఎ తాటిపత్రి చంద్రశేఖర్,ఎంఎల్‌సి కల్యాణి తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని అన్నారు. వైసిపికి ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఢిల్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నా ప్రతిపక్ష హోదా ఇచ్చారని తెలిపారు.

ప్రతిపక్ష హోదాపై ప్రజలకు తెలియాలనే..

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతిపక్ష హోదా విషయంలో అధికార పార్టీ వైఖరిని ప్రజలకు తేటతెల్లం చేసేందుకే అసెంబ్లీకి వెళ్లామని వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన అనంతరం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆ పార్టీకి చెందిన ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలతో ఆయన సమావేశమైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా ఇస్తే హక్కుగా సమయం ఇవ్వాల్సి ఉంటుందని, అందుకనే హోదా ఇవ్వడం లేదని అన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుపోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతోందని చెప్పారు. 'యుద్ధరంగంలో ఉన్నాం.. అవకాశాలను వినియోగించుకుని విజయం దిశగా అడుగులు వేయాలి' అని అన్నారు. ప్రభుత్వాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీకోసం, ప్రజల కోసం పనిచేస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, కళ్లమూసుకుని, తెరిచేలోగా మరో ఏడాది గడిచిపోతుందని తెలిపారు. 'జమిలి ఎన్నికలు అంటున్నారు. అదేజరిగితే మరింత ముందుగా ఎన్నికలు వస్తాయి. ప్రజా సమస్యల విషయంలో రాజీ పడవద్దు' అని చెప్పారు. రాజకీయాల్లో విశ్వసనీయత, విలువలు పాటిస్తున్నామని, అందువల్లే క్లిష్టపరిస్థితులను అధిగమించామని చెప్పారు. సభలో ఏ అంశంపైన అయినా ఆధారాలు, రుజువులతో మాట్లాడుతానని అన్నారు. కౌన్సిల్లో మంచి మెజార్టీ ఉందని, దీన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఇదే సమయంలో అన్యాయంగా ఇళ్లపట్టాలు తొలగిస్తున్నారని, కాలనీల పేరు మారుస్తున్నారని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జగన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన జగన్ పట్టాలు తొలగిస్తే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. పేరు మార్చే పేరుతో అంబేద్కర్ విగ్రహంపైనే దాడిచేసిన చరిత్ర టిడిపికి ఉందని అన్నారు.

ఈ ఐదేళ్లలో రాదు : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపికి ఈ ఐదేళ్లలో ప్రతిపక్ష హోదా రాదని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోమవారం శాసనసభ ముగిసిన తర్వాత పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ 'ఆ విషయం ఫిక్స్ అయిపోయింది.' అని అన్నారు. సిఎం చంద్రబాబు లేక తానో కావాలని ఆ పని చేయడం లేదని, ప్రజలిచ్చిన తీర్పు ప్రకారం రాజ్యాంగంలో నిబంధనల ప్రకారం ఆపార్టీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే అవకాశం లేదని చెప్పారు. పజాస్వామ్య పద్ధతుల ప్రకారం ప్రతిపక్ష హోదా దక్కడానికి కావాల్సిన సీట్లు ఆ పార్టీ గెలవలేకపోయిందన్నారు. విషయం తెలిసి కూడా శాసనసభ సమయాన్ని వృథా చేస్తున్నారన్నారురాష్ట్ర అసెంబ్లీలో రెండో అతిపెద్దపార్టీగా జనసేన ఉందన్నా రు. జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ తెచ్చుకుని ఉంటే వైసిపికి ప్రతిపక్ష హోదా అడగకుండానే వచ్చేదని చెప్పారు.

గవర్నర్ ప్రసంగంలో పస లేదు

- పిసిసి చీఫ్ షర్మిల

గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంలో పస లేదని, దిశా - నిర్దేశం అంతకన్నా లేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్ షర్మిల పేర్కొన్నారు. అర్ధసత్యాలు, పూర్తి అబద్ధాలతో ప్రసంగం పూర్తి చేశారని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన లేదన్నారు. సంక్షేమం, పునరుజ్జీవం అంటున్నారే తప్ప ఎప్పటి నుంచి అమలు చేస్తారో తేల్చలేదన్నారు. ఇచ్చిన ఒక్క గ్యాస్ సిలిండర్ తప్ప, మిగతా 5 హామీలపై క్లారిటీ ఇవ్వలేదని తెలిపారు. సిఎం చంద్రబాబు విజన్ 2047కు దమ్ము లేదన్నారు. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం తీవ్ర నిరాశను మిగిల్చిందని తెలిపారు. రూ.6.50 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి ఎక్కడొచ్చాయని ప్రశ్నించారు. 4 లక్షల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎవరికిచ్చారో చెప్పాలన్నారు. తొలి సంతకం పెట్టిన డిఎస్సికి అసలు నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. మరోవైపు, జనాలు ఛీ కొడుతున్నా వైసిపి అధ్యక్షులు జగన్ తీరు మారలేదన్నారు. 11 మంది ఎమ్మెల్యేలతో కలిసి 11 నిమిషాలు ఉండటానికా సభకు వచ్చిందని ప్రశ్నించారు.

ఎన్నికల వాగ్దానాలను వల్లెవేసిన గవర్నర్

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం ఆసాంతం తెలుగుదేశం ఎన్నికల వాగ్దానాలకే పరిమితమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అధికార పార్టీ ఎన్నికల వాగ్దానాలను గవర్నర్ మరోమారు ఉటంకించారని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వీటి అమలు కోసం చేపట్టాల్సిన చర్యల గురించి ప్రసంగంలో ప్రస్తావించలేదన్నారు. తల్లికి వందనం, అన్నాదాత సుఖీభవ వంటి పథకాల గురించి ప్రస్తావించారే తప్ప అమలు తీరు వెల్లడించలేదన్నారు. ఒక వైపు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితుల్లో అల్లాడుతుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉందని చెప్పడాన్ని తప్పుబట్టారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో కొత్త విధానం అమలుపరుస్తామంటూ వాటిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టే పరిస్థితులు కనపడుతున్నాయని తెలిపారు. గత మూడు, నాలుగు దశాబ్దాలుగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి సరైన చర్యలు చేపట్టకుండా కొత్త ప్రాజెక్టులు ప్రకటించడంతో రైతులకు ఏ విధంగా లబ్ధిచేకూరుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

అసెంబ్లీ పాసుల విషయంలో వివక్ష తగదు

- ఎపిడబ్ల్యూజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కవరేజ్ నిమిత్తం మీడియా సంస్థలకు ఇచ్చే పాసులు విషయంలో వివక్ష తగదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) పేర్కొంది. చట్టసభల్లో జరిగే కార్యకలాపాలను మీడియా సంస్థల ద్వారా ప్రజలకు చేరవేయాల్సిన విధిని జర్నలిస్టులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో అసెంబ్లీ అధికారులు అనుసరిస్తున్న వైఖరిని ఎపిడబ్ల్యూజెఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ కన్వీనర్లు వి.శ్రీనివాసరావు, కె.మునిరాజు తప్పుబట్టారు. అసెంబ్లీ పాసులను టివి 9, ఎన్టీవి, 10 టివి, సాక్షి మీడియా సంస్థలకు నిరాకరించినట్లు తెలిసిందని, ఈ విషయంపై సభాపతి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించి, మీడియా సంస్థలన్నింటికీ తగిన రీతిలో పాస్‌లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఒకరిని అక్కున చేర్చుకుని మరొకరిని పక్కకు నెట్టడం సమంజసం కాదన్నారు. మీడియా సంస్థలకు పాసుల మంజూరు విషయంలో అధికారుల తీరు మీడియాను అవమానించేదిగా ఉందని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఎపిఎంపిఎ) పేర్కొంది. అసోసియేషన్ అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ ప్రభుత్వం తీరును ఖండిస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు.

గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఎపిని మార్చండి : సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు పూర్తి సమన్వయంతో పని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. సోమవారం నార్కో కో ఆర్డినేషన్‌కు సంబంధించి మొదటి రాష్ట్ర స్థాయి సమావేశంఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి,డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ లక్ష్యంతోనే గత నవంబరు నుంచి రాష్ట్రంలో ప్రత్యేకంగా ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.డీ అడిక్షన్ కేంద్రాలును పూర్తి స్థాయిలో మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించి సమీక్షించి సమీక్షించడం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా వరకు గంజాయి సాగు తగ్గిందని, ఒడిస్సా నుంచి రాష్ట్రం మీదుగా గంజాయి సాగవుతోందన్నారు. ఈగల్ ఐజిపి రవికృష్ణ మాట్లాడుతూ 2024లో జిల్లా స్థాయిలో ఎన్కార్డు సమావేశాలు, 2025లో ఇప్పటి వరకు రెండు సమావేశాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల రవాణా నియంత్రణకు 26 జిల్లాల్లో జరిగే నార్కోటిక్స్‌కంట్రోల్ సెల్స్ పనిచేస్తున్నాయని, ఈగల్ టోల్‌ఫ్రీ నెంబరు 1972 నంబరు పనిచేస్తోందన్నారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావుపై దుష్ప్రచారం

- ఎలక్షన్ ఆఫీసర్, డిజిపి, కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న తనపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు వచ్చినప్పుడు హెలిప్యాడ్ వద్ద ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న సందర్భంలో కిందపడిన ఒక పేపర్ తీసుకుంటుంటే జగన్ కాళ్లు పట్టుకుంటున్నట్లు చిత్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. గత మూడు పర్యాయాలుగా ఎమ్మెల్సీగా అనేక ప్రజా సమస్యలపై అవిరళ కృషి చేశానన్నారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిని కోరారు. 'పాదాలపై పడిన కె.ఎస్.లక్ష్మణరావు' అని ఓటర్లలో గందరగోళం సృష్టించి లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కొంతమంది సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని, వీటిపై విచారణ జరిపి బాధ్యులైన వ్యక్తులపై తగు చర్యలను తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు లక్ష్మణరావు తరుపున ఆయన చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ ఎన్.రమేష్‌బాబు సోమవారం చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌కు, డిజిపికి, గుంటూరు కలెక్టర్‌కు, ఎస్‌పికి సోమవారం ఫిర్యాదు చేశారు.

వైష్ణవిశ్రీకి ఉమ్మడిశెట్టి అవార్డు

ప్రజాశక్తి - అనంతపురం

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు-2024కు కవయిత్రి వైష్ణవిశ్రీ కవిత్వం 'రెండు ప్రపంచాల మధ్య' ఎంపికైనట్లు ఉమ్మడిశెట్టి పురస్కారం వ్యవస్థాపకులు డాక్టర్ రాధేయ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఏడాది అవార్డు న్యాయ నిర్ణేతలుగా ఆచార్య మేడిపల్లి రవికుమార్, కవి సీతారాం, అద్దేపల్లి ప్రభు వ్యవహరించారు. "స్త్రీ ఎరుకను ప్రగతిశీల దృక్పథంతో హృదయానికి హత్తుకున్న కవిత్వం ఇది. తెలుగునాట గడచిన రెండు దశాబ్దాల వాదాల ప్రభావమూ, అనంతర సమన్వయమూ ఇందులో కనిపిస్తుందని' న్యాయనిర్ణేతలు అభిప్రాయపడ్డారు. అవార్డు పొందిన వైష్ణవి శ్రీ గతంలో ఉపాధ్యాయురాలిగాచ ప్రజాశక్తిలో సబెడిటర్‌గా పనిచేశారు. కవయిత్రిగా తనదైన శైలిని నిలుపుకున్నారు. ఏడవ రుతువు (2019), దేశమంతా వాళ్ళ ఊరు (2021), అటుగా వంగిన ఆకాశం (2022), రెండు ప్రపంచాల మధ్య (2024) కవితా సంపుటాలను వెలువరించారు. ఇటీవలే ప్రొఫెసర్ సాయిబాబా గారి స్ఫూర్తితో 'నువ్వెళ్ళిన దారిలో' కవితా సంకలనానికి సంపాదకత్వం వహించారు.

ఎసిబి వలలో నగర పంచాయతీ కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కారు. ఎసిబి డిఎస్‌పి బివిఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నగర పంచాయతీ పరిధిలోని ఒక ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ రౌతు భారతి 2017లో ఒక ఉపాధ్యాయరాలికి పురుడు పోశారు. రెండు నెలలు ఆలస్యంగా పుట్టిన తేదీ నమోదు కోసం నగర పంచాయతీకి పంపారు. భారతి అంటే గిట్టని మరో ఉపాధ్యాయురాలు కమిషనర్‌కు అప్పట్లో ఫిర్యాదు చేశారు. తనకు ఇబ్బంది లేకుండా వైద్యరాలితో కమిషనర్ 2023లో రూ.500 చలానా తీయించారు. దీంతో అనురాధ ఈ ఫిర్యాదును విజయవాడ సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు నివేదించారు. దీనిపై వివరణ ఇవ్వాల్సి ఉందని, లేకుంటే ఇబ్బందులకు గురవుతారని వైద్యురాలిని కమిషనర్ భయపెట్టి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. డ్రైవర్ ఆ డబ్బును తీసుకుని గాయత్రీనగర్‌లో తన ఇంటి దగ్గర కమిషనర్‌కు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. కమిషనర్, డ్రైవర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.మంగళవారం ఎసిబి కోర్టుకు తరలించనున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

ఎస్‌వి ప్రాణదానం ట్రస్టుకు రూ.పది లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల ఎస్‌వి ప్రాణదానం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులు రూ.పదిలక్షల విరాళం ఇచ్చారు. ఈ చెక్కును టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి అందజేశారు. గతంలో టిటిడిలోని వివిధ పథకాలకు శ్రీనివాసులు రెడ్డి రూ. 30 లక్షలను విరాళంగా అందజేశారు. విరాళ దాతను వెంకయ్య చౌదరి అభినందించారు.

పొగాకు బోర్డు వైస్‌చైర్మన్‌గా బ్రహ్మయ్య

- కర్ణాటకలో వంద మిలియన్ కిలోల పొగాకు సాగుకు అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు

కర్ణాటక ప్రాంతలో 2025-26 పంట కాలానికి వంద మిలియన్ కిలోల పంట పరిమాణానికి టుబాకో బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సోమవారం గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో జరిగిన 164వ బోర్డు సమావేశం నిర్ణయం తీసుకుంది. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కర్ణాటక పంట పరిమాణంపై నిర్ణయం తీసుకున్నారు. నూతన వైస్ చైర్మన్‌గా బొడ్డపాటి బ్రహ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, ఆక్షన్స్ డైరెక్టర్ బి.సి, శ్రీనివాస్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కొండచీపుర్లతో గిరిజనుల నిరసన

- అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించండి
- సీతంపేట, గుమ్మలక్ష్మీపురం జిసిసి వద్ద ఆందోళన

సీతంపేట జిసిసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

ఆరుగాలం శ్రమించి సేకరించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, అటవీ ఉత్పత్తులను గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని కోరుతూ సీతంపేట, గుమ్మలక్ష్మీపురం జిసిసి కార్యాలయాల వద్ద సోమవారం గిరిజనులు ఆందోళన చేశారు. తొలుత సీతంపేట గిరిజన సంఘం కార్యాలయం నుంచి వందలాది మంది గిరిజనులు కొండచీపుర్లను చేతపట్టుకొని జిసిసి కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. చీపుర్లకు కేటగిరి ప్రకారం రూ.70, రూ.60కు కొనుగోలు చేయాలని, కిలో జీడిపిక్కలు రూ.200, కేజీ చింతపండు రూ.50కు కొనుగోలు చేయాలని నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ... కొండచీపురులు, చింతపండుతో పాటు జిసిసి ద్వారా 80 కేజీల జీడిపిక్కలు రూ.16 వేలు చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోరుతూ ఇప్పటికే ఏజెన్సీ ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేశామని, వారు అసెంబ్లీలో చర్చించాలని కోరారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, నాయకులు బి.అప్పారావు, జె.శ్రీరాములు, గంగాధర్, భాస్కరరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

- హత్య వీడియో ఆధారంగా శిక్ష ఖరారు

కోర్టు వద్ద శిక్ష పడిన ఐదుగురు నిందితులు

ప్రజాశక్తి-అనంతపురం

ఓ హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన పవన్‌కుమార్ 2022 ఏప్రిల్ 12న హత్యకు గురయ్యారు. ఆయన, నార్పలకు చెందిన షాజిద్ మంచి స్నేహితులు. వారి మధ్య భేదాభిప్రాయాలు రావడంతో తరచూ ఘర్షణ పడేవారు. ఇవి తారాస్థాయికి చేరడంతో పవన్‌కుమార్ తన తల్లిదండ్రులతోపాటు కుటుంబాన్ని నార్పల నుంచి అనంతపురానికి మార్చారు. ఈ క్రమంలో 2022 ఏప్రిల్ 12న రేషన్ బియ్యం తీసుకునేందుకు తన తండ్రి శ్రీనివాసులతో కలిసి పవన్‌కుమార్ నార్పలకు వెళ్లారు. మధ్యాహ్నం తండ్రికి చెప్పకుండా తహశీల్దార్ కార్యాలయం వద్దకు పవన్ కుమార్ వెళ్లారు. అక్కడ షాజిద్ తారస పడడంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఆ క్రమంలో షాజిద్‌పై పవన్‌కుమార్ కత్తితో దాడి చేయగా, అతని చేతికి గాయాలయ్యాయి. అదే రోజు రాత్రి షాజిద్ తన అనుచరులైన చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్‌లను వెంట పెట్టుకుని పవన్‌కోసం గాలించారు. తిమ్మన్న తోట వద్ద పవన్ కుమార్ ఉన్నాడన్న సమాచారంతో ఐదుగురూ అక్కడికి వెళ్లి పవన్‌కుమార్ కన్పించగానే షాజిద్, తలారి సుధాకర్, తలారి అరుణ్ స్టీల్ రాడ్, కర్రలతో దాడి చేశారు. దీన్ని సెల్‌ఫోన్‌లో వీడియో తీయాలంటూ రమేష్, చిక్కేపల్లి నాగేంద్రను షాజిద్ ఆదేశించారు. దెబ్బలు తాళలేక పవన్‌కుమార్ అదే రోజు మరణించారు. దాడి చేసినప్పుడు తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటనపై అప్పటి నార్పల పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి నాగేంద్ర, తలారి సుధాకర్ సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యం చెప్పకపోయినప్పటికీ, సెల్‌ఫోన్‌లో నిక్షిప్తమైన సాక్ష్యంతో పాటు అధికారులు చెప్పిన సాక్ష్యం ఆధారంగా నేరం రుజువు కావడంతో నిందితులు షాజిద్, చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్‌లకు జీవిత కాలపు కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపుతున్న కార్మికులు

మా సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు పంపిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆప్కాస్ రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించే ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. ఒంగోలు హెడ్ పోస్టు ఆఫీస్ వద్ద నుంచి సిఎం చంద్రబాబు నాయుడుకు సోమవారం పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆప్కాస్‌తో గత నాలుగేళ్లు మున్సిపల్ కార్మికులుకు జీతాల సమస్య తలెత్తలేదన్నారు. దళారీలు లేనందున జీతాలు ప్రతి నెలా ఒకటి, రెండు తేదీల్లో కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు గుర్తు చేశారు. జీతాలలో కోతలు లేవని, పిఎఫ్, ఇఎస్ఐ లాంటి సమస్యలు కూడా ఉత్పన్నం కాలేదని తెలిపారు. కార్మికులకు ఎలాంటి బెదిరింపలూ లేవన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు ఇస్తే ప్రతి నెల జీతాలు క్రమంగా ఇచ్చే పరిస్థితి ఉండదని, ఇపిఎఫ్, ఇఎస్ఐ వాటాలు సైతం సక్రమంగా చెల్లించరని తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితుల్లో కార్మికులు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి విధులు నిర్వహించారని తెలిపారు. అలాంటి కార్మికుల పట్ల ప్రభుత్వం వేధింపు చర్యలకు పాల్పడితే వారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె సామ్రాజ్యం యు కుమారి, కె మోహన్‌రావు, నగర కార్యదర్శి టి విజయమ్మ, జి నరసింహం, భారతి, ఆమని, అనిత, ప్రవీణ్, వై రవి, ఎం బాబు, బి అరుణ, ఎస్ కోటేశ్వరరావు, దివ్య, కె వంశీ పాల్గొన్నారు.

బడా సుబ్బిరెడ్డి మృతి

నాలుగు దశాబ్దాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకపాత్ర

బడా సుబ్బిరెడ్డి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కర్నూలు జిల్లాలో చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున తుది శ్వాస విడిచారు. సుబ్బిరెడ్డికి భార్య, కుమారుడు రాజశేఖర్‌రెడ్డి, కుమర్తె కళావతి ఉన్నారు. కదిరి ప్రాంతానికి చెందిన బడా సుబ్బిరెడ్డి సిపిఎం, రైతుసంఘం నాయకునిగా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలందరికీ సుపరిచితులు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం వరిగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆయన 1995లో పాడి రైతుల ఉత్పత్తిదారుల సంఘం నాయకునిగా ప్రజా ఉద్యమంలోకి అడుగు పెట్టారు. అక్కడి నుంచి రైతుసంఘం, సిపిఎం నాయకునిగా ఎదిగారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. నాలుగు దశాబ్దాల పాటు సిపిఎంలో ఉంటూ నమ్మిన సిద్ధాంతం కోసం మొక్కవోని దీక్షతో ప్రజాపోరాటాలు సాగించారు. సుబ్బిరెడ్డి అంత్యక్రియలు ఆయన వ్యవయసాయ క్షేత్రంలో పూర్తయ్యాయి. ఆయన నివాసం నుంచి వ్యవసాయ క్షేత్రం వరకూ అంతిమయాత్ర సాగింది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుతో పాటు పలువురు సంతాపం

బడా సుబ్బిరెడ్డి మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. సుబ్బిరెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి ఓదార్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్, మాజీ ఎమ్మెల్యేలు పివి సిద్ధారెడ్డి, అత్తార్ చాంద్‌బాషాలు, సిపిఎం రాష్ట్ర నాయకులు జి ఓబులు, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సిపిఎం, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు సుబ్బిరెడ్డి భౌతికకాయం వద్ద వద్ద నివాళులు అర్పించారు. ఆయన మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలురైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, ఎపి వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

పెదకాకానిలో విషాదం

- విద్యుదాఘాతానికి నలుగురు దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు కూలీలు.. ఒక సేవకుడు
- గోశాలలో బావి క్లీన్ చేస్తుండగా ఘటన

ప్రజాశక్తి-పెదకాకాని (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా పెదకాకానిలో విషాదం చోటు చేసుకుంది. నంబూరు కాళీబాబా ఆశ్రమ సమీపంలో గోశాలలో విద్యుదాఘాతానికి గురై నలుగురు మరణించారు. ఒకరిని కాపాడబోయి మరొకరు ఇలా వరుసగా నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు కూలీలు, ఒకరు సేవకుడు ఉన్నారు.

పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. తెనాలి సమీపంలోని చినరావూరు చెందిన గండాల మహంకాళి (29), అదే ప్రాంతానికి చెందిన వేటగిరి బాలయ్య (45), దుగ్గిరాల మండలం పెనుముడి గ్రామానికి చెందిన యాకుల రాజేష్ (20) ముగ్గురు గత సంవత్సర కాలంగా గోశాలలో కూలీలుగా పనిచేస్తున్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరుకు చెందిన మండాది కాళీ బాబు (52) గోశాలలో సేవ చేస్తున్నారు. గోశాలలోని వర్రల బావి శుభ్రం చేసే క్రమంలో వృథా నీటిని బయటకు పంపేందుకు విద్యుత్ కంప్రెషర్‌ను ఉపయోగించారు. అయితే కంప్రెషర్ వైర్లు తెగిపోయి విద్యుదాఘాతానికి మహంకాళి గురయ్యారు. అతన్ని కాపాడేందుకు రాజేష్ ప్రయత్నించగా అతను విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. వాళ్లిద్దరినీ కాపాడేందుకు బాలయ్య ప్రయత్నించగా ఆయన కూడా విద్యుదాఘాతానికి గురయ్యారు. వీరి ముగ్గురిని కాపాడటానికి ప్రయత్నించిన కాళీ బాబు కూడా విద్యుత్ షాక్ గురై మరణించారు. నలుగురు ఒకే చోట దుర్మరణం చెందారు. ఘటనా స్థలాన్ని గుంటూరు ఎస్‌పి సతీష్ కుమార్ సందర్శించారు. పెదకాకాని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి, మండల కార్యదర్శి ఎన్ శివాజి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.20 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

తప్పుదారి పట్టించే 'ఆయుర్వేద' ప్రకటనలపై చర్యలు

- ఎపి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసు
- 7న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ విచారణకు హాజరుకావాలి
- ఢిల్లీ, జమ్ము కాశ్మీర్‌లకు కూడా నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆయుర్వేద ఔషధాలకు సంబంధించి తప్పుదారి పట్టించే ప్రకటనలపై చర్యలు తీసుకునే అధికారాన్ని అధికారులకు ఇచ్చే డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్‌లోని నిబంధన 170ని ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, జమ్ముకాశ్మీర్ పాటించకపోవడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మూడు రాష్ట్రాలు 170వ నిబంధనను పాటిస్తున్నట్లు అఫిడవిట్లు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఈ మూడు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు మార్చి 7న జరిగే తదుపరి విచారణలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. గోవా, గుజరాత్ కొత్త అఫిడవిట్లను సమర్పించినందున, ఆ రెండు రాష్ట్రాల గురించి కోర్టు సమీక్షించలేదు. కోర్టుకు సహాయం చేస్తున్న అమికస్ క్యూరీ, 170వ నిబంధనను తొలగిస్తూ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 27న జారీ చేసిన ఉత్తర్వును ప్రస్తావించారు. ఈ నిబంధన అమలులో ఉంటుందని కోర్టు తీర్పు చెప్పింది. రాష్ట్రాలన్నీ నెల రోజుల్లోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించిన కోర్టు, తదుపరి విచారణను మార్చికి వాయిదా వేసింది. "మాకు చాలా కాలంగా ఉన్న అనుభవం ఏమిటంటే, ఆదేశాల అమలును నిర్ధారించడానికి ఇదే ఉత్తమ మార్గం. ప్రధాన కార్యదర్శులు వచ్చిన వెంటనే, అమలు చాలా సజావుగా జరుగుతుంది. దీనిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని వారికి ఇది సంకేతం" అని జస్టిస్ అజయ్ ఓకా అన్నారు.

గ్లోబ్ టెక్స్‌టైల్స్ లాభాల్లో 54 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో తమ సంస్థ నికర లాభాలు 53.7 శాతం పెరిగి రూ.2.91 కోట్లుగా నమోదయినట్లు గ్లోబ్ టెక్స్‌టైల్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1.89 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.103.67 కోట్ల రెవెన్యూ ఆర్జించగా.. గడిచిన క్యూ3లో 46.2 శాతం పెరుగుదలతో రూ.151.59 కోట్ల రెవెన్యూ ప్రకటించింది.

తమ వాటాదారులకు దీర్ఘకాలిక విలువను అందించడానికి మరియు లాభాలను పెంచే, స్థిరమైన విజయాన్ని నిర్ధారించే కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని గ్లోబ్ టెక్స్‌టైల్స్ సిఎండి భావిక్ పారిఖ్ పేర్కొన్నారు.

తుని మున్సిపల్ కమిషనర్ వెంకటరావుకు రాజీనామా పత్రం అందజేస్తున్న సుధారాణి

తుని మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా

- టిడిపి కూటమి నేతల వేధింపులు తాళలేకేనని ప్రకటన

ప్రజాశక్తి - కోటనందూరు (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తాను కౌన్సిలర్‌గా కొనసాగుతానని స్పష్టం చేశారు. రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావుకు అందించారు. తొలుత వైసిపి కౌన్సిలర్లతో కలిసి మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడిపి కూటమి నాయకుల వేధింపులను భరించలేక చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభం నుంచి నేటి వరకూ మహిళా కౌన్సిలర్లను అధికార టిడిపి నాయకులు భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. కౌన్సిలర్లను తమ ఇంట్లోనే దాచి పెట్టామనే ఆరోపణతో తనపై పోలీసులు కేసు నమోదు చేయడం దారుణమన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే యనమల దివ్య మహిళలే అయినా మహిళా కౌన్సిలర్లకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. వైస్ చైర్మన్ ఎన్నికల్లో గెలవడానికి 15 మంది కౌన్సిలర్ల బలం ఉన్నప్పటికీ వేధింపుల తాళలేక రాజీనామా చేస్తున్నట్లు కంటతడి పెట్టుకున్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ వారా జ్యోతిని టిడిపి కూటమి నాయకులు కలిసి తమకు మద్దతు ఇస్తే కావాల్సినవన్నీ ఇస్తామని ప్రలోభ పెట్టారని ఆరోపించారు. మున్సిపాలిటీని కైవసం చేసుకునేందుకు టిడిపి కూటమి నాయకులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

విశాఖపట్నం డిఐజి గోపీనాథ్‌శెట్టికి వినతిపత్రం అందిస్తున్న ప్రజాశక్తి బృందం

ప్రజాశక్తి విలేకరిపై దాడికి పాల్పడిన టిడిపి నాయకునిపై చర్యలు తీసుకోండి

- డిఐజికి వినతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన టిడిపి నాయకునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం విశాఖపట్నం డిఐజి గోపీనాథ్‌శెట్టికి ప్రజాశక్తి సిబ్బంది వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి రామారావుపై ఈ నెల 16న దాడికి పాల్పడి, చంపేస్తానంటూ బెదిరించిన స్థానిక టిడిపి మండల నాయకుడు గుల్ల వేణుగోపాలనాయుడుపై చర్యలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని వివరించారు. దీనిపై డిఐజి మాట్లాడుతూ స్థానిక సిఐతో చర్చిస్తున్నామని, జ్యుడీషియల్ అభిప్రాయం కోసం చూస్తున్నామని తెలిపారు. న్యాయపరమైన విషయంపై తానూ ఫాలో అప్ చేస్తున్నట్లు వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రజాశక్తి గ్రేటర్ విశాఖ బ్యూరో ఎన్ మధుసూదనరావు, స్టాఫ్ రిపోర్టర్ జి కాంతారావు, జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ రాజేష్‌రెడ్డి, ఫొటోగ్రాఫర్ రాజేష్ తదితరులు ఉన్నారు.

శ్రీరెడ్డికి ముందస్తు బెయిల్

ప్రజాశక్తి, అమరావతి

సినీనటి మల్లిడి విమల అలియాస్ శ్రీరెడ్డిపై విశాఖ 4వ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.10వేలతో రెండు పూచీకత్తులు, వారంలో ఒక రోజు సంబంధిత ఎస్‌హెచ్‌ఓ ఎదుట హాజరు కావడం వంటి షరతులు విధించింది. కర్నూలు, గుడివాడ, నెల్లిమర్ల తదితర పోలీస్ స్టేషన్లలో శ్రీరెడ్డిపై నమోదైన కేసులన్నీ ఏడేళ్లలోపు శిక్షలు పడేవని, బిఎన్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారమే పోలీసుల చర్యలు ఉండాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, అనితలను ఉద్దేశించి సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారంటూ శ్రీరెడ్డిపై పలు కేసులు నమోదయ్యాయి. వీటిని సవాలు చేసిన శ్రీరెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

న్యాయవాదుల చట్టం సవరణలపై కేంద్రం సమీక్ష

ప్రజాశక్తి, అమరావతి

న్యాయవాదుల చట్టం 1961కి సవరణలు తెచ్చే అంశాన్ని తిరిగి సమీక్షిస్తామని కేంద్రం తెలియజేసిందని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి సోమవారం వెల్లడించారు. కొత్త సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా బార్ కౌన్సిళ్లు, బార్ అసోసియేషన్లు నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ అభ్యంతరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకునేందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలియజేసిందన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేంద్ర న్యాయశాఖ మంత్రితో సంప్రదింపులు జరిపిందన్నారు. సవరణ బిల్లులను పున్ణ పరిశీలన చేస్తామని కేంద్ర మంత్రి బార్ కౌన్సిల్‌ఆఫ్ ఇండియాకు హామీ ఇచ్చారన్నారు. కాబట్టి న్యాయవాదులు తమ ఆందోళనలను విరమించి విధులు హాజరు కావాలంటూ సోమవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎల్ఐసికి రూ.57 కోట్ల జిఎస్‌టి నోటీసు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)కు జిఎస్‌టి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆర్థిక సంవత్సరం 2020-21గాను అదనపు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)కి సంబంధించి రూ.57.2 కోట్ల డిమాండ్ నోటీసును ఇచ్చారు. ఇది ఢిల్లీ అసిస్టెంట్ కమీషనర్ నుండి తమకు అందిందని ఎల్ఐసి సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఇందులో రూ.31.04 కోట్ల జిఎస్‌టి, రూ.23.13 కోట్ల వడ్డీ, రూ.3.10 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశాలు అందినట్లు వెల్లడించింది. ఇది తమ ఫైనాన్సీయల్, నిర్వహణ, ఇతర కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపబోదని ఎల్ఐసి తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి కొత్త వ్యాపార ప్రీమియం 21 శాతం వృద్ధితో రూ.43,075 కోట్లకు చేరింది. సంస్థ నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా తగ్గి రూ.2,01,994 కోట్లుగా చోటు చేసుకుంది. సోమవారం బిఎస్ఇలో ఎల్ఐసి షేర్ 0.69 శాతం తగ్గి రూ.775.90 వద్ద ముగిసింది.

ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఇలు వెన్నెముక

- యాక్సిస్ బ్యాంక్ ఇడి మునీష్ సర్దా

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఇలు వెన్నెముఖలాంటివని యాక్సిస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనీష్ సర్దా అన్నారు. హైదరాబాద్‌లో యాక్సిస్ బ్యాంక్ తమ నాలెడ్జ్ షేరింగ్ సెమినార్ 'ఎవాల్వ్' 9వ ఎడిషన్‌ను నిర్వహించింది. ఇందులో మునీష్ మాట్లాడుతూ.. జిడిపిలో ఎంఎస్ఎంఇలు దాదాపు మూడో వంతు వాటాను కలిగి ఉండి.. కోట్లాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఈ సంస్థలకు మద్దతును అందించడం ద్వారా సాధికారత కలిగించాలని తమ బ్యాంక్ నిర్దేశం చుకుందన్నారు. చిన్న పరిశ్రమలకు బాసటగా నిలుస్తున్నందుకు, వాటి ఆకాంక్షల సాధనలో తోడ్పాటు అందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. దీనికి యాక్సిస్ బ్యాంక్ ఉన్నతాధికారులు విజయ్ శెట్టి, నూతి చక్రవర్తి, సైబల్ సేన్ గుప్తా హాజరయ్యారు. ఎంఎస్ఎంఇలకు చెందిన 100 మంది పైగా ఔత్సాహికవేత్తలు పాల్గొన్నారు.

సంపాదకీయం

'సంస్కరణ'ల దిశ

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ సోమవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం కార్పొరేట్ సంస్కరణల మార్గాన్ని ఆవిష్కరించింది. కేంద్రంలోని మోడి ప్రభుత్వం నుంచి జాలువారిన వికసిత భారత్ లక్ష్యాల వెలుగులో సృష్టించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' అమలు ద్వారా సంపన్న, ఆరోగ్య, సంతోషకర రాష్ట్రాన్ని నిర్మిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం గవర్నర్ చేత చెప్పించింది. వికసిత భారత్ డాక్యుమెంట్ మొత్తం అదానీ, అంబానీ, బడా కార్పొరేట్ల దోపిడీకి పూచీ పడుతుంది. ఆ 'వికసిత భారతే' తమకు మూలం అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినందున 'స్వర్ణాంధ్ర విజన్' కూడా కార్పొరేట్ల దారేనని భావించాలి. రాబోయే 23 ఏళ్ల విజన్‌కు ప్రణాళిక వేసి అందులో తొలి ఐదేళ్లకు లక్ష్యాలను నిర్ణయించి వాటి సాధనకు విధాన పత్రాలు ప్రకటించింది టిడిపి కూటమి ప్రభుత్వం. విజన్ పత్రం, దాని సాధనకు ఎంచుకున్న పాలసీలు నయా-ఉదారవాద విధానాల చట్రంలో తయారయ్యాయి. వాటినే గవర్నర్ ప్రసంగంలో గుదిగుచ్చి తమ దారి 'సంస్కరణల' రహదారి అని మరింత గట్టిగా ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేసింది. కాగా ఈ గవర్నర్ ప్రసంగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. రాబోయే సంవత్సరానికి, ఆ మాటకొస్తే వచ్చే నాలుగున్నరేళ్లకూ దశా దిశాను తెలుపుతుంది. ఆ లెక్కన చూస్తే నిర్మితమయ్యేది కార్పొరేట్ ప్రభావిత రాష్ట్రమని గవర్నర్ ప్రసంగంతో అర్థమవుతుంది.

తమ పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఉంటుందని గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం ఎప్పుడూ పాడే పాటే పాడింది. తామొచ్చాక మొదలెట్టిన సామాజిక పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న కాంటీన్ల పునరుద్ధరణ వంటి పథకాలను గొప్పగా వల్లె వేసిన సర్కారు, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీల అమలు ఎప్పుడో నిర్దిష్టంగా పేర్కొనకపోవడం ఆయా వర్గాలను నిరాశ పర్చింది. రైతులకు అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు తప్ప ఎప్పటి నుంచో తెలపలేదు. గవర్నర్ మరోసారి కూటమి మేనిఫెస్టోను సోదహరణంగా ఒప్పజెప్పారంతే. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు గత వైసిపి వైఫల్య పాలనే కారణమని ఎనిమిది నెలలుగా ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఇప్పుడు కూడా అదే చెబితే చాలదు. పథకాల లబ్ధి, వాగ్దానాల అమలు కోసం ఎంతో ఆశతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ నడకను వెల్లడించే గవర్నర్ ప్రసంగంలో హామీల అమలుపై స్పష్టత రాకపోవడంతో ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు కలగడం సహజం. బడ్జెట్ వస్తే ప్రభుత్వ అసలు నైజం బయట పడుతుంది.

గవర్నర్ ప్రసంగంలో అసంబద్ధ, వాస్తవ విరుద్ధ విషయాలు చాలానే ఉన్నాయి. 'నేడు ఏ ఒక్క రైతూ కష్టాల్లో లేదని చెప్పడానికి గర్విస్తున్నాం' అని సర్కారు పేర్కొనడం ఏ స్థాయి స్వోత్కర్షనో అసెంబ్లీకి కూత వేటు దూరంలో ఉన్న గుంటూరు మిర్చియార్డులో ధర లేక రైతులు పడుతున్న అగచాట్లే నిదర్శనం. వ్యవసాయాన్ని టెక్నాలజీతో కొత్త పుంతలు తొక్కిస్తామనడం, డ్రోన్ల వినియోగం వంటివెన్నో వల్లె వేశారు తప్ప పంటలకు గిట్టుబాటు ధర, ఎంఎస్‌పికి చట్టబద్ధత, కౌలు రైతులెదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలను విస్మరించారు. లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఇవన్నీ అంతిమంగా కార్పొరేట్లకు లాభించేవే. విద్య, ఆరోగ్యం, తాగునీరు, విద్యుత్, ఒక్కటేమిటి... అన్నింటిలోనూ 'సంస్కరణల' ప్రస్తావనే. పి-4 జపమే! గిరిజన ప్రాంతాల అభివృద్ధి, వారి సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి, ఎస్‌సిల అభ్యున్నతి ఇవన్నీ మాటలకే పరిమితం. సబ్‌ప్లాన్ ఊసే లేదు. బిసిల రక్షణకు తెస్తామన్న చట్టానికి రోడ్‌మ్యాప్ రూపొందిస్తామనడం ఊరించడానికేననిపిస్తుంది. మహిళలపై దాడుల గురించి మర్చిపోయారు. ప్రత్యేక హోదా ప్రస్తావన లేకుండా, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి చెప్పకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనడం కేంద్ర బిజెపి ప్రభుత్వానికి నొప్పి కలిగించకూడదనే. 15 శాతం వృద్ధి, తలసరి ఆదాయం లక్ష్యం రూ.58 లక్షలు, 308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ ఇటువంటి గాలిలో మేడలు కట్టే మాటలకు గవర్నర్ ప్రసంగంలో కొదవ లేదు.

మహనీయుల మాట

> వాస్తవమైన సిద్ధాంతం సజీవంగానే వుంటుంది. జీవరాసుల్లా అది గూడా మార్పు చెందుతూనే వుంటుంది. నూతన విషయాలు కనుగొనబడినప్పుడు అది మరింత సంపద్వంతమవుతుంది. ఎందుకూ కొరగాని చచ్చు సిద్ధాంతాలే ఏ మార్పు లేకుండా జీవచ్ఛవాల్లా వుంటాయి!
>
> -సి.వి.

శ్రామిక జనావళిపై ప్రపంచవ్యాప్తంగా దౌర్జన్యం

> ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలతోబాటు ఇప్పుడు సైద్ధాంతిక దౌర్జన్యం కూడా కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. ఎవరో ఒకరో , కొద్దిమందో వ్యక్తులు అప్పుడప్పుడూ చేసే వ్యాఖ్యానాలకే ఈ దాడి పరిమితమై లేదు. ప్రపంచ వ్యాప్తంగా శ్రామికవర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యానాలు నిరంతరాయంగా వెలువడుతూనేవున్నాయి. శ్రామిక వర్గం మీద సైద్ధాంతిక దౌర్జన్యం పెరుగుతోందనడానికి ఇవి సూచికలు. భారత దేశంలో పెరుగుతున్న పేదరికం నేపథ్యంలో అనేక రాజకీయ పార్టీలు, కూటములు అధికారం కోసం పోటీ పడుతున్నాయి. ఈ వ్యవస్థ పెద్ద స్థాయిలో ఉపాధిని కల్పించడానికి అవకాశం ఇవ్వదు. అందుచేత ప్రజలకు రకరకాల పథకాల పేరుతో సహాయాన్ని అందిస్తామని ఈ పార్టీలు ముందుకొస్తున్నాయి. ఈ పథకాల ద్వారా ఒనగూడే ప్రయోజనాలు శ్రామికప్రజల పేదరికాన్ని తొలగించడానికి ఏ మాత్రమూ సరిపోవు. ఒకవేళ సరిపోయివుంటే, శ్రామిక ప్రజలలో ఇంతగా పౌష్టికాహార లోపం తలెత్తేది కాదు.

ప్రస్తుతం మలిదశలో ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామిక ప్రజానీకం మీద జరుగుతున్న దౌర్జన్యాలు పెట్టుబడిదారీ వ్యవస్థ తొలిదశ నాటి దౌర్జన్యాలను తలపిస్తున్నాయి. ఈ దౌర్జన్యం కేవలం మూడవ ప్రపంచ దేశాల శ్రామికుల మీద మాత్రమే కాక, సంపన్న పశ్చిమ దేశాలలో సైతం సాగుతోంది. ఈ దౌర్జన్యం మూడు స్థాయిలలో-ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక స్థాయిలలో- ఉంది.

ఆర్థికంగా సాగుతున్న దౌర్జన్యం గురించి ఎక్కువగానే చర్చిస్తున్నాం. ద్రవ్యోల్బణం వేగంగా పెరిగిపోవడం, నిరుద్యోగం చాలా ఎక్కువ స్థాయికి చేరుకోవడం ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థను బలంగా పీడిస్తున్నాయి. ప్రత్యేకించి అమెరికాలోని బడా పెట్టుబడిదారీ వర్గం ఎవరికి వారుగా తమ లాభాల వాటాలను పెంచుకోడానికి పూనుకోవడంతో మొదలై, తర్వాత యావత్ పెట్టుబడిదారీ ప్రపంచానికీ ఆ ధోరణి విస్తరించినందువలన దాని పర్యవసానంగా ద్రవ్యోల్బణం మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఆవరించింది. (ఈ క్రమాన్ని నేను మరో వ్యాసంలో తర్వాత వివరిస్తాను) ద్రవ్యోల్బణం కారణంగా నిరుద్యోగం పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ఉద్యోగాలమీద వేటు వేయడానికి పూనుకున్నాయి. దాని వలన కూడా నిరుద్యోగం మరింత పెరిగిపోతోంది. నిరుద్యోగం పెరిగితే, అప్పుడు పెరిగే ధరలకు అనుగుణంగా తమ వేతనాలను పెంచమని పోరాడేందుకు కార్మికులవద్ద శక్తి ఉండదని, వేతనాలపై చేయవలసిన ఖర్చు తగ్గిపోతే ద్రవ్యోల్బణం దానికదే అదుపులోకి వస్తుందన్నదే ప్రభుత్వాల ఆశ.


ప్రభాత్ పట్నాయక్

బ్రిటన్ లో పారిశ్రామిక విప్లవంగా అభివర్ణించే తొలిదశలోని పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదరికం బాగా పెరిగిపోవడం ఒక ప్రధాన లక్షణంగా ఉందని ఎరిక్ హాబ్స్‌బామ్ వంటి ప్రముఖ చరిత్రకారులు వివరించారు. అదే మాదిరిగా మలిదశలో కూడా శ్రామిక ప్రజానీకపు పేదరికస్థాయి తీవ్రమౌతోంది. 1968 నాటి వేతనాల స్థాయితో పోల్చితే అంతకన్నా 2011లోని అమెరికన్ కార్మికుల వేతనాల స్థాయి తక్కువగా ఉందని జోసెఫ్ స్టిగ్‌లిట్జ్ బలంగా వాదించారు. 2011తో పోల్చితే ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగా పెరిగిపోయింది. కాబట్టి ప్రస్తుత నిజ వేతనాల స్థాయి 2011 నాటికన్నా ఇంకా దిగజారిపోయిందని చెప్పవచ్చు. 1968తో పోల్చితే ఇప్పుడు అమెరికాలో నిరుద్యోగం ఇంకా ఎక్కువగా ఉంది. అందుచేత అప్పటికన్నా ఇప్పుడు అమెరికన్ కార్మికవర్గం మరింత పేదరికంలోకి దిగజారారని స్పష్టమవుతోంది. ఐతే, అధికారిక గణాంకాలు ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవు. నిరుద్యోగం తీవ్రగా పెరుగుతున్న కారణంగా ఉత్పత్తి ప్రక్రియలో కార్మికుల భాగస్వామ్యం తగ్గుతోందన్న వాస్తవాన్ని వారు లెక్కలోకి తీసుకోరు. అమెరికాలో ఉన్న మాదిరిగానే తక్కిన సంపన్న దేశాలలో కూడా శ్రామికవర్గం పరిస్థితి ఉంది. భారతదేశం, ఇతర మూడవ ప్రపంచదేశాలలో ప్రజానీకం పొందుతున్న పౌష్టికాహారస్థాయి పడిపోయిందని స్పష్టమైన ఆధారాలు వెల్లడిస్తున్నాయి. తలసరి ఆహారధాన్యాల వినియోగం తగ్గిపోవడం చూస్తున్నాం. మాంసాహార వినియోగంలో మార్పులు వచ్చినందునే ఇలా కనిపిస్తోందని అధికార వర్గాలు సమర్ధించుకుంటున్నాయి. కాని, కోళ్ళు. పశువుల మేతకు వినియోగించే ఆహార ధాన్యాలను కూడా మానవ వినియోగం కిందనే లెక్క వేసి చూసినా, తలసరి ఆహారధాన్యాల వినియోగం తగ్గిపోయింది. అందుచేత నిస్సందేహంగా శ్రామిక ప్రజానీకపు పేదరిక స్థాయి మరింత దిగజారిపోయిందన్నది స్పష్టమవుతోంది. అంటే, శ్రామిక వర్గం మీద, ప్రత్యేకించి పేద శ్రామిక ప్రజానీకం మీద పెట్టుబడిదారీ వ్యవస్థ సాగించే దౌర్జన్యం మరింత పెరిగిందన్నది నిర్వివాదం.

ఈ మాదిరిగా శ్రామిక వర్గం మీద ఆర్థికంగా దౌర్జన్యం నిరాటంకంగా కొనసాగాలంటే ఆ శ్రామిక ప్రజానీకపు రాజకీయ హక్కులను కట్టడి చేయడం తప్పనిసరి. అంటే ఆర్థిక దౌర్జన్యంతోబాటు శ్రామిక వర్గం మీద రాజకీయ దౌర్జన్యం కూడా కొనసాగాలి. ఈ రాజకీయ దౌర్జ్యం నేడు నయా ఫాసిజం రూపాన్ని తీసుకుంది. అందుకే పెట్టుబడిదారీ ప్రపంచం మొత్తంగా నయా ఫాసిజం ముందుకొచ్చింది. అనేక దేశాల్లో ప్రభుత్వాలు ఇప్పుడు నయా ఫాసిస్టు నాయకుల చేతుల్లో ఉన్నాయి. అర్జెంటీనాలో మిలెయ్, ఇటలీలో మెలొని, అమెరికాలో ట్రంప్, భారతదేశంలో మోడీ, హంగేరీ లో ఆర్బన్, టర్కీలో ఎర్డొగాన్, ఇజ్రాయిల్ లో నెతన్యాహు - ఇటువంటి నేతలే. ఇంకా పలు దేశాల్లో నయా ఫాసిస్టు నేతలు అధికారం చేజిక్కించుకునేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. జర్మనీలోని ఎఎఫ్‌డి పార్టీ, ఫ్రాన్స్ లో లీ పెన్ ఇటువంటివారిలో ఉన్నారు.

ఈ నయా ఫాసిస్టు శక్తులు తమ దాడిని నేరుగా కార్మికులమీద, కార్మిక సంఘాల మీద ఎక్కుపెడుతూ వారి ఉద్యమాలను అణగదొక్కడమే గాక, చట్టపరంగా కార్మికుల హక్కులను కూడా కుదించివేస్తున్నారు. మైనారిటీలుగా ఉండే కొంతమంది నిస్సహాయ సమూహాలపై 'వీళ్ళు మనవాళ్ళు కాదు' అన్న ముద్ర వేస్తూ వారి యెడల మెజారిటీ గా ఉండే కార్మికులలో శత్రుభావాన్ని రెచ్చగొడుతున్నారు. తద్వారా కార్మికుల నడుమ జరగవలసిన చర్చను పక్కదోవ పట్టిస్తున్నారు. దీని వలన శ్రామికవర్గం తమ దైనందిన, భౌతిక జీవితపు వాస్తవ సమస్యలమీద తగిన చర్చ చేయడం సాధ్యపడకుండా పోతోంది. అంతే గాక ఈ శ్రామిక వర్గం మత పరంగానో, వివిధ జాతుల పరంగానో చీలిపోయి, తమపై పెట్టుబడిదారీ వర్గం సాగించే దాడులను ప్రతిఘటించలేని నిస్సహాయ స్థితిలోకి పోతున్నది.

ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలతోబాటు ఇప్పుడు సైద్ధాంతిక దౌర్జన్యం కూడా కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. ఎవరో ఒకరో , కొద్దిమందో వ్యక్తులు అప్పుడప్పుడూ చేసే వ్యాఖ్యానాలకే ఈ దాడి పరిమితమై లేదు. ప్రపంచ వ్యాప్తంగా శ్రామికవర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యానాలు నిరంతరాయంగా వెలువడుతూనేవున్నాయి. శ్రామిక వర్గం మీద సైద్ధాంతిక దౌర్జన్యం పెరుగుతోందనడానికి ఇవి సూచికలు.

భారత దేశంలో పెరుగుతున్న పేదరికం నేపథ్యంలో అనేక రాజకీయ పార్టీలు, కూటములు అధికారం కోసం పోటీ పడుతున్నాయి. ఈ వ్యవస్థ పెద్ద స్థాయిలో ఉపాధిని కల్పించడానికి అవకాశం ఇవ్వదు. అందుచేత ప్రజలకు రకరకాల పథకాల పేరుతో సహాయాన్ని అందిస్తామని ఈ పార్టీలు ముందుకొస్తున్నాయి. ఈ పథకాల ద్వారా ఒనగూడే ప్రయోజనాలు శ్రామికప్రజల పేదరికాన్ని తొలగించడానికి ఏ మాత్రమూ సరిపోవు. ఒకవేళ సరిపోయివుంటే, శ్రామిక ప్రజలలో ఇంతగా పౌష్టికాహార లోపం తలెత్తేది కాదు. కాని, ఈ పథకాలకు పాలకవర్గ నయా ఫాసిస్టులు " ఉచితాలు" అని పేరు పెట్టి వాటిని అమలు చేయడాన్ని తప్పుపడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఇదే మాట్లాడుతున్నారు. ఐతే ఎన్నికల అవసరాల రీత్యా ఆ పాలకపార్టీలు కూడా సంక్షేమ పథకాలను చేపట్టక తప్పలేదు. అందుచేత ఇప్పుడు ఈ సంక్షేమ పథకాలమీద సైద్ధాంతిక దాడిని తక్కిన వ్యాపార వర్గాల వారు మొదలుబెట్టారు. కార్మికులు వారానికి 90 గంటలపాటు పని చేయాలని ఈ మధ్య ఒక బడా వ్యాపారవేత్త ప్రకటించారు. 'ఉచితాలు' ప్రజలను సోమరిపోతులుగా చేస్తాయని ఈసడించాడు. ఇప్పుడు ఏకంగా ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తి కూడా ఇదే పాట అందుకున్నారు. సంక్షేమ పథకాలు ఉన్నందువలన ప్రజలు పనీ పాటూ లేకుండా ఇళ్ళ దగ్గరే కాలక్షేపంచేస్తూ, వారి ఉచితాల'ను' పొందుతున్నారని ఆయన అన్నారు. ప్రజలందరికీ మంచి

ఉద్యోగాలను కల్పించి వారందరినీ పనుల్లోకి దింపి , ఆ పైన ఈ సంక్షేమ పథకాలను ఎత్తివేయాలని ఆ న్యాయమూర్తి ప్రభుత్వానికి సూచించివుంటే బాగుండేది. కాని ఆయనగారు కేవలం సంక్షేమ పథకాలమీద తన దాడిని ఎక్కుపెట్టారే తప్ప మంచి ఉద్యోగాలను కల్పించాలన్న అంశాన్ని మొత్తంగా విస్మరించారు.

ఉద్యోగాలు కావలసినన్ని ఉన్నాయని, కష్టపడి పని చేయకుండా 'ఉచితాలను' అందిస్తూంటే ఎవరు పని చేయడానికి ముందుకొస్తారని ఇటువంటి పెద్దమనుషులు వాదిస్తూంటారు. కాని వారి వాదనను సమర్ధించే వాస్తవిక ఆధారాలను మాత్రం చూపలేరు. నిజానికి చాలా ఉద్యోగాలు

ఉన్నాయని వారు చెప్పేవన్నీ 'అడుక్కు తినే స్థాయి కన్నా హీనంగా ' వేతనాలు చెల్లించేవే. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) భారతదేశంలో మంచి ఉద్యోగాలకు చాలా తీవ్రమైన కొరత ఉందని గుర్తించింది. ప్రభుత్వం చూపే ఉపాధి లెక్కలు తప్పుల తడకలుగా ఉన్నాయి. మహిళలు ఇళ్ళవద్ద, బైట కూడా చేసే శ్రమలో కూలి పొందకుండా చేసే శ్రమ పాలు చాలా ఎక్కువగా ఉంది. (గృహ పరిశ్రమలు, వ్యవసాయం, చేతివృత్తులు వగైరా) ఇది రాను రానూ మరింత పెరుగుతోంది కూడా. ఈ శ్రమకు చెల్లించవలసిన కూలిని మహిళలకు చెల్లించకపోయినా, ఆ శ్రమ ద్వారా ఉత్పత్తి ఔతున్న సంపదను మాత్రం లెక్కిస్తున్నారు. సంపదలో పెరుగుదల ఉంది కాబట్టి ఆ మహిళలకు తగిన వేతనాలు ముడుతున్నట్టేనని ప్రకటించేస్తున్నారు. ఇటువంటి ప్రతిఫలం లేని పనుల్లో మహిళలు కుదురుకుంటున్నారంటే, దానికి కారణం వారికి వేరే ఎక్కడా సరైన ప్రతిఫలం ముట్టే పనులు దొరకకపోవడమేనని ప్రభుత్వం గమనించడం లేదు. ఆర్థిక వేత్తలు 'ప్రచ్ఛన్న నిరుద్యోగం' అని వర్ణించేది దీని గురించే.

సరిగ్గా ఇటువంటి సైద్ధాంతిక దాడినే అమెరికాలోని శ్రామిక వర్గం ఎదుర్కుంటోంది. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ-డిఒజిఇ (ప్రభుత్వ సామర్ధ్యాన్ని పర్యవేక్షించే విభాగం) అనే విభాగాన్ని ట్రంప్ ఏర్పాటు చేశాడు. దానికి ఎలన్ మస్క్ ముఖ్య అధికారిగా ఉన్నాడు. అతను చేసిన వ్యాఖ్యానాలను జాగ్రత్తగా పరిశీలిస్తే వైద్య సహాయం, సాంఘిక భద్రత పథకాలు వంటి సహాయాలకు కోతలు పడనున్నాయని అర్ధమౌతుంది. సెనేటర్ బెర్నీ శాండర్స్ ఇటీవల చెప్పినది చూస్తే ఈ కోతల ద్వారా మిగిల్చిన సొమ్మును సంపన్న వర్గాలకు పన్ను రాయితీలు ఇవ్వడానికి మళ్ళించబోతున్నారని తెలుస్తోంది. ఇలా రాయితీలను పొందేవారిలో జెఫ్ బెజోస్, మార్క్ జుకర్‌బర్గ్ వంటి తిమింగలాలతోబాటు ఎలన్ మస్క్ కూడా ఉంటాడు.

ఇది కార్మికవర్గం మీద సైద్ధాంతికంగా సాగించే 'ప్రతీకార'దాడి గా చెప్పవచ్చు. గతంలో జాన్ కెన్నెత్ గేల్బ్రియత్ అనే ఉదారవాద ఆర్థిక వేత్త " ఎంత ఎక్కువగా సంపన్నులకు లాభాలు కల్పిస్తే వారు అంత ఎక్కువగా కష్టపడతారని, ఎంత తక్కువగా కూలి చెల్లిస్తే అంత ఎక్కువగా పేదలు కష్టపడతార"ని సిద్ధాంతీకరించాడు. ఇప్పుడు ట్రంప్, మస్క్ వంటి వాళ్ళు దానిని తలకెత్తుకున్నారు.

ఐతే ఈ సిద్ధాంతంలో ఒక అపసవ్యత ఉంది. పేదలనుండి కొల్లగొట్టి సంపన్నులకు కట్టబెట్టడాన్ని సమర్ధించడానికి రూపొందిన ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో పెడితే దాని ఫలితంగా పెట్టుబడిదారీ సంక్షోభం మరింత ముదిరిపోతుంది. పేదవారికి వచ్చే ప్రతీ రూపాయినీ వారు ఖర్చు చేస్తారు. అదే సంపన్నులకు వచ్చే ఆదాయంలో కొంతభాగాన్ని మాత్రమే వారు వినిమయం కోసం ఖర్చు చేస్తారు. పేదలకు కోతపెట్టి సంపన్నులకు కట్టబెడితే, మొత్తంగా స్థూల వినిమయం తగ్గిపోతుంది. మార్కెట్ లో తగినంత డిమాండ్ ఉన్నప్పుడే పెట్టుబడిదారులు పెట్టుబడులతో ముందుకొస్తారు. స్థూల వినిమయం తగ్గుతున్నప్పుడు వారు పెట్టుబడులు అదనంగా పెట్టడానికి ముందుకు రారు. దాని వలన సంక్షోభం మరింత ముదిరిపోతుంది. 1930 దశకానికి చెందిన ప్రముఖ ఆర్థిక వేత్త జాన్ మేనార్డ్ కీన్స్ పెట్టుబడిదారీ వ్యవస్థకు సమర్థకుడు. ఈ సంక్షోభం ముదిరితే అది పెట్టుబడిదారీ వ్యవస్థనే కూల్చివేసే బోల్షివిక్ విప్లవం తరహా తిరుగుబాట్లకు దారి తీయవచ్చునని ఆయన భయపడ్డాడు. పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవాలంటే స్థూల డిమాండ్ ను పెంచాల్సిందేనని, అందుకు ప్రభుత్వాలే పూనుకోవాలని సూచించాడు. కాని ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచం లో సరిగ్గా కీన్స్ చెప్పినదానికి భిన్నమైన దిశగా జరుగుతోంది. దీని రాజకీయ పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండబోతున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

★

"ఉచితా"ల మీద ఆగని రగడ

- సి.సాంబిరెడ్డి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ కోర్టులో విచారణ సందర్భంగా ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలపై వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు పోటీపడి ఉచితాలు వాగ్దానం చేస్తున్నాయని, అది మంచి పద్ధతి కాదని, ఉచితాలను పంచి పెట్టటం వలన ప్రజలు పని చేయటం మానేస్తున్నారని, వుచితాలు పంచటం ద్వారా మనం పరాన్న భుక్కు వర్గాన్ని తయారు చేస్తున్నామా? అని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో లాడ్లీ బెహన్ వంటి పథకాలను ప్రవేశ పెట్టటంతో ప్రజలు వుచితాల పైనే ఆధారపడుతున్నారని, పని చేయటానికి యిష్టపడటం లేదని, పని చేయకుండా వుచిత రేషన్ పొందుతున్నారని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఆ కేసుకు సంబంధించి వచ్చిన సీనియర్ లాయర్ - ప్రశాంతి భూషన్ - కలుగజేసుకొని చాలా మంది గ్రామాల నుంచి పట్టణాలకు వస్తున్నది, సరైన పని దొరక్కపోవటం వల్లనే, కదా! అని అన్నారనుకోండి.

ఒక్క జస్టిస్ గవాయ్ మాత్రమే కాదు. దేశంలోని సంపన్న వర్గాలన్నీ కలిసి పేదల మీద కత్తి కట్టాయి. ఉచితాల రద్దు కొరకు, పని గంటల పెంపు కొరకు పెద్ద యెత్తున ప్రచారం చేస్తున్నాయి. కార్పొరేట్ మీడియా వారికి వూడిగం చేస్తూ వుంది. మనదేశాన్ని ప్రపంచంలో నంబరు వన్‌గా తయారు చేయటానికే యిదంతా, అని అంటున్నారు. అంతిమ పరిశీలనలో యిదంతా వారి స్వార్థం కొరకేనని, దేశ ప్రయోజనం యిందులో యిసుమంతయినా లేదని తేలుతుంది. జస్టిస్ గవాయ్, తాను వ్యవసాయ కుటుంబాన్నుండి వచ్చినంత మాత్రాన తనకు వ్యవసాయం గురించి అంతా అర్థమౌతుందా? ఏది అర్థం కావాలన్నా, ముందు దాన్ని గురించి అధ్యయనం చేయాలి. వారు అధ్యయనం చేశారా? వారు చేశారో, చెయ్యలేదో నాకు తెలియదు. నేను కూడా వ్యవసాయ కుటుంబాన్నుండే వచ్చాను. ఉద్యోగానికి ముందు వ్యవసాయ పనులన్నీ చేశాను. వాటిలో వున్న కష్ట,నష్టాలన్నీ నాకు తెలుసు. అంతేకాదు, ఆరు సంవత్సరాల వ్యవధిలో రెండు దఫాలుగా గ్రామీణ ఆర్థిక, సామాజిక సర్వే నామిత్రులతో కలిసి చేశాను. ఆ సర్వే ఆధారంగా మీ ఉచితాల బండారం బయట పెడతాను.

గ్రామాల్లో ఒక వ్యవసాయ కార్మిక కుటుంబానికి సంవత్సరంలో ఎన్ని దినాలు పని దొరుకుతుంది, స్త్రీలకు, పురుషులకు విడివిడిగా వివిధ సీజన్లలో యిచ్చే కూలిరేట్లు, కుటుంబంలో పని చేసే వారి సంఖ్య లాంటి వివరాలు సర్వేలో సేకరించాలి. ఈ వివరాలు వుపయోగించి వారి కుటుంబ సాంవత్సరిక ఆదాయాన్ని లెక్కించాలి. అట్లాగే ఆ కుటుంబానికి సంవత్సరం మొత్తంలో అయ్యే ఖర్చు లెక్కించాలి. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువని తేలితే ఆ కుటుంబం లోటులో వుందని అనుకోవాలి. అది పస్తుల పాలవుతున్న కుటుంబం అని అర్థం చేసుకోవాలి. లేదా, అప్పుల పాలవుతున్న కుటుంబం అని అనుకోవాలి. ఆ లోటుకు కారణం మాత్రం యీ కుటుంబంకాదు. ఆ లోటుకు కారణం వారిమీద జరిగే శ్రమదోపిడీ. లేదా కూలి వానికి తగినంత పని దొరికి వుండకపోవచ్చు. లేదా, రెండూ జరిగి వుండవచ్చు. యీ కారణాలలో దేనివలన అయినా యీ లోటు యేర్పడి వుండవచ్చు. ఆ లోటుకు కారణమైన వాళ్లే (దోపిడీదారులు) ఆ లోటును భర్తీ చేయాలి. అలాంటప్పుడు అది ఉచితమెలా అవుతుంది? అది దోచుకున్న సొమ్మును పూర్తిగా గాని, పాక్షికంగా గాని తిరిగి యివ్వటమే కదా! ప్రభుత్వం పేదలకిచ్చే రాయితీలు, తాయిలాలు, అన్నీ యీ శ్రమ దోపిడీ కారణంగా ప్రభుత్వం దగ్గర పోగుపడే సామాజిక మిగులు నుండే వస్తాయి. కాబట్టి అవన్నీయేవీ "ఉచితా"లు కాదు. అవి, కూలీల కష్టార్జితం మాత్రమే. అవి "వుచితా"లని మీరు భ్రమపడుతున్నారు.

ఆరు సంవత్సరాల వ్యవధిలో మేము జరిపిన రెండు సర్వేల్లో, మొదటిది 2008లో జరిగింది. వుమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20 గ్రామాలు సర్వే చేశాము. డేటా ఎనలైజ్ చేస్తే వచ్చిన ఫలితాలలో మన విషయానికి సంబంధించినవి యీ విధంగా వున్నాయి.

1 గ్రామాల్లో భూమిలేని కుటుంబాలు దక్షిణ కోస్తా జిల్లాల్లో (ప్రకాశం జిల్లా మినహా) 70 నుండి 80 శాతం వరకు వున్నాయి. మిగిలిన జిల్లాల్లో అవి 40 నుండి 50 శాతం వరకు వున్నాయి. అంటే దక్షిణ కోస్తాలో అత్యధిక కుటుంబాలకు సెంటుభూమి కూడా లేదు. భూమిలేని వాళ్లు కూలిపని చేసుకోవలసిందే కదా! వ్యవసాయ కార్మికులు, పేదరైతుల సమాచారంతో పాటు యితర వర్గాల సమాచారం కూడా సేకరించాము.

2 గ్రామాల్లో సన్నకారు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు కలిసి 59.46శాతం, అంటే సుమారుగా 60శాతం కుటుంబాల వారున్నారు. వారి సగటు తలసరి, దినసరి ఆదాయాలు వరుసగా రు.18.89లు, రు.16.80లు, రు.18.28లుగా లెక్క తేలింది. ఆనాటి ప్రొ॥అర్జున్ సేన్ గుప్తా కమిటి అంచనాల ప్రకారం దారిద్ర్య రేఖ హద్దు రు.20/-లుగా లెక్క తేలింది. పై మూడు తరగతుల వారి తలసరి, దినసరి ఆదాయాలు రు.20ల కంటే తక్కువే కాబట్టి వారంతా దరిద్రంలో వున్నట్లే లెక్క. గ్రామాలలో వారి కుటుంబాలు మొత్తం 60శాతం వున్నాయి. అంటే గ్రామాల్లో సగానికి పైగా కుటుంబాలు కనీసస్థాయి జీవనం కూడా గడప లేకుండా వున్నాయని అర్థం. వారు పస్తులుంటున్నారు. వారికి న్యూట్రిషన్ ఆహారం అందటం లేదు. అంటే, కనిష్టస్థాయి జీవనం గడిపే దానికి అవసరమైనంత ఆదాయం కూడా వారికి రావటం లేదు. వారి ఆదాయంలో లోటు వుంది. ఉచితాలందుకుంటున్న జనం వీరే. ఆ "ఉచితా"లు కూడా వీరి ఆదాయాల్లో యేర్పడే లోటును పూడ్చ లేకుండా వున్నాయి.

ఆ రెండవ సర్వేకూడా 20 జిల్లాల్లో, 80 గ్రామాల్లో 2014లో జరిగింది. అంటే మొదటి సర్వే తరువాత 6 సంవత్సరాలకు జరిగింది. ఆ డేటాను విశ్లేషిస్తే యీ కాలంలో కూలీలు, పేదరైతుల పరిస్థితి మరింత దిగజారిందని తేలింది. 1) యీ ఆరు సంవత్సరాలలో భూకేంద్రీకరణ పెరిగింది. గతంలో 70 నుండి 80 శాతం కుటుంబాలకు భూముల్లేవని చూశాము. అది యిప్పుడు 75 శాతం నుండి 85 శాతానికి పెరిగింది. 2) యీ కాలంలో యాంత్రీకరణ గతం కంటే బాగా పెరిగింది అంటే, కూలీలకు పనిదినాలు తగ్గాయని అర్థం. 3) కౌలు రైతులు, సన్నకారు రైతులు కూలికి పోవటం యెక్కువ యింది. మొదటి సర్వే నాటికి సన్నకారు రైతుల మొత్తం ఆదాయంలో కూలి భాగం 37శాతం మాత్రమే. అది యిప్పుడు 63.8శాతానికి పెరిగింది. కౌలురైతులకు అది 37శాతం నుండి 58.2 శాతానికి పెరిగింది. అంటే రైతులు కూలి పనులకు పోవటం యెక్కువయిందనేగా దానర్థం. వీళ్లు కూడా కూలి పనులకు ఎగబడితే కూలీల మధ్య పోటీ పెరిగి కూలిరేట్లు తగ్గుతాయి. (రైతులు కూడా కూలి పనులకు పోవటం వాళ్లకదేమీ సరదా కాదు. యిళ్లు గడవకనే వాళ్లు కూడా కూలి పనులకు పోతున్నారు.) పనిదినాలు తగ్గితే, వారి ఆదాయాల్లోని కూలి భాగం తగ్గాలి కదా! తగ్గింది. మొదటి సర్వేలో వ్యవసాయ కార్మికుల మొత్తం ఆదాయంలో కూలి భాగం 88.6శాతం వుంటే, అది రెండవ సర్వేలో 53శాతానికి పడిపోయింది. యీ తగ్గిన భాగాన్ని కొంత వరకైనా పూడ్చుకోటానికి వాళ్లెన్ని తిప్పలు పడ్డారో డేటా చూస్తే గాని మనకు అర్థం కాదు. యింతచేసినా వారి కడుపు నిండుతుందా? అనుమానమే. యిలాంటి వాళ్లను వుద్దేశించి "ఉచితా"లు యిస్తే పని చేయరు. మనం పరాన్నభుక్కులను తయారు చేస్తున్నాము అని సుద్దులు చెప్పటం యెంత అమానుషం?

మరొక మాట కూడా జడ్జిగారు అంటారు. ఏమని? లాడ్లీ బెహన్ వంటి పథకాలను ప్రవేశ పెట్టటంతో ప్రజలు "వుచితా"ల పైనే ఆధారపడుతున్నారని, పని చేయటానికి యిష్టపడటం లేదని, వ్యవసాయదారులకు కూలీలు దొరటం లేదని అన్నారు. కూలీలు దొరకకపోవటానికి, యీ "ఉచితా"లకు యెలాంటి సంబంధం లేదు జడ్జిగారూ! గ్రామాల్లో పూర్వం 5,6 పంటలు పండించేవారు. వేరు, వేరు కాలాల్లో వేరు, వేరు పంటలు పనులు కల్పిస్తూ వుండేవి. దానివలన కూలీలకు సంవత్సరం పొడవునా (ఒక్క మండు వేసవి తప్ప) పనులు దొరికేవి. ఆయా గ్రామాల్లో తయారయ్యే పనిదినాలన్నీ ఆ గ్రామాలలో వున్న కూలీలకే దక్కేవి. కాబట్టి కూలీలకు పనిదినాలు యెక్కువగా దొరికేవి. యిప్పటికంటే వారి పరిస్థితి కొంతవరకు మెరుగ్గా వుండేది. కాని యిప్పుడు పంటల పద్ధతి మారిపోయింది. ఎక్కువగా మోనోక్రాపింగ్ పద్ధతి వచ్చింది. వూరంతా ఒకే పంట, లేదా రెండు పంటలు. ఒక్క వూరే కాదు. రాష్ట్రమంతా యింతే. కాబట్టి పనులు సీజనల్‌గా తయారయ్యాయి. ప్రధానంగా నాట్లు, కోతలు అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. కాబట్టి రెండు దఫాల్లో మొత్తం పనులు పూర్తి కావాలి. కాని గ్రామాల్లో అంతమంది కూలీలు వుండరు. కాబట్టే వ్యవసాయదార్లకు ఆ సీజన్‌లలో కూలీలు దొరకరు. మిగిలిన కాలమంతా కూలీలకు పనులుండవు. కూలీలు దొరకకపోవటానికి పంటల పద్ధతిలో వచ్చిన మార్పు ఒక ప్రధాన కారణం. కాబట్టే ప్రాంతాల మధ్య పెద్ద యెత్తున వలసలు పెరిగాయి.

జడ్జి గారూ! "ఉచితా"లు యివ్వటం మీకు అన్యాయంగా కనిపిస్తున్నది. కాని ఆ సోకాల్డ్ ఉచితాలు వాస్తవంగా ఉచితాలు కావు. ఇంతకాలం కూలీలను దోచుకున్న సొమ్ములో చాలా కొద్ది భాగం మాత్రమే యీ "వుచితా"ల రూపంలో వీరికి యిస్తున్నారు. వారికి యీ దేశం యింకా చాలా రుణపడే వుంది. అవి కూడా వారిచేతికి ఎప్పుడు అందుతాయో వేచి చూడవలసిందే. కుబేరుల సంపదలు పెరగటానికి, కష్ట జీవుల దరిద్రం పెరగటానికి మధ్య విడదీయరాని బంధం వుంది. మొదటిది పెరిగితే రెండవది కూడా పెరగాల్సిందే. అందుకే మనదేశంలో బిలియనీర్లూ ఎక్కువే. పేదలూ ఎక్కువే. సంపదల పరంగా మనదేశంలో వున్నంత వ్యత్యాసాలు ప్రపంచంలో మరెక్కడా లేవు.

ఆవును, జడ్జి గారూ! మోదీ ప్రభుత్వం అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ దిగ్గజాలకు యిచ్చే రాయితీలే అసలైన ఉచితాలు. అవి మీ దృష్టికి రావా? కార్పొరేట్ దిగ్గజాలు బ్యాంకులకు 20 లక్షల కోట్ల రూపాయలు అప్పులున్నారు. వాళ్లు యింత భారం మోస్తున్నారా, అని మోడీకి జాలి వేసి వాటిని ఒక్క కలం పోటుతో రద్దు చేశారు. ఎంత రద్దు చేశారు? పేదవాళ్లకు యిచ్చినట్టుగా 100,200 కాదండి. ఏకంగా 20 లక్షల కోట్ల రుపాయలు. ఇదంతా ప్రజాధనమే. వాళ్ల దగ్గర గోళ్లూడగొట్టి వసూలు చేసిన జి.యస్.టిలు, ఇతర భారాలు. మోడీ గారికి ముందు కార్పొరేట్ టాక్స్ 30 శాతం వుండేది. కార్పొరేట్లను అంత ఎక్కువగా టాక్స్ చేయటం ఆయనకు యిష్టం వుండదు. కాబట్టే దాన్ని ఆయన వచ్చిన తరువాత 22 శాతానికి తగ్గించారు. దాని వలన ప్రభుత్వం, తద్వారా ప్రజలు నష్టపోయింది, పదిలక్షల కోట్ల రూపాయలు. ముందు, ముందు యింకా యిలాంటివి ఎన్ని చూడాలో! యిదంతా మీరూ చూస్తున్నారు కదా! వీటి మీద మీరెందుకు మాట్లాడరు?

మనదేశంలో సంపదలకు అర్థమే లేకుండా పోయింది. ఒక్క అదానీకి వున్న ఆస్తులు - మన దేశంలో వున్న దాదాపు అన్ని నౌకాశ్రయాలు, అన్ని విమానాశ్రయాలు, లెక్కలేనన్ని విద్యుత్ కేంద్రాలు, ఖనిజ సంపదలతో నిండిన అడవులు, ప్రభుత్వం కారు చౌకగా కట్టబెట్టే పబ్లిక్ రంగ సంస్థలు - యిట్లా చెప్పుకుంటూ పోతే అది కొండవీటి చాంతాడంత అవుతుంది. ఆకలి సూచీలో మనం 105వ స్థానంలో వున్నాము. అధికారం చేతిలో వుంటే సంపద ప్రవాహాన్ని మన యిష్టమొచ్చిన దారిలోకి మళ్లించవచ్చు. యిప్పుడు పై వర్గాలే పాలకవర్గాలుగా వున్నాయి. కాబట్టి సంపదల ప్రవాహం వారివైపు వుంది. అందుకే వాళ్ల ఆస్తులు లక్షల కోట్లలో వుంటున్నాయి. అదే, కింది వర్గాలు అధికారానికి వస్తే వాళ్లు పై వర్గాల మాదిరిగా జనాన్ని దోపిడీ చేయరు. ఆయా వర్గాలు చేసే శ్రమలను బట్టి వారి వారి ఆదాయాలు వుంటాయి. ఆకలి, పేదరికం దరిదాపుల్లోకి కూడా చేరలేవు. అలాంటి సమాజాన్ని కోరుకుందాం.

(రచయిత సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ పూర్వ సభ్యులు)

పిపిపి కోసం విజిఎఫ్

- ప్రభుత్వ ఆలోచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పబ్లిక్ ప్రయివేటు భాగస్వామ్యంతో నిర్వహించే పథకాలకు నిధుల కొరత రాకుండ చూసేందుకు రెండు వేల కోట్లతో వయబిలిటీ గ్యాప్ ఫండ్ (విజిఎఫ్)ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాల్లో అభివృద్ధికి సంబంధించి ప్రతి జిల్లాకు ఒక కోటి రూపాయలు కేటాయించాలని, ఆ నిధులను జిల్లా కలెక్టర్ వద్ద అందుబాటులో ఉంచాలని యోచిస్తున్నారు. నియోజక వర్గాల అభివృద్ధికి గతంలో ఇచ్చిన మాదిరిగానే ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కూడా కోటి రూపాయలు ఇవ్వాలన్న ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అదే విధంగా సిఎఫ్ఎంఎస్‌లో ఉన్న పిడి ఖాతాలను తప్పించి స్థానిక సంస్థల్లోనే ప్రత్యేకంగా పిడి ఖాతాలను తెరిచే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. దీనివల్ల స్థానిక సంస్థల ఆర్థిక లావాదేవీలు సరళీకృతమవుతాయని భావిస్తున్నారు. రైతులు, స్వయం సహాయ సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇంధన సంస్థలకు గ్యాస్ సబ్సిడీ నిధులు, వేట నిషేధం సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం, వంటి అంశాలపై కూడా కీలక నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రతిపాదనలను ఇప్పటికే ఆర్థికశాఖకు పంపించినట్లు తెలిసింది.

పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

- వందశాతం వసూలు చేస్తే సన్మానం
- పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపాలిటీల్లో పన్ను బకాయిలు వసూలుకు స్పెషల్ డ్రైవర్ నిర్వహించాలని పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఆస్తిపన్నుతోపాటు ఖాళీ స్థలాల పన్ను వసూళ్లు తక్కువగా ఉండటంతో పట్టణ స్థానిక సంస్థల ఆదాయంలో భారీ లోటు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మార్చి నెలాఖరులోపు 100 శాతం పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు ఖాళీ భూముల యజమానుల వివరాలు సబ్ రిజిస్ట్రార్ నుండి సేకరించి బకాయిదారులకు నోటీసులు ఇవ్వాలని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న జాబితాను ప్రచురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్ఎంఎస్ వాట్సాప్ ద్వారా డిజిటల్ నోటీసులు పంపించి బకాయిల వివరాలు తెలియజేయాలని, అన్‌లైన్ చెల్లింపుల లింకుతో బకాయిలు కట్టించేందుకు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనలో పన్నుల ప్రాధాన్యతను తెలపాలని చెప్పారు. అత్యధిక పన్ను వసూలు చేసిన మున్సిపల్ కమిషనర్లకు నగదు పురస్కారాలు, ఇతర ప్రోత్సాహకాలు ఇచ్చి గౌరవించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

గవర్నర్ ప్రసంగం అబద్ధాలమయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ ప్రసంగమంతా అబద్ధాలమయమని, ఒక్క వాస్తవం కూడా చెప్పలేదని వైసిపి ఎమ్మెల్యేలు తాటిపర్తి చంద్రశేఖర్, బూసినే విరూపాక్షి అన్నారు. పథకాల ఊసెత్తని గవర్నర్ ప్రసంగం ఆత్మస్తుతి పరనిందలా ఉందని, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. వైసిపికి ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ఎందుకు భయపడుతున్నారని అన్నారు. రాజ్యాంగం అంటే ఈ ప్రభుత్వానికి గౌరవం లేదన్నారు. పవన్‌కల్యాణ్‌కు రాజ్యాంగం గురించి తెలియదన్నారు.

పెట్రోల్ బంక్‌లపై విజిలెన్స్ ఆకస్మిక దాడులు

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈనెల 22న 36 బృందాలు, 73 పెట్రోల్ బంక్‌లపై దాడులు చేసినట్లు డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై లీగల్ మెట్రాలజీకేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పెట్రోల్ బంక్‌ల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించే కార్యకలాపాలకు పెట్రోల్ బంక్ డీలర్లు, యజమానులను ఆయన కోరారు.

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ

ఎడ్లపాడు బ్రాంచి (19221)
డి.నెం.4-53/1, ఆంధ్రాబ్యాంక్ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్, ఎడ్లపాడు-522233. ☎ 08647-276108

రూల్ 8(1) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎడ్లపాడు బ్రాంచి** (E-AB) యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: శ్రీ నిడమానూరు హరీష్, తండ్రి: వెంకటరంగం (అప్లికెంట్) మరియు శ్రీ నిడమానూరు వెంకట రంగం, తండ్రి: పట్టాభిరామయ్య (కో-అప్లికెంట్)** వారు **చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.16,60,242/- (అక్షరాల పదహారు లక్షల అరవై వేల రెండు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.04.05.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **19 ఫిబ్రవరి 2025 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.16,60,242/- (అక్షరాల పదహారు లక్షల అరవై వేల రెండు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

చర / స్థిరాస్తుల యొక్క వివరములు

పల్నాడు జిల్లా, ఎడ్లపాడు మండలం, ఎడ్లపాడు గ్రామపంచాయతీ, రామాలయం టెంపుల్ దగ్గర, డోర్ నెం.6-83/1, ఎడ్లపాడు, డి.నెం. 267 నందు **శ్రీ నిడమానూరు వెంకట రంగం, తండ్రి: పట్టాభిరామయ్య పేరునగల** 175.69 చ॥గ॥ లేదా 146.87 చ॥మీ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ స్థలము మరియు అందులో గ్రౌండ్ & ఫస్ట్ ఫ్లోర్స్ కలిగి నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: తూర్పు:** ఎడ్లపాటి వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి; **దక్షిణం:** ముత్తవరపు సుబ్బారావు యొక్క ఆస్తి; **పడమర:** పంచాయతీ సిసి రోడ్డు; **ఉత్తరం:** ముత్తవరపు వెంకటరావు యొక్క ఆస్తి.

తేది: **19.02.2025**, ప్రదేశము: ఎడ్లపాడు సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ

సిరిస్ బ్రాంచి (11091)
సిరిస్ కాంప్లెక్స్ ఎదురుగా, పాత చెక్‌పోస్ట్ దగ్గర, ఎం.జి.రోడ్డు, విజయవాడ-520007.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం. 54) ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **సిరిస్ బ్రాంచి (11091)** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత: **శ్రీ నల్లమోతు కిషోర్ & నల్లమోతు శ్యామ్ కుమార్** వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 21,80,167.50** (అక్షరాలా ఇరవై ఒక్క లక్షల ఎనభై వేల నూట అరవై ఏడు రూపాయల యాభై పైసలు మాత్రమే) + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా **తేదీ. 21-09-2024న** డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుకోవల్సిన చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారము **తేదీ. 20-02-2025న** దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిరిస్ బ్రాంచి వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 21,80,167.50** (అక్షరాలా ఇరవై ఒక్క లక్షల ఎనభై వేల నూట అరవై ఏడు రూపాయల యాభై పైసలు మాత్రమే) వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జికి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్(8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

ఎన్.టి.ఆర్ జిల్లా, పెనమలూరు మండలం, పోరంకి, ఆర్.ఎస్.నెం. 154, డి.నెం. 6-299లో 108.88 చ.గ.ల విస్తీర్ణంలో నివాస గ్రౌండ్ ఫ్లోర్ & మొదటి అంతస్తు గల భవనం శ్రీ నల్లమోతు శ్యామ్ కుమార్ గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు:** నల్లమోతు యేసోబు గారి ఆస్తి, **దక్షిణం:** నల్లమోతు సద్గుణరావు గారి ఆస్తి, **పడమర:** పంచాయితీ రోడ్డు, **ఉత్తరం:** నల్లమోతు సుదర్శనరావు గారి ఆస్తి.

తేది: **20-02-2025**
ప్రదేశము: విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యుపి సూపర్ విన్

మహిళల ప్రీమియర్ లీగ్‌లో తొలిసారి

సూపర్ ఓవర్‌లో తడబడ్డ ఆర్‌సిబి

బెంగళూరు : మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో యుపి వారియర్స్ అదరగొట్టింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు (ఆర్‌సిబి)పై సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. సోమవారం మ్యాచ్‌లో ఇరు జట్లు నిర్ణీత ఓవర్లలో 180 పరుగులు చేయడంతో ఈ మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. డబ్ల్యూపిఎల్‌లో ఫలితం కోసం సూపర్ ఓవర్ నిర్వహించడం ఇదే మొదటిసారి. సూపర్ ఓవర్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యుపి ఎనిమిది పరుగులు చేసింది. ఆర్‌సిబి తరపున కిమ్ గ్రాత్ బౌలింగ్ చేయగా, యుపి నుంచి చినెల్లీ హెన్రీ, గ్రేస్ హరీస్ బ్యాటింగ్ చేశారు. హెన్రీ నాలుగు పరుగులు చేసి మూడో బంతికి అవుటయింది. దీంతో సూపర్ ఓవర్‌లో యుపి 1 వికెట్ నష్టానికి 8 పరుగులు చేసింది. కిమ్ గ్రాత్ ఒక వికెట్ తీసినా రెండు వైడ్లు వేయడం యుపికి కలిసి వచ్చింది. లక్ష్య ఛేదన కోసం ఆర్‌సిబి నుంచి సూపర్ ఓవర్‌లో స్మృతి మంధాన, రీచా ఘోష్ బ్యాటింగ్‌కు దిగారు. యుపి బౌలర్ ఎక్లెస్టోన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మంధాన - ఘోష్ జోడీ కేవలం నాలుగు పరుగులు మాత్రమే చేసింది. దీంతో యుపి వారియర్స్ విజయం సాధించింది. ఇంతకు ముందు మ్యాచ్‌లో టాస్ గెలిచిన యుపి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సిబి 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో యుపి కూడా 20 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. దీంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. ఎక్లెస్టోన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

స్కోర్‌బోర్డు...

బెంగళూరు మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)దీప్తి 6, హెడ్జ్ (సి)సెహ్రావత్ (బి)మెక్ గ్రాత్ 57, ఎలైసె పెర్రీ (నాటౌట్) 90, రీచా ఘోష్ (సి అండ్ బి)హెన్రీ 8, కనిక అహుజ (సి)రనౌట్)ఉమా ఛెత్రి 7, వారేహామ్ (రనౌట్) సైమా ఠాకూర్ 7, కిమ్ గ్రాత్ (రనౌట్)మెక్ గ్రాత్ 2, అదనం 5. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 180పరుగులు.

వికెట్ల పతనం: 1/23, 2/117, 3/126, 4/136, 5/158, 6/180

బౌలింగ్: హెన్రీ 4-0-34-1, హారీస్ 1-0-11-0, దీప్తి శర్మ 4-0-42-1, ఎక్లెస్టోన్ 4-0-29-0, సైమా ఠాకూర్ 1-0-8-0, క్రాంతి గాడ్ 3-0-26-0, మెక్ గ్రాత్ 3-0-30-1.

యుపి వారియర్స్ మహిళల ఇన్నింగ్స్: నవ్‌గైర్ (సి)రేణుక 24, డానిష్ (సి)మంధాన (బి)రేణుక 14, దీప్తి శర్మ (సి)రీచా (బి)స్నేహ్ రాణా 25, మెక్ గ్రాత్ (సి)రీచా (బి)స్నేహ్ రాణా 0, సెహ్రావత్ (సి)రీచా (బి)ఎలైసే పెర్రి 31, హారిస్ (సి)స్నేహ్ రాణా (బి)కిమ్ గ్రాత్ 8, ఉమా ఛెత్రి (సి)వారేహామ్ (బి)స్నేహ్ రాణా 14, హెన్రీ (బి)కిమ్ గ్రాత్ 8, ఎక్లేస్టోన్ (రనౌట్)రీచా 33, సైమా ఠాకూర్ (రనౌట్) వారేహామ్ 14, క్రాంతి గాడ్ (నాటౌట్) 2, అదనం 7. (20 ఓవర్లలో ఆలౌట్) 180పరుగులు.

వికెట్ల పతనం: 1/30, 2/48, 3/50, 4/72, 5/83, 6/123, 7/123, 8/134, 9/161, 10/180

బౌలింగ్: రేణుక 4-0-38-2, కిమ్ గ్రాత్ 4-0-40-2, స్నేహ్ రాణా 3-0-27-3, ఎక్తా బిష్ట్ 3-0-26-0, ఎలైసే పెర్రి 2-0-10-1, వారేహామ్ 4-0-40-0

పంటలపై ఏనుగుల దాడి

రూ.80 వేలకు పైగా నష్టం

ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట

ప్రజాశక్తి- సోమల

చిత్తూరు జిల్లా సోమల మండలంలోని అన్నెమ్మగారిపల్లి పంచాయతీకి చెందిన మల్లెల వెంకటరమణ అనే రైతు తనకున్న కొద్దిపాటి పొలంలో టమోటా, బీర పంటలను సాగు చేశారు. ఆదివారం రాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో ఏనుగుల మంద టమోటా, బీర పొలాలపై దాడి చేసి పంటలను తొక్కి వేసి టమోటా బీర మొక్కలకు ఊతంగా నిలిపిన కర్రలను విరిచి వేసి నష్టం కలిగించాయని, సుమారు 80,000 నష్టం వాటిల్లిందని రైతు వాపోయారు. అటవీ సమీప పంచాయతీ కావడం నిత్యం ఏనుగుల బెడద కారణంగా ఈ ప్రాంతంలో రైతులు వ్యవసాయం చేయాలంటేనే వెనకడుగు వేస్తున్నారు. అప్పులు చేసి పంటలు పండించడం, తీరా ఏ సమయంలో ఎప్పుడు వచ్చి ఏనుగులు పంటలు నాశనం చేస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడడంతో ఇప్పటికే కొన్ని వందల ఎకరాలలో పంటలను సాగు చేయడమే రైతులు నిలిపివేశారు. పంట పొలాలపై దాడి చేసిన సమయంలో డ్రిప్ పైపులు బోర్ పైపులు విరిచి వేయడం తొక్కివేయడంతో అటు పంట నష్టంతో పాటు పరికరాల నష్టం కూడా జరిగి తాము తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అటవీశాఖ వారు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ప్రాంతంలో ఏనుగుల బెడద లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

పులిచెర్లలో పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు

రొంపిచర్ల : పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి గ్రామపంచాయతీ దిగువమూర్తివారిపల్లె పరిధిలో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు రైతుల పంటలను ధ్వంసం చేశాయి. మామిడి చెట్లు, అరటి చెట్లు, కొబ్బరి, వరి పంటలను తిని తొక్కి ధ్వంసం చేశాయని రైతులు తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ, అటవీ శాఖ సిబ్బంది ధ్వంసమైన పంటలను పరిశీలించారు.

బి.మఠం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులపై దౌర్జన్యం చేసిన కడప జిల్లా బి.మఠం పోలీస్ స్టేషన్ ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తాలకు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డిలు సోమవారం ఫిర్యాదును మెయిల్ చేశారు. బెంగళూరు నుంచి అమరావతి వరకూ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మిస్తున్న క్రమంలో కడప జిల్లా చాపాడు, మైదుకూరు, బి.మఠం, పోరుమామిళ్ల మండలాల్లో సుమారు 100 మందికి పైగా రైతులకు చెందిన సుమారు 300 ఎకరాలకుపైగా భూములను ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. పనులు చేపట్టి రెండేళ్లవుతున్నా నేటి వరకూ 25 మంది రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించలేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించిన అనంతరమే పనులు చేపట్టాల్సి ఉన్నా నిబంధనలు పాటించకుండా పనులు చేపట్టారని తెలిపారు. ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం బి.మఠంలోని మల్లేపల్లి గ్రామంలో 25 మంది బాధిత రైతులతో సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఎస్ఐ 144 సెక్షన్ అమలులో ఉందని, సమావేశాలు జరపకూడదని హెచ్చరించారని, కాదని జరిపితే కేసులు పెడతామని బెదిరించి సమావేశాన్ని అడ్డుకున్నారని తెలిపారు. రైతులకు రక్షణ కల్పించాల్సిన ఎస్ఐ కాంట్రాక్టర్ పక్షం వహించి రైతులను భయభ్రాంతులకు గురి చేశారని చెప్పారు. గతంలోను శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై బైండోవర్ కేసులు నమోదు చేశారని,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎస్ఐ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేసి రైతులకు న్యాయం చేయడంతోపాటు ఎస్ఐపై తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో మంత్రి, డిజిపిలను కోరారు.

Bandhan Mutual Fund — Badhte Raho
Begin with the End in Mind
Introducing
Bandhan CRISIL-IBX 10:90 Gilt + SDL Index – Dec 2029 Fund

బంధన్ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

హైదరాబాద్: బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ క్రిసిల్-ఐబిఎక్స్ 10:90 గిల్ట్ ప్లస్ ఎస్‌డిఎల్ ఇండెక్స్- డిసెంబర్ 2029 ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది ఫిబ్రవరి 25న తెరుబడుతుందని ఆ సంస్థ తెలిపింది. ఇందులోని నిధులను 90 శాతం రాష్ట్ర ప్రభుత్వ రుణాలకు, 10 శాతం ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ ఎన్ఎఫ్ఒను మార్చి 05న మూసివేయనున్నట్లు పేర్కొంది.

బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలు వేగవంతం

మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ : బ్రిటన్‌తో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలను వేగవంతం చేస్తోన్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఇందుకోసం చర్చలను తిరిగి ప్రారంభించాలని భారత్, బ్రిటన్ నిర్ణయించుకున్నాయన్నారు. అమెరికా నుండి పరస్పర దిగుమతి సుంకాల ముప్పు సహా పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి మధ్య ద్వైపాక్షిక వాణిజ్య చర్చల పునఃప్రారంభం చాలా కీలకమని భారత్ భావిస్తోందన్నారు. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన 12 నెలల కాలంలో ఇరు దేశాల మధ్య 52 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది.

అమెజాన్ ప్రైమ్ డెలివరీల్లో 26 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : గతేడాది 2024లో అదే రోజు లేదా తర్వాత రోజు 41 కోట్ల వస్తువులను డెలివరీ చేసినట్లు ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ ఇండియా తెలిపింది.

అమెజాన్ ప్రైమ్ సభ్యులు అత్యంత వేగవంతమైన డెలివరీలను పొందారని పేర్కొంది. ఏడాదికేడాదితో పోల్చితే 26 శాతం పెరుగుదల చోటు చేసుకున్నట్లు వెల్లడించింది. ప్రైమ్ సభ్యత్వంతో సగటున రూ.3300 ఆదా చేసుకున్నారని పేర్కొంది. ప్రైమ్ పిన్‌కోడ్స్‌ను 11 శాతం పెంచినట్లు పేర్కొంది.

ఎఫ్ఎంసిజిలో 245 కోట్ల ఉత్పత్తుల సరఫరా : ఉడాన్

న్యూఢిల్లీ : గడిచిన ఏడాదిలో తమ సంస్థ ఎఫ్ఎంసిజి వ్యాపారంలో ఏకంగా 245 కోట్ల ఉత్పత్తులను సరఫరా చేసినట్లు ఇబి2బి పోర్టల్ ఉడాన్ వెల్లడించింది. అన్ని అహార ఉత్పత్తులు కలిపి 7 లక్షల మెట్రిక్ టన్నులు మించి పోయాయని పేర్కొంది. ఈ విభాగంలో 65 శాతం వృద్ధిని సాధించినట్లు తెలిపింది. 2024లో 8.58 కోట్ల ఆర్డర్లను నమోదు చేసినట్లు వెల్లడించింది. బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కత్తాలో అధిక వృద్ధిని సాధించినట్లు తెలిపింది.

మండలిలో ప్రజాగళం కెఎస్ లక్ష్మణరావుతోనే సాధ్యం

- ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

శాసన మండలిలో ప్రజాగళం స్పష్టంగా వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు సరైన వ్యక్తి అని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం, ప్రత్యేక హోదా, విభజన హామీలు, ఇతర సమస్యలపైనా ప్రభుత్వాలను ఆయన ప్రశ్నించగలరని తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... లక్ష్మణరావుపై గత కొన్ని రోజులుగా భయంకరమైన ట్రోలింగ్ చేస్తున్నారని, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందించే సమయంలో ఒక పత్రం కింద పడితే దానిని తీసేందుకు వంగితే, ఆ వీడియోను చూపించి జగన్ కాళ్లపై పడ్డారని ట్రోల్ చేయడం సరైంది కాదన్నారు. విలువలు కలిగిన వ్యక్తి, మూడు సార్లు ఎమ్మెల్సీగా పని చేసిన వ్యక్తిని ఇలా ట్రోల్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల్లో ధన, వర్గ ప్రభావానికి లోను చేస్తున్నారని చెప్పారు. పట్టభద్రులు, విజ్ఞులైన ఓటర్లు ఆలోచించాలని, లక్ష్మణరావు చేసిన పోరాటాలను గుర్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేసే వ్యక్తులు పిడిఎఫ్ అభ్యర్థులన్నారు. గ్రూప్ 2 విషయంలో పరీక్ష ఉందో లేదో కూడా తెలియని పరిస్థితిలో యువత ఉన్నారని తెలిపారు. 6 వేల మంది హాజరు కాలేకపోయారన్నారు. విభజన హామీల్లో భాగంగా రాయితీలు వస్తే పరిశ్రమలు వస్తాయన్నారు. ఆ రాయితీలు రాష్ట్రానికి హక్కుగా రావాల్సి ఉంటే ఈ రోజు గుజరాత్‌కు తరలించుకుపోయారని, అక్కడ 100 శాతం రాయితీలు ఇస్తున్నారని చెప్పారు. కేంద్రం చేతుల్లో బానిసలుగా మారవద్దని కూటమి నేతలకు సూచించారు. ఒపిడిఆర్ జాతీయ అధ్యక్షులు సిహెచ్.భాస్కరరావు మాట్లాడుతూ... రాజకీయాలు డబ్బు సంపాదనకు మార్గాలుగా మారిన ప్రస్తుత కాలంలో ప్రజా సేవే లక్ష్యంగా పని చేసే వ్యక్తి పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు అని చెప్పారు. ఆయనను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... లక్ష్మణరావు వంటి నాయకులు నేటి రాజకీయాలకు అవసరమని, ఆయనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సూచించారు. టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి ఆంజనేయులు మాట్లాడుతూ... మూడు సార్లు ఎమ్మెల్సీగా పని చేసినా ఎటువంటి మచ్చలేని వ్యక్తిగా పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు ఉన్నారని తెలిపారు. అడ్వకేట్ అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ... విభజన హామీలు సాధించేందుకు కూటమికి అవకాశం లేదన్నారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపిస్తే సభలో ప్రజల వాణి వినిపిస్తారన్నారు.

ప్రకటన

కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, చిన్నగొన్నూరు శివారు, పురిటిపాడు గ్రామం డోర్ నెం.2-56 కాపురస్థురాలు బొర్రా పెంటయ్యగారి భార్య బొర్రా మహలక్ష్మి గారి సంజాయిషీ పై తెలియజేయునది ఏమనగా!
క్రింది షెడ్యూలు దాఖలా 2వ ప్రతి ఆస్తిని బొర్రా మహాలక్ష్మి గారు దాసరి సుబ్బారావు గారి కుమారుడు దాసరి వెంకటరత్నం గారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని ది.30-10-2024 వ తేదీన అస్వాధీన విక్రయ అగ్రిమెంట్ వ్రాయించుకొనియున్నారు. సదరు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని దాసరి వెంకటరత్నం గారు ది. 15-06-2007 వ తేదీన మున్నలూరి నాగేంద్రరావు గారి వద్ద నుండి క్రయం పొంది పామర్రు సబ్‌రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 1వ పుస్తకం ద.నెం.1457/2007 రుగా రిజిస్టరు కాబడిన క్రయ దస్తావేజు రీత్యా నాగేంద్రరావు గారి సంపూర్ణ సర్వహక్కు భుక్తములతో అనుభవిస్తూ యుండిన దర్మిలా వెంకటరత్నం గారు కొనుగోలు చేసియున్నారు. సదరు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని మున్నలూరి నాగేంద్రరావు గారు ది. 11-12-2006 వ తేదీన రొంపిచెర్ల రామకృష్ణమాచార్యులు గారి భార్య లక్ష్మి గారి వద్ద నుండి క్రయంపొంది పామర్రు సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం ద.నెం. 2938/2006 రుగా రిజిస్టరు కాబడిన క్రయదస్తావేజు రీత్యా రొంపిచెర్ల లక్ష్మి గారి సర్వ సంపూర్ణ హక్కు భుక్తములలో అనుభవిస్తూ దర్మిలా మున్నంగి నాగేంద్రరావు గార్కి విక్రయుంచడమైనది. ది.21-06-2006 వ తేదీ రొంపిచెర్ల లక్ష్మీగారు శ్రీ వాణి భవానీ కనస్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున మేనేజరు డైరక్టర్స్ & ముసునూరి సురేష్ కుమార్ మరియు గీతావాణి గార్ల నుండి క్రింది షెడ్యూలు 2వ ప్రతి దాఖలా ఆస్తి ని కొనుగోలు చేసి Doc.No.1451/2006 గా పామర్రు సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిస్ట్రీ చేయించుకొని సర్వ సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవిస్తుయుండి యున్న దర్మిలా రొంపిచెర్ల లక్ష్మీగారు కొనుగోలు చేసియున్నారు. పై తెలిపిన రిజిష్టర్డు క్రయదస్తావేజులులో రెండు ద.నెం.1451/2006,మరియు 2938/2006 దాసరి వెంకటరత్నం గారు ఫోటోస్టాట్ కాఫీలను తీయించుకొనే ప్రయత్నంలో ఎక్కడో పోయినవి అని, ఎంత వెదికినను కనుగొనలేక పోయినందున సదరు దాసరి వెంకటరత్నం గారు పామర్రు పోలీసు స్టేషన్ నందు కంప్లయింట్ చేసిన దర్మిలా పామర్రు పోలీసువారు కి కూడా దొరకనందున వారు Not Traced out Certificate ను ఇచ్చియున్నారు. పై తెలిపిన రెండు ఒరిజినల్స్ దస్తావేజులకు బదులుగా బొర్రా మహలక్ష్మి గార్కి ఫొటోకాఫీలను, నకలు కాఫీలను ఇచ్చియున్నారని సదరు బొర్రా మహలక్ష్మిగారు రుణ నిమిత్తమై Canfin Homes Ltd, Vijayawada Branch ని సంప్రదించి యున్నారని, తెలియజేయడమైనది. సదరు ఆస్తిపై ఎవరికైనా ఏ విధమైన తనఖా,దఖలు, క్లయింలు, చెల్లదగు కోర్టు జప్తులు, ఇంజక్షన్లు, మనోవర్తి హామీలు, జాయింటు భాగ లబ్ధి తగయిదాలు ఏమైనా ఉండి ఉన్నట్లు అయితే ఈ ప్రకటన తేదీ లగాయితు వారం రోజులలోపు వార్కి గల అభ్యంతరములు లిఖితపూర్వకముగా Acknowledgement తో సహ క్రింది వార్కి తెలియచేయగలరు. అటుల ఏమీ అభ్యంతరములు రాని ఎడల, సదరు బొర్రా లక్ష్మి గార్కి బ్యాంకు నిబంధనలకు లోబడి పై బ్యాంకువారు ఋణమును ముంజూరు చేసెదరని తెలియచేయడమైనది.

విక్రయాస్తి షెడ్యూలు

కృష్ణాజిల్లా, పామర్రు సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా పామర్రు మండలం, పామర్రు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన పామర్రు గ్రామములోని మచిలీపట్నం-విజయవాడ హైవే రోడ్డు,రెసిడెన్నియల్ ఏరియాలో ఉన్నటువంటివి, నేను స్వార్జితముగా ది 11-12-2006 వ తేదీన రొంపిచర్ల రామకృష్ణమాచార్యులు గారి భార్య లక్ష్మి గారి వల్ల క్రయం పొందిన క్రయ దస్తావేజు పామర్రు సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం దస్తావేజు నెంబరు 2938/2006 రు గా రిజిష్ట్రీ కాబడి దాసరి వెంకటరత్నం గారికి సంక్రమించి నటువంటివి, షెడ్యూలుదాఖలా నివేశనస్థలం యందు గల వాణీసదన్ అను పేరుగల దోరు నెంబరు 20-21-1ఎ, అపార్ట్‌మెంటు గ్రౌండ్ ఫ్లోరు 'ఎ' బ్లాక్ ఫ్లాట్ నెం.1, నేటివరకు దాసరి వెంకటరత్నం గారి సంపూర్ణ స్వాధీనహక్కు భుక్తములు జరుగుచున్నటువంటివి దాసరి వెంకటరత్నం గారి స్వాధీన హక్కుభుక్తములలో యున్న పామర్రు గ్రామ శేరీ మెరక 1వ ప్రతి:-అర్.యస్.నెం.114/8బి య.1.04 ట్లు (పూరా) లో ఉత్తరం వైపున, చగ.1867 లు నివేశన స్థలంకు **హద్దులు:- 1వ ప్రతి :-**

తూర్పు : కోతిబొమ్మ డొంక
దక్షిణం : 6 గజములు వెడల్పు గల బజారు
పడమర : పంచాయితీ బజారు
ఉత్తరం : విజయవాడ - మచిలీపట్నం హైవే రోడ్డు.

ఈ హద్దుల మధ్య చ.గ.1867లు స్థలములో అనిర్దిష్టపు 1/80 వ వంతు అనగా చ.గ 23.33లు లేక 19.50 చ.మీ. లు అనిర్దిష్టపు స్థలము.

2వ ప్రతి:- పై 1వ ప్రతి స్థలములో గల వాణిసదన్ అను పేరుగల అపార్ట్‌మెంటులోని 'ఎ' బ్లాక్ గ్రౌండు ఫ్లోరు ఫ్లాటు నెంబరు 1, డోరు నెంబరు 20-21-1ఎ, అసెస్‌మెంట్ నెం.4396 కు హద్దులు

తూర్పు : కారిడార్ --------- అ 20.3 అం.లు
దక్షిణం : దక్టింగి ఏరియా --------- అ 27.3 అం.లు
పడమర : దక్టింగి ఏరియా ---------అ 20.3 అం.లు
ఉత్తరం : దక్టింగి ఏరియా అవతల మున్నలూరి కృష్ణకుమారి గారి ఫ్లాట్ నెం.2ఎ-అ.27.3

అం॥లుయీ హద్దుల మధ్య చ.అ. 552 లు ప్లింత్ ఏరియా లో నిర్మించబడిన వాణీసదన్ అను పేరుగల అపార్ట్‌మెంటు బిల్డింగ్ పోర్షన్‌కు అమర్చబడిన యావత్తు కలప, ఇనుప సామాన్లు, కరెంటు సర్వీసునెంబరు.6142, ఎలక్ట్రికల్ సామాన్లు, అందలి కామన్‌టాయిలెట్స్ వగైరాలతో

ఇట్లు
ఎల్.వి.వి.ఎన్. భానుప్రియ,
ఎస్.వి. సుబ్బారావు,
ఎస్.ఆర్.వి.ఎస్.ఎస్.లక్ష్మి
అడ్వకేట్స్,
జి-3, 3వ అంతస్తు, క్లాసిక్ టవర్స్,మొగల్రాజపురం, విజయవాడ.
ఫోన్ నెం:9441463180, 9985663743

ది.11-02-2025,

భారత జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ
(రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వశాఖ - భారత ప్రభుత్వం)
నెం.7-896, 1 & 2వ అంతసులు, సౌమ్య రెసిడెన్సీ, RTC కాలనీ 1వ లైన్, ఒంగోలు - 523001. ఫోన్ నెం : 08592-220028,
ఇ - మెయిల్ : piuongole@nhai.org

బహిరంగ ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని ఈ క్రింది ఫీజు ప్లాజా వద్ద **26 ఫిబ్రవరి 2025 (ఉ.గం.8.00) నుండి 25 ఫిబ్రవరి 2026 వరకు** ఈ క్రింది సెక్షన్స్ వాడకం కొరకు గెజిట్ నోటిఫికేషన్ ననుసరించి వర్తించు యూజర్ ఫీజు రేట్లు గురించి తెలియచేయుటకు బహిరంగ ప్రకటన.

వీరాంజనేయపురం ఫీజు ప్లాజా :

భారతదేశపు అసాధారణ గెజిట్, పార్టు-II, సెక్షన్-3, సబ్- సెక్షన్ (ii) తేదీ 27 జూన్ 2024 నందు ప్రచురించిన ఫీజు నోటిఫికేషన్ S.O నెం.2489 (E) ననుసరించి, NH-565 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీరాంజనేయపురం ఫీజు ప్లాజా నాగార్జున సాగర్ డ్యాం నుండి దేవులపల్లి సెక్షన్ వరకు డిజైన్ చైనేజ్ కి.మీ. 86.057 నుండి కి.మీ. 132.920 వరకు (ప్రస్తుతం కి.మీ.86.057 నుండి కి.మీ.133,922 వరకు) (కి.మీ 46.863 పొడవు) సెక్షన్ వాడకం కొరకు యూజర్ ఫీజు రేట్లు క్రింది విధంగా ఉంటాయి.

వాహన రకము	ఒక వైపు ప్రయాణానికి గల ఫీజు (రూ. లలో)	డైలీ పాస్ /రోజులో తిరుగు ప్రయాణానికి గల ఫీజు (రూ.లలో)	నెలలో 50 ఒక వైపు ప్రయాణాలకు నెలవారీ పాస్ కు గల ఫీజు (రూ.లలో)	జిల్లా లో రిజిష్టరైన వ్యాపార వాహనాలకు గల ఫీజు (రూ.లలో)
కారు, జీపు, వ్యాన్ లేదా తేలికైన మోటారు వాహనము	45	70	1530	25
తేలికైన వ్యాపార వాహనము, తేలికైన సరుకుల వాహనము లేదా చిన్న బస్సు	75	110	2470	35
బస్సు లేదా ట్రక్కు (రెండు యాక్సిల్స్)	155	235	5175	80
మూడు- యాక్సిల్ వ్యాపార వాహనములు	170	255	5645	85
భారీ నిర్మాణ మెషినరీ (HCM) లేదా ఎర్త్ మూవింగ్ సామాగ్రి (EME) లేదా బహుళ యాక్సిల్ వాహనము (MAV) (నాలుగు నుండి ఆరు యాక్సిల్)	245	365	8120	120
భారీ సైజులోని వాహనాలు (ఏడు లేక ఇంకా ఎక్కువ యాక్సిల్)	295	445	885	150

టోల్ ప్లాజా నుండి కి.మీ 20 పరిధిలో నివాసమున్న స్థానికులు వాహనం (నాన్-కమర్షియల్) కొరకు 2024 - 25 సంవత్సరమునకు వర్తించు నెలసరి పాస్ రేటు రూ.340/-

క్రింద టోల్ ప్లాజా(లు) కొరకు నిర్దేశించిన నికర రోడ్డు పొడవుకు దిగువ టోల్ ప్లాజాల వద్ద బకాయి ఉన్న, చెల్లించదగిన రుసుం దిగువ విధంగా విధించబడి, వసూలు చేయబడును.

టోల్ ప్లాజా ప్రదేశం (చైనేజ్)	దిగువ పొడవుకు చెల్లించవలసిన రుసుం (కి.మీ.లు)
కి.మీ. 94.740 (వీరంజనేయపురం గ్రామం దగ్గర, పల్నాడు జిల్లా)	46.863

జాతీయ రహదారి విభాగంలో (పలు ప్రయాణాలు) అనేక సార్లు ప్రయాణించుటకు ఈ క్రింది రేట్లలో పాసులు జారీ చేయబడతాయి.

చెల్లించవలసిన మొత్తం	ఒకవైపు ప్రయాణాలకు అనుమతించు గరిష్ట సంఖ్య	చెల్లుబాటు కాలం
ఒక వైపు ప్రయాణానికి ఫీజు ఒకటిన్నర రెట్లు	రెండు	చెల్లింపు చేసిన సమయం నుండి ఇరవై నాలుగు గంటలు
యాభై ఒక వైపు ప్రయాణాలకు చెల్లించవలసిన రుసుములో 2 /3 వంతు	యాభై	చెల్లింపు చేసిన తేది నుండి ఒక నెల

వాటి తరగతి కొరకు పేర్కొనబడిన అనుమతించిన లోడ్ కంటే అధికంగా లోడ్ చేయబడిన మెకానికల్ వాహనములు, సదరు రూల్స్ యొక్క రూల్ 10 యొక్క సబ్ రూల్ 1ఎ లో పేర్కొనబడిన ఫీజుకు సమానమైన దానిని, ఫీజు కలెక్టింగ్ ఏజెన్సీకి జాతీయ రహదారి పై ఓవర్ లోడ్ అయిన వాహనము ప్రవేశము కొరకు ఫీజును చెల్లించవలసి ఉంటుంది, మరియు అట్టి మెకానికల్ వాహనము నుండి అధిక లోడ్ ను తొలగించితే తప్ప హైవే సెక్షన్ ఉపయోగించుటకు హక్కు ఉండదు.

టూ వీలర్స్, త్రీ వీలర్స్, ట్రాక్టర్లు, మరియు జంతువులు లాగే బండ్లు (ఎడ్ల బండ్లు వగైరా) నేషనల్ హై వే సెక్షన్, పర్మినెంట్ బ్రిడ్జి, బై పాస్ లేదా సొరంగం ఏది ఉంటే అది వాడకం నకు అనుమతించబడవు, ఇటువంటి విషయంలో సదరు నేషనల్ హై వే సెక్షన్, పర్మినెంట్ బ్రిడ్జి లేదా సొరంగం నకు బదులుగా సర్వీసు రోడ్డు లేదా ప్రత్యామ్నాయ రోడ్డు వినియోగించాలి. సర్వీసు రోడ్డు లేదా ప్రత్యామ్నాయ రోడ్డు ఉన్నప్పటికీ నేషనల్ హై వే సెక్షన్, పర్మినెంట్ బ్రిడ్జి, బై పాస్ లేదా సొరంగం మార్గం వినియోగించుకోవాలి అంటే, అతను లేదా ఆమె నేషనల్ హై వేస్ ఫీజు నియమావళి-2008 యొక్క రూలు 3, సబ్ క్లాజు (4) ప్రకారం కారు నకు విధించు ఫీజులు యాభై శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

సం/- ప్రాజెక్టు డైరెక్టర్,
NHAI, PIU - ఒంగోలు

అన్నాయూనివర్శిటీ లైంగిక వేధింపుల కేసులో నిందితుడిపై ఛార్జిషీట్

చెన్నై : అన్నాయూనివర్శిటీ లైంగిక వేధింపుల కేసులో నిందితుడు జ్ఞానశేఖర్‌పై చార్జిషీట్ నమోదైంది. ఈ కేసు విచారణ కోసం మద్రాస్ హైకోర్టు ఏర్పాటు చేసిన పూర్తి మహిళా సిబ్బందితో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ చార్జిషీట్‌ను నగరంలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు సమర్పించింది. గతేడాది డిసెంబరు 23న యూనివర్శిటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినిపై కొట్టూర్పురం ప్రాంతానికి చెందిన జ్ఞానశేఖర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలిని బెదిరించడం, వీడియోలు రికార్డ్ చేయడం, ఐడి కార్డు లాక్కోవడం చేశాడు. జ్ఞానశేఖర్‌పై బిఎన్ఎస్‌లోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదయింది. జ్ఞానశేఖర్‌పై ఇప్పటికే 16 క్రిమినల్ కేసులు ఉండటం గమనార్హం. 2019 నుంచి 2024 మధ్యకాలంలో చెన్నైలోని అనేక ఇళ్ల వద్ద నుంచి కార్లు, ఇతర వాహనాలు దొంగలించినట్లు కూడా నిందితుడు అంగీకరించాడు.

అత్యాచారం కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

అత్యాచారం కేసులో నిందితునికి 11 ఏళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరంలోని పిఅండ్‌టి కాలనీకి చెందిన వాసంశెట్టి దేవికుమార్ లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచార చేశాడు. దీనిపై బాధితురాలు ప్రకాష్ నగర్ పోలీస్‌లకు 2023 మే 20న ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ. పి.ప్రేమరాజు కేసు నమోదు చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి సిఐ ఎస్.లక్ష్మణరావు కేసుపై దర్యాప్తు చేపట్టి నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అనంతరం వచ్చిన సిఐ పిఇ.పవన్‌కుమార్‌రెడ్డి ఛార్జిషీటు దాఖలు చేశారు. ప్రస్తుత సిఐ ఆర్ఎస్‌కె.బాజీలాల్ సాక్ష్యాదారాలు సేకరించి కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితునిపై నేరం రుజువు కావడంతో వాసంశెట్టి దేవికుమార్‌కు 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వై.బెన్నయ్య జైలు, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో నాలుగు పతకాలు

ప్రజాశక్తి-హిందూపురం

వరల్డ్ ఫిట్నెస్ ఫెడరేషన్ (డబ్ల్యూ ఎఫ్ ఎఫ్) ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో హిందూపురం పట్టణానికి చెందిన నవీద్ వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలను కైవసం చేసుకున్నాడు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుండి 200 మంది పోటీదారులు హాజరయ్యారు. పట్టణంలోని గోల్డెన్ జిమ్ లో శిక్షణ పొందిన నవీద్ శారీరక దృఢత్వం విభాగంలో బంగారు పతకాన్ని సాధించగా సీనియర్ బాడీ బిల్డింగ్ కేటగిరిలో సిల్వర్ పతకాన్ని, జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీల్లో సిల్వర్ పతకాన్ని, క్లాసిక్ శారీరక దృఢత్వం పోటీల్లో నాలుగవ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను పోటీల్లో పాల్గొనేందుకు సహకరించిన జిమ్ నిర్వాహకులు ఆరిపుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జిమ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి హిందూపురం పట్టణ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన నవీద్ ను స్థానిక బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

తహశీల్దార్‌ను అడ్డుకున్న మహిళలు

- రోడ్డు సమస్య పరిష్కరించాలని నిలదీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఆరు వరుసల రహదారి నుంచి గ్రామంలోకి రోడ్డు వేయాలని మండల పరిధిలోని రోటరీపురానికి చెందిన మహిళలు తమ పిల్లలతో కలిసి తహశీల్దార్ పుణ్యవతిని సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ముఖ్యంగా రైతులు పొలాలకు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు మహిళలు ససేమిరా అన్నారు. దారి సమస్యను ఇప్పుడే పరిష్కరించాలని భీష్మించుకుని కూర్చున్నారు. రాత్రి పొద్దుపోయే వరకూ తహశీల్దార్‌ను అడ్డుకున్నారు. ఎట్టకేలకూ దారి సమస్యను పరిష్కరించడంతో ఆందోళన విరమించారు.

కంకర మిషన్ రాళ్లు పడి కూలీ మృతి

గుత్తి : కంకర క్రషర్ మిషన్‌లోని రాళ్లు పడి ఓ కూలీ మృతిచెందిన ఘటన గుత్తి మండలం జక్కలచెరువు గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన మునగాల సురేంద్ర (34) జక్కలచెరువు గ్రామ సమీపంలో ఉన్న శివసాయి స్టోన్ క్రషర్‌లో కూలిపనికి వెళ్లేవాడు. ఈనేపథ్యంలో కంకర క్రషర్‌లోని మిషన్‌లోకి బండ రాళ్లు వేస్తుండగా పైన ఉన్న రెండు రాళ్లు పడ్డాయి. గమనించిన తోటి కూలీలు రాళ్లను తొలగించి ఆటోలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. సురేంద్ర మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య ప్రమీలా, కుమారుడు త్రివిక్రమ్ ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.సురేష్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సాక్షుల వాంగ్మూలాలే చార్జిషీట్!

- నిర్దిష్ట ఆధారాలు సేకరించలేని పోలీసులు
- నేటికీ ప్రారంభం కాని ఢిల్లీ అల్లర్ల కేసు విచారణ
- ఐదేళ్లుగా జైలులోనే మగ్గిపోతున్న నిందితులు

2020 ఫిబ్రవరిలో అల్లర్ల సందర్భంగా ఈశాన్య ఢిల్లీలో గస్తీ నిర్వహిస్తున్న దృశ్యం

న్యూఢిల్లీ : ఐదు సంవత్సరాల క్రితం దేశ రాజధాని న్యూఢిల్లీలో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారి 53 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వీరిలో మూడింట రెండు వంతుల మందికి పైగా ముస్లింలే. ఇదో పెద్ద కుట్ర కేసు అని ఢిల్లీ పోలీసులు చెప్పుకొచ్చారు. 30 వేల పేజీలతో ఐదు ఛార్జిషీట్లు దాఖలు చేశారు. వాటిని 'స్క్రోల్' పోర్టల్ నిశితంగా పరిశీలించింది. ఎనిమిదిమంది డిఫెన్స్ లాయర్లను ఇంటర్వ్యూ చేసి వారి అభిప్రాయాలు సేకరించింది. సాక్షులిచ్చిన స్టేట్‌మెంట్లలో తేడాలు ఉన్నాయని గుర్తించింది. పేలవమైన ఆధారాలతో నిరసనలకు దురుద్దేశాలు ఆపాదించి, అమాయకులను కేసులో ఇరికించారని తేల్చింది.

ఏం జరిగింది?

2020 ఫిబ్రవరి 24న ఈశాన్య ఢిల్లీలో మతపరమైన హింసాకాండ చెలరేగింది. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించే వారికి, మద్దతు ఇచ్చే వారికి మధ్య ఘర్షణలు జరిగాయి. చట్టాన్ని వ్యతిరేకించిన వారిని ఉద్దేశించి అధికార బిజెపికి చెందిన కొందరు నేతలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారు. బిజెపి నాయకులు అనురాగ్ ఠాకూర్, కపిల్ మిశ్రా, పర్వేష్ వర్మ, అభయ్ వర్మ... విద్వేష ప్రసంగాలు చేశారని 2020 ఫిబ్రవరి 26న ఢిల్లీ హైకోర్టు జడ్జి సైతం వ్యాఖ్యానించారు. ఢిల్లీ పోలీసులు వారిని వదిలేసి 20 మందిపై అత్యంత క్రూరమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసులు పెట్టారు. ఈ 20 మందిని వివిధ సందర్భాలలో అరెస్ట్ చేశారు. ఇది జరిగి ఐదేళ్ల గడిచిన తర్వాత కూడా వీరిలో 12 మంది (అందరూ ముస్లింలే) ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. వీరిపై విచారణ నేటికీ ప్రారంభం కాలేదు.

ఇవేం చార్జిషీట్లు ?

క్షేత్ర స్థాయి వాస్తవాలతో నిమిత్తం లేకుండా నిందితులపై పోలీసులు చార్జిషీట్లు దాఖలు చేశారు. ఎలాంటి ప్రాతిపదికలు కానీ, ఆధారాలు కానీ లేకుండా అభియోగాలు మోపారు. చట్టబద్ధమైన నిరసనలకు, ఉగ్రవాదానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చెరిపేశారు. వాట్సప్, ఫేస్‌బుక్‌లో నిందితులు పెట్టిన పోస్టులనే పోలీసులు ఆధారాలుగా చూపడం గమనార్హం. కొందరు సాక్షుల వాంగ్మూలాలపైనే ప్రాసిక్యూషన్ ఎక్కువగా ఆధారపడింది. వారెవరో కూడా బహిర్గతం చేయలేదు. హింసకు సంబంధించి నిందితులపై ఎలాంటి ప్రత్యక్ష ఆధారాలను ప్రాసిక్యూషన్ సంపాదించలేకపోయింది. కేవలం ఊహాజనితంగా ఓ పెద్ద కుట్ర జరిగిపోయిందని ఆరోపణలు మాత్రం చేసింది. కొందరు సాక్షులు చేసిన మౌఖిక ఆరోపణల ఆధారంగానే నిందితులపై కేసులు మోపారని పలువురు న్యాయవాదులు తెలిపారు. కేసుకు బలం చేకూర్చే ఎలాంటి నిర్దిష్ట ఆధారాలు లేవు. ఏ ఒక్క నిందితుడి నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోలేదు. హింస జరిగిన ప్రాంతాలలో ఉన్న సిసి టివి ఫుటేజ్‌లను పరిశీలిస్తే వాటిలో నిందితులెవ్వరూ కన్పించలేదు.

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిందితులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారని, నిరసన తెలిపారని మాత్రమే ప్రాసిక్యూషన్ ఆధారాలతో సహా చెప్పగలిగింది. వాట్సాప్ గ్రూపుల మధ్య జరిగిన చాటింగులు, సోషల్ మీడియా పోస్టులను గమనిస్తే అసలు నిరసనలకు హింసారూపం ఇవ్వాలన్న యోచన ఏదీ ఆందోళనకారుల్లో కన్పించలేదు. చార్జిషీట్ ఓ కథనంలా సాగిందే తప్ప స్పష్టమైన ఆధారాలతో ముగింపు ఇచ్చే విధంగా లేదని ఓ న్యాయవాది వ్యాఖ్యానించారు. నిర్దిష్ట ఆధారాలేవీ లభించకపోవడంతో ప్రాసిక్యూషన్ సాక్షుల వాంగ్మూలాల పైనే ఎక్కువగా ఆధారపడింది. అయితే అవి నిందితులను అరెస్ట్ చేసిన నెలల తర్వాత నమోదు చేసినవి. నిరసనకారులకు క్రిమినల్ ఉద్దేశాలు ఆపాదించేందుకు వాటిని ఉపయోగించు కున్నారు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమంటే సాక్షుల వాంగ్మూలాలలో అనేక వ్యత్యాసాలు కన్పిస్తున్నాయి. వారి సాక్ష్యాల మధ్య పొంతనే కన్పించలేదు. ఇలాంటి సాక్ష్యాలను కుట్ర అభియోగాలకు ప్రాసిక్యూషన్ ప్రాతిపదికగా తీసుకుంది.

డిఫెన్స్ న్యాయవాదులు ఏమన్నారంటే...

పోలీసులే వాంగ్మూలాలను తయారు చేసి సాక్షులతో చెప్పించారని డిఫెన్స్ న్యాయవాదులు ఆరోపించారు. చార్జిషీట్లను 'పేలవమైన స్క్రిప్టులు'గా వారు అభివర్ణించారు. ప్రాసిక్యూషన్ చాలా గొప్ప వాదనలు చేసిందని, కానీ వాటికి మద్దతుగా ఎలాంటి ఆధారాలు చూపలేకపోయిందని చెప్పారు. 'నిరసన ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, నిర్వహించడం పౌరుల ప్రాథమిక హక్కు. అలాంటి వాటిని కుట్రకు ఆధారాలుగా చూపారు' అని ఎద్దేవా చేశారు. నిరసనకారులను అల్లరిమూకగా చూపారని ఓ డిఫెన్స్ న్యాయవాది తెలిపారు. నిందితులు జైలు గోడల నుండి బయటికి రాకుండా చేయడానికే ఉపా చట్టాన్ని ఓ ఆయుధంగా వాడుతున్నారని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి ఆరోపణలే ఎదుర్కొంటున్న నిందితులపై ఉపా యేతర కేసులు పెట్టినప్పుడు వారు సులభంగా బెయిల్ పొందుతున్నారు. ఉపా కింద అదే తరహా కేసులు ఎదుర్కొంటున్న వారు మాత్రం బెయిల్ పొందలేకపోతున్నారు. ఈ కేసులో 12 మంది నిందితులపై ఇంకా అభియోగాలు మోపనేలేదు. వారు ఐదేళ్లుగా జైలులో మగ్గిపోతూనే ఉన్నారు. కొందరు నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లు మూడు సంవత్సరాలుగా హైకోర్టులో పెండింగ్‌లో ఉండడం గమనార్హం. కొందరు మాత్రం వేర్వేరు కారణాలతో బెయిల్ పొంది జైలు నుంచి బయటపడ్డారు.

ఉపాధి హామీ అదనపు నిధులు విడుదల లేనట్లే

- విడుదల చేయకూడదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) కోసం 2025 ఆర్థిక సంవత్సరానికి అదనపు నిధులను విడుదల చేయకూడదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఏడాదికి రూ.86 వేల కోట్లు సరిపోతాయని, ఈ ఏడాది కేటాయింపుల నుండి దాదాపు రూ.7,500 కోట్ల ఖర్చు చేయని మొత్తం మిగిలిన కాలాన్ని కవర్ చేస్తుందని అధికారులు తెలిపారు. "కోవిడ్ సమయంలో రాష్ట్రాలు అత్యధిక మొత్తం దాదాపు రూ.1.1 లక్షల కోట్లు తీసుకున్నాయి. అప్పుడు గ్రామీణ సంక్షోభం ఉంది. సాధారణ సమయాల్లో రూ.86,000 కోట్ల కంటే తక్కువగా ఉంది. గ్రామీణ డిమాండ్ బాగానే ఉంది" అని ఒక అధికారి తెలిపారు. ఇప్పటివరకు 2025 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.82,684 కోట్లు విడుదల చేసిందని, దీని వార్షిక వ్యయం రూ.86,000 కోట్ల (96 శాతం)ని తెలిపారు. వాస్తవ వ్యయం దాదాపు రూ.94,500 కోట్లు, ఇందులో ఈ పథకంలో గతంలో పొదుపు చేసిన కొంత భాగాన్ని కూడా ఉపయోగించుకున్నారు. ఇటీవల, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాసిన లేఖలో నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ఈ పథకానికి రూ.86,000 కోట్లు కేటాయించింది. 2024-2025 సవరించిన అంచనా ప్రకారం ఈ పథకానికి ఖర్చు చేసిన మొత్తానికి సమానంగా ఉంది. ఇది ఇటీవలి కాలంలో ఈ పథకం కోసం బడ్జెట్‌లో స్తబ్దతను సూచిస్తుంది. తొలి నుంచీ బిజెపికి, మోడీకి వున్న వ్యతిరేకతను కేటాయింపులు ఏటా తగ్గించడం స్పష్టం చేస్తోందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీడీ కార్మికులు

అభివృద్ధికి నోచుకోని బీడీ కార్మికులు

- గుర్తింపు కార్డులను మంజూరు చేయండి
- బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులు

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

ఏళ్ల తరబడి బీడీలు చుడుతున్న బీడీ కార్మికులు అభివృద్ధి, సంక్షేమంకు దూరంగా ఉన్నారని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులు పేర్కొన్నారు. బీడీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బీడీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ రజాక్ వలికు అందజేశారు. ముందుగా స్థానిక ఎన్జీవో హోంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ఎంతో కాలంగా బీడీలు చుట్టి కష్టానికి తగ్గ వేతనం లేక అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1000 బీడీలు చుడితే కేవలం రూ.200 మాత్రమే బీడీ కంపెనీలు ఇస్తున్నాయన్నారు. అందులోనూ రూ.25 నుంచి రూ.40 వరకు కోత విధిస్తూ బీడీ కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నాయని తెలిపారు. బీడీలు చుట్టూ ఆ పొగాకు గాటుకు కార్మికులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. వీరి కోసం ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. వెయ్యి బీడీలు చుట్టేవారికి కనీసం రూ.300 రూపాయలు కూలి ఇవ్వాలన్నారు. నిరుపేదలైన బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలన్నారు. పిఎఫ్, చట్టబద్ధమైన ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కన్వీనర్ ఉమా గౌడ్, బీడీ కార్మిక సంఘం రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, సిఐటియు నాయకులు హనుమంత్ రెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, భాస్కర్, నాగరాజు బీడీ కార్మికులు పాల్గొన్నారు.

రీ సర్వేపై క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలోని ఆర్డీవోలు అందరూ వారి పరిధిలో జరుగుతున్న రీ సర్వేను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఫ్రీ హోల్డ్, ఇంటి స్థలాలు, రెవెన్యూ సేవలు, రీ సర్వే, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వినతులు, రైతులకు గుర్తింపు కార్డులు, తదితర అంశాలపై సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ లో వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన అంశాలను ఈ నెల 28 లోపు పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎం ఈ సర్వే పనులను త్వరగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదని పారదర్శకంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో 233 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ తమ శాఖకు వచ్చే అర్జీలను జవాబు తరంతో బాధ్యతగా క్షేత్రస్థాయిలో వెళ్లి సమస్య మూలాలను తెలుసుకుని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అన్ని శాఖల హెచ్ఒడిలు అందరూ ఫీడ్ బ్యాక్ నివేదికలపై బాధ్యత వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు పి-4 సర్వేను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, పట్టు పరిశ్రమ జేడీ పద్మావతి, సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకట రమణారెడ్డి, సర్వే ఏడీ విజయశాంతి బాయితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోన్ కార్యకలాపాలకు జాప్యమెందుకు?

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన జరిగింది. వాల్తేరు రైల్వేను విశాఖపట్నం రైల్వేగా కొనసాగించేందుకు కేంద్రం ఏళ్ల తర్వాత అంగీకరించడం కూడా అయ్యింది. విశాఖపట్నం రైల్వే నూతన డిఆర్ఎం విధుల్లో చేరుతున్నట్లు ప్రకటన కూడా వెలువడింది. అయినా, విశాఖ కేంద్రంగా నూతన 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' కార్యకలాపాల విషయంలో ప్రగతి కానరావడం లేదు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ ప్రకటన అప్పట్లో వచ్చిన వెంటనే అక్కడి ప్రభుత్వం క్వార్టర్లు, ఆఫీసు భవనాలను సిద్ధం చేసుకుందని రైల్వే వర్గాల్లో చర్చ మొదలైంది. కాగా, కొత్త రైల్వే జోన్ కోసం ఏర్పాటు చేయబడిన ప్రత్యేకాధికారి కార్యాలయం ఈ నేపథ్యంలో ప్రాజెక్టు సవివరణ నివేదిక (డిపిఆర్)లో తాజాగా 30 నుంచి 40 వేల మేరకు స్థలం కొత్త జోన్ కార్యాలయ పనుల కోసం కావాలని రైల్వే బోర్డుకు నివేదించినట్లు సమాచారం. రైల్వే జోన్ కోసం బిడ్డింగ్ రెండు నెలల క్రితమే ఖరారైంది. 2026 సంవత్సరంలో జోన్ పనులకు శ్రీకారం చుట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈలోగా జోన్ కార్యకలాపాలకైతే ఎలాంటి ఆటంకమూ ఉండకూడదన్న వాదన రైల్వే అధికారులు, సిబ్బంది నుంచి వినిపిస్తోంది.

జోన్ కార్యకలాపాలకు స్థల సమస్య లేదు..

ఈ నేపథ్యంలో తాజా డిపిఆర్ ప్రకారం సింహాచలం దేవస్థానం ఇటీవల గోశాల వద్ద మెయిన్ రోడ్డుకు దగ్గర్లోనే అటు,ఇటు కొండల నడుమ రెండు కల్యాణ మండపాలు నిర్మాణం పూర్తిచేసింది. సుమారు 50 రూముల సామర్థ్యం ఉన్నవి కావడంతో జోన్ కార్యాలయ హెడ్‌క్వార్టర్‌గా జిఎం ఆఫీసు, చీఫ్ ఇంజినీరు, చీఫ్ ఆపరేషన్ మేనేజర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఆఫీసర్ ఇలా జోనల్ స్థాయి అధికారులంతా ఆశీనులై విధుల నిర్వహణకు ఈ స్థలం బాగుంటుందన్న ఆలోచన ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తోంది. విశాఖ నగరం నడిబొడ్డున ఎల్ఐసి భవన సముదాయంలో ఒక కాంప్లెక్స్ (సుమారు 20 వేల ఎస్ఎఫ్‌టి), ఆర్‌టిసి కాంప్లెక్స్ మేడపైన 12 వేల ఎస్ఎఫ్‌టి ఖాళీ ప్రదేశం కూడా అందుబాటులో ఉంది.

ఈ విషయాలన్నీ డిపిఆర్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దేవస్థానం కూడా టెండర్లు పిలిచి ప్రైవేట్ వాళ్లకు ఇవ్వాలన్న నిర్ణయంతో ఉంది. ఈ ప్రక్రియ పూర్తవ్వాలంటే ఏడాది కాలం పడుతున్నందున రైల్వేకు కేటాయిస్తే టెండర్లు పిలిచేలోగా దేవస్థానానికి ఆదాయం వస్తుందన్న ప్రతిపాదన చేశారు.

తూర్పు కోస్తా ఏర్పాటైన వేళలో...

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు టెండర్లనైతే రైల్వే బోర్డు పిలిచినా ఆ తర్వాత పని స్లోడౌన్ అయిందని అధికారులే స్వయంగా పేర్కొంటున్నారు. తూర్పు కోస్తా రైల్వే భువనేశ్వర్ కేంద్రంగా ప్రారంభించేందుకు ప్రకటన కేంద్రం చేసిన సందర్భంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన అందుకు సంబంధించిన రైల్వే ఉద్యోగులకు, అధికారులకు క్వార్టర్లు, ఆఫీస్ భవనాలను సిద్ధం చేసిన విషయాన్ని తాజాగా విశాఖ రైల్వే ఉద్యోగులంతా గుర్తుచేసుకుంటున్నారు. ఆ తరహాలో ఇక్కడ జోన్ కార్యకలాపాల కోసం సిద్ధపడకుండా జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇద్దరు మిలీషియా సభ్యుల అరెస్టు

- పేలుడు సామగ్రి స్వాధీనం
- రంపచోడవరం డిఎస్‌పి సాయి ప్రశాంత్

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఇద్దరు మిలీషియా సభ్యులను అరెస్టు చేసినట్లు రంపచోడవరం డిఎస్‌పి జి.సాయి ప్రశాంత్ తెలిపారు. తన కార్యాలయం సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మారేడుమిల్లి మండలం పుల్లంగి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు 90 మంది మావోయిస్టు ముఖ్య నేతలు, మిలీషియా సభ్యులతో సమావేశం జరుగుతుందని మారేడుమిల్లి సిఐకి సమాచారం వచ్చింది. దీంతో, రంపచోడవరం డిఎస్‌పి ఆధ్వర్యంలో మారేడుమిల్లి పోలీసులు, ప్రత్యేక దళాలు సమావేశం జరిగే స్థలానికి వెళ్లగా అక్కడ నుండి మావోయిస్టులు పరారయ్యారు. సమావేశం జరిగిన ప్రదేశంలో ఇద్దరు మావోయిస్టు సానుభూతిపరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి మందు పాతర సంబంధించిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

ప్రజాశక్తి-పెనుకొండ

కార్పొరేట్ జపం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని, ఇలాంటి సమయంలో ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలే మార్గమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాలలో శ్రీసత్య సాయి జిల్లా ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా మహాసభను నిర్వహించారు. మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు హాజరయ్యారు. మహాసభ ప్రారంభం సందర్భంగా సోమవారం నాడు మృతి చెందిన రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డికి నివాళులు అర్పించారు.

మహాసభలో ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

అనంతరం మహాసభను ఉద్దేశించి ప్రసన్నకుమార్ మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రభుత్వ విద్య బలోపేతానికి కూటమి నాయకులు అనేక వాగ్దానాలు చేశారన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళంలో అనేక హామీలు ఇచ్చారన్నారు. అయితే ఆ హామీల అమల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. తల్లికివందనం, పెండింగ్ ఫీజుల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదన్నారు. తల్లికి వందనం నిధులను తల్లుల ఖాతాల్లో వేయాలన్నారు. నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. సత్యసాయి జిల్లా పెనుకొండలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను కాశీయాకరణ చేసేలా నిర్ణయాలు చేస్తోందన్నారు. గత 10 ఏళ్లలో దేశంలో విద్యారంగాన్ని సర్వనాశనం చేసిన ఘనత బిజెపికి దక్కుతుందన్నారు. ఇలాంటి చర్యలను విద్యార్థి లోకం తిప్పికొట్టాలన్నారు. విద్యా, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఈఎస్.వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగార్జున, నాయకులు పవన్, హర్షకుమార్, బాబావలి, బాబ్‌జాన్, అనిల్, భరత్, విష్ణువర్ధన్‌తో పాటు జిల్లాలోని ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లులో సినిమా షూటింగ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రైల్వే గేటుకు సమీపంలోని గీతా అన్నపూర్ణ థియేటర్‌లో సోమవారం సినిమా షూటింగ్ జరిగింది. నవీన్ పోలిశెట్టి హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు మారి కొత్త దర్శకుడుగా పరిచయం అవుతున్నారు. ఈ థియేటర్‌లో ప్రభాస్ నటించిన బాహుబలి చిత్రం రిలీజ్ అయినట్లు ప్రభాస్ ఫాన్స్‌తో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. దీంతో సినిమా షూటింగ్ చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివస్తున్నారు. పట్టణ ఎస్ఐ, ఎఎస్ఐలు అభిమానులను అదుపు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. సితార ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రం నిర్మిస్తోంది. మరో 10 రోజుల పాటు పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో సినిమా మొదటి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతుందని యూనిట్ చెబుతోంది.

కొల్లేరు సమస్యపై భరోసా కరువు

- సిఎం, డిప్యూటీ సిఎంలతో ఎంపి పుట్టా, ఎమ్మెల్యేలు సమావేశం
- జిరాయితీ, సొసైటీ భూములు 22 వేల ఎకరాలపై చర్చ
- చెరువుల ధ్వంసం సమస్యను లేవనెత్తిన ప్రజాప్రతినిధులు
- వెంటనే ఆపేలా చర్యలకు ప్రభుత్వం నుంచి దక్కని హామీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరులో చెరువులకు గండ్లు కొడుతూ ధ్వంసం చేస్తున్న సమస్యకు ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లభించకపోవడంపై కొల్లేరు రైతులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాలంటూ అటవీశాఖ అధికారులు కొన్ని రోజులుగా చేపల చెరువులకు గండ్లు కొట్టడం కొల్లేరు రైతులకు నిద్రలేకుండా చేస్తోంది. చెరువులకు గండ్లు కొడితే తీవ్రంగా నష్టపోతామని, కొల్లేరు సరిహద్దులు సరిగా నిర్ణయించకపోవడంతో ఇప్పటికే జిరాయితీ, సొసైటీ భూములను సైతం కోల్పోయామని వాపోతున్నారు. ఇప్పుడు ఉన్న చెరువులకు గండ్లు కొడితే తాము రోడ్డున పడాల్సి వస్తుందని కొల్లేరు రైతులు ఘొల్లుమంటున్న పరిస్థితి ఉంది. దీనిపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో కొల్లేరును ఆనుకుని ఉన్న ఎంఎల్ఎలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణయ్య, పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సోమవారం అమరావతి సచివాలయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశంలో ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొలుసు పార్థసారధి సైతం పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులంతా కొల్లేరు రైతుల సమస్యలను, అక్కడి ఇబ్బందులను సిఎం, డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లారు. జిరాయితీ భూములు 15 వేల ఎకరాలు, సొసైటీ భూములు ఏడు వేల ఎకరాలు విడదీయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని, గత వైసిపి ప్రభుత్వం సర్వే చేసి హద్దులు నిర్ణయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలిపారు. ఆ కారణంగా కొల్లేరు ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని ఎంపీ, ఎంఎల్ఎలంతా సిఎం, డిప్యూటీ సిఎంల దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు ప్రాంత ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని వీరంతా కోరారు. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులతో సిఎం, డిప్యూటీ సిఎం కొల్లేరు సమస్యపై సమగ్రంగా చర్చించినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా, అక్కడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగు న్యాయం చేయడానికి ప్రభుత్వపరంగా పూర్తి అండగా ఉంటామని సిఎం, డిప్యూటీ సిఎం చెప్పినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు.

చెరువుల ధ్వంసంపై మరోసారి సమావేశం

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు ప్రాంతంలో అధికారులు చేపట్టిన చెరువుల ధ్వంసం ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసే దిశగా న్యాయపరంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారని ప్రజాప్రతినిధులు తెలిపారు. త్వరలో పర్యావరణ, అటవీశాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిసింది. చెరువుల ధ్వంసం నిలిపివేతకు ప్రభుత్వం భరోసా ఇస్తుందని ఆశించిన కొల్లేరు రైతులు తీవ్ర నిర్వేదంలో మునిగిపోయారు.

అధికారులిచ్చిన నివేదిక ఆధారంగా కొల్లేరు ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అక్కడి ప్రజలు ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదని సిఎం భరోసా ఇచ్చినట్లు ఎంపీ, ఎంఎల్ఎలు చెబుతున్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందనే విషయాన్ని అక్కడి ప్రజలకు తెలియజేయాలని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులకు సిఎం సూచించినట్లు తెలిపారు. కొల్లేరు సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారన్నారు.

ముందుకు సాగని సహాయక చర్యలు

- ఊట, ఒండ్రు మట్టితో ఆటంకం
- ర్యాట్ మైనర్స్, స్నిప్పర్‌డాగ్‌ల సేవలు
- ఉత్తరాఖండ్ మాదిరి సహాయక చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో చిక్కుకున్న నలుగురు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లను కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. వారి ఆచూకీ తెలుసుకునేందుకు నేవీ, ఆర్మీ, హైడ్రా, సింగరేణి, నేషనల్ హైవే టీంలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. టన్నెల్‌లో 14వ కిలోమీటర్ సమీపంలో చిక్కుకున్న ఎనిమిది మంది దగ్గరకు చేరుకునేందుకు ఆర్మీ గత 20 గంటలుగా తీవ్రంగా శ్రమిస్తోంది. 11వ కిలోమీటర్ వరకు సాఫీగా ఉన్నా ఆ తర్వాత సొరంగంలో పెద్ద మొత్తంలో ఒండ్రుమట్టి కలిసి ఊట వస్తుండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

ప్రతీకూల పరిస్థితుల మధ్యే సోమవారం రాత్రి వరకు సొరంగంలో 12 కిలోమీటర్ల వరకు క్లియర్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఉబికివస్తున్న నీటిని ఎప్పటికప్పుడు మోటర్ల ద్వారా బయటకి తోడిపోస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో డ్రోన్లు, ఎండోస్కోపిక్ కెమెరాలు, వాకీటాకీ సిగ్నల్ పరికరాలను సహాయక బృందాలు సొరంగం లోపలికి తీసుకెళ్లాయి. సొరంగంలో విరిగిన టిబిఎం భాగాన్ని ముందుగా బయటకు తీయాలని అధికారులు భావిస్తున్నారు. విరిగిన భాగాలు, బురదను బయటకు తెచ్చే అంశంపై సహాయక బృందాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ప్రాణాలను ఫణంగా పెట్టి సుమారు 540మంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. వారితో పాటు 14మంది ర్యాట్ మైనర్స్ సేవలను కూడా ఉపయోగిస్తున్నారు. లోపల ఉన్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు స్నిప్పర్ డాగ్స్‌ను రంగంలోకి దింపినా నడుం లోతు నీరు ఉండటంతో అవి లోపలికి వెళ్లలేకపోయాయి. సొరంగంలో దెబ్బతిన్న కన్వయర్ బెల్ట్‌కు మరమ్మత్తులు చేపట్టారు. పైనుంచి వర్టికల్ డ్రిల్లింగ్ ద్వారా రంధ్రం చేసి లోపలికి వెళ్లాలన్న ప్రతిపాదనను సహాయక బృందాలు విరమించుకున్నాయి. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మందిలో ఒక ఇంజనీరు మొబైల్ సిగ్నల్ ట్రేస్ అవడంతో దాని ఆధారంగా లొకేషన్ గుర్తించారు. సహాయక బృందాలకు కిలోమీటర్ దూరంలో మొబైల్ ఉన్నట్లు అంచనావేశారు.

టన్నెల్‌లో సహాయక చర్యలను మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి సమీక్షించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహాయక బృందాలతో పాటు లోపలికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగ మార్గంలో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటికి తీసేందుకు కేంద్ర, రాష్ట్ర విపత్తు బృందాలతో పాటు నేవీ, ఆర్మీ, సింగరేణి, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం జెపి నవయుగలకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఇప్పటి వరకు ఏడు సార్లు టన్నెల్‌లో పరిశీలన చేశారని తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులో ఈ బృందాలు సమర్థవంతంగా పనిచేశాయని చెప్పారు. లోపల సహాయ చర్యలకు నీళ్ల, మట్టి ఆటంకంగా మారాయని, కార్మికులను రక్షించడానికి ప్రత్యమ్నాయ చర్యలకు సైతం వెనకడబోమని మంత్రి చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా 296సార్లు ఇంటర్‌నెట్ షట్‌డౌన్!

- ప్రభుత్వ ఆంక్షల్లో భారత్ టాప్
- 84 సార్లు షట్‌డౌన్

న్యూఢిల్లీ : గత ఏడాది అంతర్జాతీయంగా 296సార్లు ఇంటర్‌నెట్ షట్‌డౌన్‌లు సంభవించాయని యాక్సెస్ నౌ సంస్థ నివేదిక తెలిపింది. ఇందులో 28శాతం భారత్‌లోనే జరిగాయని, అంటే 84సార్లు షట్‌డౌన్‌లు చోటు చేసుకున్నాయని వెల్లడించింది. ప్రభుత్వ ఆదేశిత ఆంక్షల్లో భారత్ అగ్రస్థానంలో వుందని పేర్కొంది. మయన్మార్ 85 షట్‌డౌన్‌లతో ప్రథమ స్థానంలో వుంది. అంతకుముందు ఏడాదితో పోల్చుకుంటే 2024లో భారత్‌లో తక్కువగానే ఈ సంఖ్య వుంది. కానీ అంతర్జాతీయంగా మాత్రం ఎక్కువగానే నమోదయ్యాయి. "16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇంటర్ నెట్ సేవలు స్తంభించిన పరిస్థితులను ప్రజలు ఎదుర్కొన్నారు. అందులో మణిపూర్‌లో (21), హర్యానాలో (12), జమ్ము కాశ్మీర్‌లో (12) అగ్ర స్థానంలో వున్నాయి. " అని నివేదిక పేర్కొంది. భారత్‌లో మొత్తంగా 84సార్లు ఇంటర్‌నెట్ సేవలు స్తంభించగా, 41సార్లు నిరసనల కారణంగా నిలిచిపోయాయి. 23సార్లు మత హింస కారణంగా స్తంభించాయని ఆ నివేదిక వెల్లడించింది. మయన్మార్‌లో నమోదైన 85 షట్‌డౌన్లలో ఇతర దేశాలు, గ్రూపుల కారణంగా 11సార్లు నెట్ సేవలకు అంతరాయం కలిగింది. ఇందులో చైనా రెండుసార్లు (మయన్మార్‌లో ప్రాంతాలపై షట్‌డౌన్‌లు), థాయిలాండ్ నాలుగుసార్లు, నేషనల్ యూనిటీ ప్రభుత్వం (ఎన్‌యుజి), మయన్మార్ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఆర్మీ (ఎంఎన్‌డిఎఎ), తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ (టిఎన్‌ఎల్‌ఎ)లు తమ అదుపులో వున్న ప్రాంతాలపై ఒక్కోసారి షట్‌డౌన్ విధించాయి. మిగిలిన రెండుసార్లు గుర్తు తెలియని పక్షాలు విధించాయని ఆ నివేదిక పేర్కొంది. పరీక్షలకు సంబంధించిన షట్‌డౌన్‌ల గురించి ప్రత్యేకంగా దృష్టి సారిస్తే, భారత్ 2024లో కీలకమైన పరీక్షలకు ముందు ఐదుసార్లు ఇలాగే ఇంటర్‌నెట్ సేవలపై ఆంక్షలు విధించింది. ఈ చర్య ఆంక్షల వ్యతిరేక గ్రూపుల ఆగ్రహానికి గురైంది. జార్ఖండ్‌లో జనరల్ గ్రాడ్యుయేట్ స్థాయి కంబైన్డ్ కాంపిటీటివ్ పరీక్షల సమయంలో సెప్టెంబరు 22న గంటన్నర పాటు నెట్ సేవలను నిలిపివేశారు. అదే నెలలో అస్సాం కూడా అనేక జిల్లాలో ప్రభుత్వ పరీక్షల కోసం ఇదే రీతిలో ఆంక్షలు విధించింది. జనవరిలో రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష కోసం షట్‌డౌన్ విధించింది. పరీక్షల్లో మోసాలు జరగడానికి అవకాశాలు వున్నాయన్న కారణాలతో ఈ చర్యలు తీసుకున్నారని, దీనికి తీవ్రమైన స్పందన వచ్చిందని ఆ నివేదిక పేర్కొంది.

బంగ్లాదేశ్ వైమానిక స్థావరంపై దాడి : ఒకరి మృతి

ఢాకా : బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. సోమవారం ఏకంగా బంగ్లాదేశ్ వైమానిక స్థావరంపై దుండగులు మెరుపుదాడికి దిగారు. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. బజార్ జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. కోక్స్ బజార్‌లోని బంగ్లాదేశ్ ఎయిర్ ఫోర్స్ బేస్‌పై దుండగులు దాడికి పాల్పడినట్లు బంగ్లాదేశ్ సాయుధ దళాల పబ్లిక్ రిలేషన్స్ విభాగం ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ ఒక సంక్షిప్త ప్రకటనలో తెలిపింది. ఈ దాడిలో 30 ఏళ్ల స్థానిక వ్యాపారి షిహాబ్ కబీర్ ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఎదురు కాల్పులకు దిగినట్లు వెల్లడించింది.

క్వింటాలుకు రూ.20 వేలివ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పథకం ద్వారా రైతులను ఆదుకోకుండా రూ.11,781 కన్నా ధర తగ్గితేనే సాయం చేస్తామనడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఈ ధరను ప్రమాణికంగా తీసుకుంటే గతేడాది ధరలతో పోలిస్తే రైతులకు ఎకరాకు రెండు లక్షల రూపాయల వరకూ నష్టం వస్తుందని వివరించారు. రిటైల్ మార్కెట్లో ధర భారీగా పెంచి విక్రయిస్తున్నారని తెలిపారు. రైతుకు కిలోకు రూ.90 దక్కితే వినియోగదారుల వద్ద వ్యాపారులు కిలో రూ.400 వరకు వసూలు చేస్తున్నారని వివరించారు. ఈ దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. మిర్చి విస్తీర్ణం తగ్గిందని, దిగుబడి కూడా పడిపోయిందని, ఎగుమతులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. వ్యాపారులు సిండికేటై ధరలను తగ్గించేస్తున్నారన్నారు. కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్‌ను అదాని గ్రూపు చెన్నయ్‌కి తరలించడం వల్ల వ్యాపారులకు ఇబ్బందులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ ఏడాది మిర్చితో పాటు వరి, పత్తి, టమాటా తదితర వాటి ఉత్పత్తుల ధరలు తగ్గి రైతులు నష్టపోయారని వివరించారు. బడ్జెట్లో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతాంగం సంక్షోభంలో చిక్కుకుందన్నారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం నాయకులు వై.కేశవరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్, భగత్‌సింగ్ ఫొటోల తొలగింపు

- అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యేల నిరసన

న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బిఆర్ అంబేద్కర్, భగత్ సింగ్‌ల ఫొటోలు తొలగించారని ఆరోపిస్తూ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అతిషి, ఆప్ ఎమ్మెల్యేలు ఢిల్లీ అసెంబ్లీ సమావేశంలో నిరసన చేపట్టారు. బిజెపి అధికారంలోకి వచ్చాక తొలిసారి అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రతిపక్ష ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు మొదటి రోజే సభలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. సిఎం కార్యాలయం నుంచి బిఆర్ అంబేద్కర్, భగత్ సింగ్‌ల ఫొటోలు తొలగించి, దళిత, సిక్కు వ్యతిరేక పార్టీగా బిజెపి మరోసారి రుజువు చేసుకుందని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అతిషి విమర్శించారు. తమ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కేజ్రీవాల్ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో బాబా సాహెబ్ అంబేద్కర్, భగత్ సింగ్‌ల ఫొటోలు ఏర్పాటు చేశారని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం ఆఫీస్ నుంచి వారి ఫొటోలను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ..నిరసన చేపట్టారు.

అసెంబ్లీ సమావేశానికి ముందు ఆప్ నేతలు అసెంబ్లీ వెలుపల ఆందోళనకు దిగారు. భాజపా ప్రభుత్వం తమ మొదటి క్యాబినెట్ సమావేశంలోపు ప్రతి మహిళ ఖాతాలో రూ.2,500 వేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని ఆప్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. మార్చి 8 నాటికి ఢిల్లీలోని ప్రతి మహిళ ఖాతాలో మహిళా సమ్మాన్ యోజన మొదటి విడత డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. గత రెండ్రోజులుగా సీఎంను కలవడానికి తమకు సమయం కూడా ఇవ్వట్లేదని అన్నారు.

నిరసనలపై ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన బిజెపి ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతలకు సభ సజావుగా నడవడం ఇష్టం లేదని, సభకు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతో వారు ఇక్కడికి వచ్చారని వ్యాఖ్యానించారు. గందరగోళం మధ్య సభా కార్యక్రమాలు 15 నిమిషాల పాటు వాయిదా పడ్డాయి.

బిజెపి దళిత వ్యతిరేకి అనడానికి నిదర్శనం ఇదే : అతిషి

బిజెపి దళిత వ్యతిరేక, సిక్కు వ్యతిరేక పార్టీ అని రుజువైందని ఢిల్లీమాజీ ముఖ్యమంత్రి, అసెంబ్లీ ప్రతిపక్ష నేత అతిషీ వ్యాఖ్యానించారు. అతిషీ సోమవారం ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాతో ఆమె ఛాంబర్‌లో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఆఫీసు నుండి బిజెపి అంబేద్కర్, భగత్‌సింగ్ ఫొటోలను తొలగించిందని అన్నారు. బిజెపి, సిక్కు, దళిత వ్యతిరేక వైఖరిని అనుసరిస్తోందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. తొలి కేబినెట్ సమావేశంలోనే మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయ పథకాన్ని అమలు చేస్తామని ప్రధాని మోడి ప్రకటించారని, ఈ హామీని నెరవేర్చడంలో బిజెపి విఫలమైందని అన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా అరవిందర్ సింగ్ లవ్లీ ఎన్నికయ్యారు. రాజ్ నివాస్‌లో అరవిందర్ సింగ్ లవ్లీతో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్.. ప్రమాణం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు స్పీకర్ ఎన్నికను నిర్వహించారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా బిజెపి ఎమ్మెల్యే విజేందర్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యమంత్రి రేఖాగుప్తా ఆయన పేరును ప్రతిపాదించారు.

పుతిన్‌కు జిన్‌పింగ్ ఫోన్

- చైనా, రష్యా పరస్పరం సహకరించుకునే నిజమైన మిత్రులని వ్యాఖ్య

బీజింగ్ : చైనా, రష్యాలు నిజమైన మిత్ర దేశాలని, పరస్పరం మద్దతునిచ్చుకుంటూ సహకరించుకుంటాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ప్రభుత్వ మీడియా జిన్హువా వార్తా సంస్థ సోమవారం తెలిపింది. "చైనా, రష్యాలు మంచి ఇరుగు పొరుగు దేశాలని చరిత్రను, వాస్తవాలను చూసినట్లైతే అర్థమవుతుంది. అవి ఏనాడూ దూరం జరిగిపోవు. సుఖ దుంఖాలు పంచుకునే నిజమైన స్నేహితులు, ఒకరికొకరు మద్దతునిచ్చుకుంటూ ఉమ్మడి అభివృద్ధిని సాధిస్తాయి." అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. పుతిన్ కోరిక మేరకు సోమవారం ఇరువురు నేతలు ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారని జిన్హువా తెలిపింది. ఇరు దేశాల మధ్య సైనిక, వాణిజ్య సంబంధాలు బలోపేతమయ్యాయి. చైనా, రష్యా సంబంధాలకు విశిష్టమైన వ్యూహాత్మక విలువ వుందని, తమ సంబంధాలు మరే ఇతర పక్షాన్ని లక్ష్యంగా చేసుకోవని జిన్‌పింగ్ పేర్కొన్నారు. తృతీయ పక్షం వల్ల ప్రభావితం కూడా చెందబోవని స్పష్టం చేశారు. చైనా, రష్యా అభివృద్ధి వ్యూహాలు, విదేశాంగ విధానాలు వుంటాయని దీర్ఘకాలికమైనవని ఆయన చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితుల్లో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ రష్యా, చైనా సంబంధాలు సజావుగా ముందుకు సాగుతాయని, ఇవి పరస్పర అభివృద్ధికి, పునరుజ్జీవనానికి సాయ పడతాయని చెప్పారు. అంతర్జాతీయ సంబంధాల్లో సుస్థిరతను, సానుకూల శక్తిని చొప్పిస్తుందని అన్నారు. ఉక్రెయిన్‌లో సంక్షోభం చెలరేగిన సమయంలో ఆ సమస్యను పరిష్కరించడానికి తాను కొన్ని ప్రతిపాదనలు చేసిన విషయాన్ని జిన్‌పింగ్ గుర్తు చేశారు.

రష్యా బలగాలు వైదొలగాలని కోరుతూ

ఐరాసలో ఉక్రెయిన్ తీర్మానం

ఐక్యరాజ్య సమితి : తమ భూభాగం నుంచి రష్యా బలగాలు తక్షణమే వైదొలగాలని కోరుతూ ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అమోదించింది. ఈ తీర్మానంపై సోమవారం రాత్రి ఓటింగ్ జరిగింది. మరోవైపు, ఉక్రెయిన్ సమస్యను త్వరగా పరిష్కరించే ఉద్దేశంతో రష్యాతో అకస్మాత్తుగా ట్రంప్ చర్చలు జరపడంతో అమెరికా, ఉక్రెయిన్‌ల మధ్య విభేదాలు, ఉద్రిక్తతలు తలెత్తాయి. మాస్కోతో సంబంధాలపై ట్రంప్ ప్రభుత్వ అసాధారణ రీతిలో వైఖరిని మార్చుకోవడంతో యూరప్ కూటమితో కూడా అమెరికాక సంబంధాలు ఇబ్బందుల్లో పడ్డాయి. గత వారంలో జరిగిన ప్రాథమిక చర్చల్లో తమను, ఉక్రెయిన్‌ను బహిష్కరించారంటూ యురోపియన్ నేతలు ఆగ్రహంగా ఉన్నారు. ఉక్రెయిన్‌పై ఐక్యరాజ్య సమితి పెట్టే తీర్మానాన్ని తాము సమర్థించేది లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ తీర్మానానికి పోటీగా చివరి నిముషంలో తమ స్వంత తీర్మానాన్ని ప్రతిపాదించారు. దానికి మద్దతునివ్వాలని మిత్రపక్షాలను కోరుతున్నారు. భద్రతా మండలిలో కూడా తమ ప్రతిపాదనను ఓటింగ్‌కు పెట్టాలని అమెరికా భావిస్తోంది. సోమవారం రాత్రి ఈ ఓటింగ్ జరుగుతుందని భావిస్తున్నారు.

జర్మనీ ఛాన్సలర్‌గా ఫ్రెడరిక్ మెర్జ్ ?

బెర్లిన్ : జర్మనీ ఛాన్సలర్ ఎన్నికల్లో ఫ్రెడరిక్ మెర్జ్ నేతృత్వంలోని సిడియు-సిఎస్‌యు కన్జర్వేటివ్ కూటమి విజయం సాధించింది. ఈ కూటమికి 28.6శాతం ఓట్లతో 208 స్థానాలు లభించాయి. దీంతో ఫ్రెడరిక్ కొత్త ఛాన్సలర్‌గా ఎన్నికవనున్నారు. ఇక మితవాద కూటమికి చెందిన ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి) రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ కూటమికి 20.8శాతం ఓట్లతో 152 స్థానాలు లభించాయి. ప్రస్తుత అధ్యక్షులు ఓల్ఫ్ షుల్జ్ నేతృత్వంలోని సోషల్ డెమొక్రాటిక్ పార్టీ (ఎస్‌డిపి) 120 స్థానాలు గెలుచుకుంది. జర్మనీ పార్లమెంట్ దిగువ సభ అయిన బుందెస్టాగ్‌లో 630 స్థానాలకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. యూరప్‌లోనే అతిపెద్దదైన జర్మనీ ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభనకు గురవుతోందన్న ఆందోళనలు, వలసలకు సంబంధించిన అంశాలు, ఉక్రెయిన్‌లో యుద్ధం వంటివి అనిశ్చితిని కలగజేస్తున్న తరుణంలో కీలకమైన ఈ ఎన్నికలు జరగడంతో ప్రపంచం దృష్టిపై వీటిపై పడింది.

యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటు

- 1600 మంది ఇంటికి
- మరి కొందరికి నిరవధిక సెలవు

వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం యుఎస్ ఎయిడ్ సంస్థపై కక్ష కట్టినట్లు కన్పిస్తోంది. ఆ సంస్థ అందిస్తున్న విదేశీ సాయాన్ని ఇప్పటికే నిలిపివేసిన ప్రభుత్వం... తాజాగా 1600 మంది ఉద్యోగులపై వేటు వేసింది. అమెరికా వెలుపల పనిచేస్తున్న కొందరికి నిరవధిక సెలవు మంజూరు చేసింది. ఇప్పుడు ఆ కార్యాలయంలో కీలక విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మాత్రమే మిగిలారు. 'సిబ్బందిని కుదించాలన్న చర్య కారణంగా మీపై ప్రభావం పడుతుందన్న విషయాన్ని తెలియజేసేందుకు విచారిస్తున్నాము' అంటూ సిబ్బందికి ఈ-మెయిల్స్ పంపారు. ఈ సమాచారాన్ని అందుకున్న వారు 24వ తేదీన ప్రభుత్వ సర్వీసును వదిలేయాల్సి ఉంటుందని అందులో తెలియజేశారు. ప్రస్తుతం యుఎస్ ఎయిడ్‌లో నాయకులు, కీలక విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది మాత్రమే మిగిలారు. 'కొన్ని కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తులు, ముఖ్య నాయకులు, నిర్దిష్ట కార్యక్రమాల కోసం ఉద్దేశించిన వారు మినహా యూఎస్ ఎయిడ్ నేరుగా నియమించుకున్న సిబ్బంది మొత్తం పాలనా సంబంధమైన సెలవులో ఉన్నట్లుగా పరిగణిస్తాం' అని యుఎస్ ఎయిడ్ ఉద్యోగులకు పంపిన నోటీసుల్లో తెలిపారు. నిరవధిక వేతన సెలవు లేదా పాలనా సంబంధమైన సెలవు అంటే ఉద్యోగిని తాత్కాలికంగా విధుల నుండి తప్పించడం అన్న మాట. అయితే వేతనాలు మాత్రం చెల్లిస్తూ ఉంటారు. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహితుడు ఎలన్ మస్క్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే.

ఉక్రెయిన్‌కు బాసటగా యూరప్!

- 6న 27 ఇయు దేశాల నేతల భేటీ

కీవ్ : ఉక్రెయిన్‌పై యుద్ధానికి మూడేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని యూరప్, కెనడాలకు చెందిన పలువురు నేతలు సోమవారం కీవ్ చేరుకున్నారు. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన నాటి నుండి ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా వైఖరి మారుతున్న నేపథ్యంలో ఈ నేతలందరూ కీవ్‌కు మద్దతును పునరుద్ఘాటించేందుకు వచ్చారు. యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడే సహా 12మందికి పైగా నేతలు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రి సిబిహా, సాయుధ బలగాల చీఫ్ ఆంద్రి యార్మార్క్‌లను కలుసుకుని మాట్లాడారు. "ఉక్రెయిన్ యూరప్‌లో వుంది కాబట్టి ఈనాడు కీవ్‌లో యూరప్ వుంది." అని వాన్ డెర్ లేయన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "మనుగడ కోసం జరిపే ఈ పోరులో ఇక్కడ పణంగా పెట్టింది ఉక్రెయిన్ భవిష్యత్ మాత్రమే కాదు, మొత్తంగా యూరప్ భవితవ్యం కూడా." అని ఆమె వ్యాఖ్యానించారు. కీవ్ వచ్చిన యురోపియన్ నేతల్లో యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటానియో కోస్టా, స్పెయిన్, ఉత్తర యురోపియన్ దేశాల ప్రధానులు వున్నారు. యుద్ధ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు వీరు హాజరయ్యారు. ఉక్రెయిన్‌కు అందించే తోడ్పాటుపై అధ్యక్షుడు జెలెన్‌స్కీతో వారు చర్చలు జరిపారు. మార్చి 6వ తేదీన బ్రస్సెల్స్‌లో 27 ఇయు దేశాల నేతలు ఉక్రెయిన్ ప్రధాన అంశంగా అత్యవసరంగా సమావేశం కానున్నారని యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు కోస్టా ప్రకటించారు. ఉక్రెయిన్, యురోపియన్ భద్రతను నిర్వచించాల్సిన తరుణంలో ప్రస్తుతం మనమున్నామని కోస్టా ఎక్స్ పోస్టులో వ్యాఖ్యానించారు.

పిఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధుల విడుదల

- పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- బీహార్‌లో ప్రధాని మోడీ పర్యటన

పాట్నా : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి మొత్తంగా సుమారు రూ.22 వేల కోట్లను జమ చేశారు. బీహార్ భగల్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నిధులు విడుదల చేయడంతోపాటు పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యం చేశాయని అన్నారు. కాంగ్రెస్, ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రభుత్వాలు వ్యవసాయానికి తగినంత బడ్జెట్లు కేటాయించలేదని చెప్పారు. ఎన్‌డిఎ ప్రభుత్వం నిరంతరం రైతులకు గణనీయమైన నిధులను విడుదల చేస్తోందని మోడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి నితీష్ కుమార్, కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు రైతుల గురించి మోడీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'భారతదేశపు అన్నదాతలను చూసి ప్రభుత్వం గర్విస్తోంది. వారి జీవితాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని తెలిపారు. ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే నిధులను బీహార్ రాష్ట్రంలో విడుదల చేశారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రధాని పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భాగల్‌పూర్ జిల్లా కలెక్టర్, ఎస్‌పి, సీనియర్ అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అస్సాం పర్యటనలో మోడీ

రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం సాయంత్రం అస్సాం చేరుకున్నారు. గౌహతిలోని సారుసజై స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో టీ గిరిజన కమ్యూనిటీకి చెందిన దాదాపు 9 వేల మంది కళాకారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన 'ఝుమోయిర్ బినందిని'ను వీక్షించడంతోపాటు స్టేడియంలో ప్రత్యేక వాహనంపై తిరుగుతూ ప్రేక్షకులను పలకరించారు. ఈ తరువాత నగరంలోని ఖానాపారా ప్రాంతంలోని వెటర్నరీ కాలేజ్ మైదానంలో రెండు గ్యాలరీల్లో 'ప్రైడ్ ఆఫ్ అస్సాం' అనే ప్రదర్శనలు ప్రారంభించారు. 'అడ్వాంటేజ్ అస్సాం 2.0 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌'ను మోడీ మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులతోపాటు పారిశ్రామిక వేత్తలు ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ, అనిల్ అగర్వాల్, ప్రశాంత్ రుయా, సజ్జన్ జిందాల్ తదితరులు పాల్గొననున్నారు.

అస్సాంలో 'జుమ్లాస్' ఫ్యాక్టరీ : కాంగ్రెస్

అస్సాంలో 'జుమ్లాస్' (అబద్ధాల) ఫ్యాక్టరీని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్థాపించారని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. దీనికి ప్రధాన సూత్రధారి అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అని తెలిపారు. మోడీ అస్సాం పర్యటన సందర్భంగా ఖర్గే తన 'ఎక్స్' ఖాతాలో ఈ మేరకు పోస్టు చేశారు. 'బిజెపి పాలనలో భూ మాఫియా, అవినీతి, విద్వేషం, దుష్పరిపాలన పరిణామాలను అస్సాం అనుభవిస్తోంది' అని ఖర్గే పేర్కొన్నారు. 'అభివృద్ధి, ఆర్థికంతోపాటు అన్ని విషయాల్లోనూ అస్సాం వెనుకబడి ఉంది. రాష్ట్రంలోని 3.5 కోట్ల మంది ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారు. మోడీ అబద్ధాలు వారి ఆగ్రహన్ని చల్లార్చలేవు. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లో మార్పు కచ్చితంగా ఉంది' అని ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ 'హిమంత బిశ్వ శర్మ రాష్ట్రంలో అవినీతి సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఆయనకు అనేక టీతోటలు, న్యూస్ పోర్టల్స్, మెక్‌డొనాల్డ్స్ అవుట్‌లెట్లు, అంతర్జాతీయ పాఠశాలలు, అనేక స్థలాలు ఉన్నాయి' అని విమర్శించారు.

వ్యర్థాలను సక్రమంగా వేరుచేయకపోతే మరింత కాలుష్యం!

- సుప్రీం హెచ్చరిక

న్యూఢిల్లీ : మూలం వద్దనే వ్యర్థాలను వేరు చేయడమనేది పర్యావరణానికి చాలా కీలకమైనదని సుప్రీం కోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. ఘన వ్యర్థాల నిర్వహణా నిబంధనలు-2016కు కట్టుబడి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్‌సిఆర్ రాష్ట్రాలను కోరింది. ఆ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే దేశంలోని అన్ని నగరాలు ప్రభావితమవుతాయని జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. అన్ని స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు పురోగతి బాటలో వున్నాయని మేం గమనించాం. కానీ ఘన వ్యర్థాల నిర్వహణా నిబంధనలు పాటించకపోతే ఈ నగరాలు స్మార్ట్‌గా ఎలా మారగలవు? అని బెంచ్ ప్రశ్నించింది. నేషనల్ కేపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్) పరిధిలోకి ఢిల్లీ, అలాగే హర్యానా, యుపి, రాజస్థాన్‌లోని కొన్ని జిల్లాలు వస్తాయి. వ్యర్థాలను సక్రమ రీతిలో వేరు చేయకపోతే వ్యర్థాల నుండి ఇంధనం సృష్టించే ప్రాజెక్టుల వల్ల కూడా మరింత కాలుష్యం పెరుగుతుందని హెచ్చరించింది. ఎన్‌సిఆర్ పరిధిలో వ్యర్థాలను వేరు చేయడమనేది చాలా తక్కువగా వుందన్న విషయాన్ని కాలుష్య విషయాల్లో అమికస్ క్యూరీ, సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దానిపై స్పందించిన కోర్టు, వ్యర్థాలను సక్రమంగా వేరు చేయకపోతే ఈ వ్యర్థాల నుండి ఇంధనం సృష్టించే ప్రాజెక్టులు కూడా మరింత కాలుష్యాన్ని సృష్టిస్తాయని బెంచ్ పేర్కొంది.

రైతులు కష్టాల్లో లేరట..!

(మొదటి పేజీ తరువాయి)

సమగ్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పిల్లల చదువులుతల్లులకు భారం కాకూడదనే "తల్లికి వందనం' పథకాన్ని అమలు చేయబోతున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. కానీ ఎప్పటి నుండి అమలుచేస్తారన్నది చెప్పలేదు.

2027 నాటికి పోలవరం :

పోలవరం ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించామని 2027 నాటికి దాని వాస్తవ స్థాయికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గవర్నర్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోలవరం అథారిటీ సలహాలను భేఖాతరు చేస్తూ నిర్మాణం కీలక దశలో ఉన్నప్పుడుఅమలు చేసే ఏజెన్సీని ఆకస్మికంగా మార్చడం వల్ల డయాఫ్రమ్ వాల్ కూలిపోవడానికి దారి తీసి, ప్రాజెక్టు జాప్యం కావడానికి కారణమైందన్నారు. లింక్ కాల్వ ద్వారా గోదావరి నది నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీటిని బదిలీ చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే రాయలసీమను నీటిసురక్షిత ప్రాంతంగా మార్చుతుందన్నారు. రాష్ట్ర గవర్నర్‌కు అసెంబ్లీ ప్రాంగణంలో మండలి ఛైర్మన్ మోషే, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సిఎం చంద్రబాబునాయుడు స్వాగతం చెప్పారు. గవర్నర్‌కు ఇరువైపులా మండలి ఛైర్మన్, స్పీకర్ కూర్చున్నారు.

यूनियन बैंक Union Bank of India

జోనల్ ఆఫీస్: విజయవాడ
2వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావ్ స్ట్రీట్, వన్ టౌన్, విజయవాడ-52001, టెలి: +91 9819815476,
ఇ-మెయిల్: rso.vijaywada@unionbankofindia.bank
dyzh2.vijayawada@unionbankofindia.bank

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ జోన్ పరిధిలోని అన్ని శాఖలు/కార్యాలయాలు/ATMలలో భద్రతా పరికరాలు & అగ్నిమాపక యంత్రాల సరఫరా, సంస్థాపన మరియు నిర్వహణ కోసం విక్రేతల ఎంప్యానెల్మెంట్.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొన్ని ప్రసిద్ధ సంస్థలు/విక్రేతలను ఎంప్యానెల్ చేయాలని కోరుకుంటుంది.

1. భద్రతా పరికరాల యొక్క నిర్వహణ మరియు సంస్థాపన, సరఫరా.
2. అగ్నిమాపక యంత్రాల యొక్క నిర్వహణ మరియు సంస్థాపన, సరఫరా.

పూర్తి వివరాలు మరియు RFP ఫారమ్‌లను పైన పేర్కొన్న చిరునామాలోని ప్రాంతీయ భద్రతా అధికారి నుండి పొందవచ్చు లేదా ఫారమ్‌లను మా వెబ్‌సైట్ www.unionbankofindia.co.in మరియు www.eprocure.gov.in నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

డిప్యూటీ జోనల్ హెడ్

మీ కోసం

కళ్లకింద నలుపు పోవాలంటే బంగాళాదుంపలను చిన్న ముక్కలుగా కోసి, కళ్లకింద పెట్టుకోవాలి.

జీవన సౌరభం

ఆలోచనలు ఎల్లప్పుడూ ఉన్నతంగా ఉండాలి. ఎందుకంటే అవి మాటల్లో ప్రతిబింబిస్తాయి.

స్నేహితులు

శీలాపురం అనే ఊరిలో రాజేష్, రమేష్ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారు ఎప్పుడూ తిట్టుకుంటూ, కొట్టుకుంటూ ఉండేవారు. అయితే సాయంకాలంలోగా కలిసి తిరిగేవారు. వీళ్లిద్దరినీ రామయ్య తాత బాగా పరిశీలించేవాడు.

ఒక రోజు రామయ్య తాత ఇద్దరినీ పిలిచి 'మీరు మాటిమాటికి కొట్లాడుకుంటారు. తిరిగి మళ్లీ కలిసిపోతారు ఎందుకని' అని అడిగాడు. 'మేము మంచి స్నేహితులం తాత. అందుకే తిట్టుకున్నా, కొట్టుకున్నా ఒకరికొకరు క్షమాపణ చెప్పుకుని మళ్లీ కలిసిపోతాం' అని చెప్పారు. 'ఓరి బడవల్లారా! మీ స్నేహం బాగానే ఉంది' అంటూ తాత నవ్వుతూ వెళ్ళిపోయాడు.

ఒకసారి రాజేష్, రమేష్ ఎడమొఖం పెడమొఖంగా ఉండడం తాత గమనించాడు. రమేష్‌ని పిలిచి 'ఏమైంద'ని అడిగాడు. 'రాజేష్ నా గురించి క్లాసులో చెడ్డగా చెప్పాడంట తాత. నేను వాడ్ని ఎంతగా ఇష్టపడతానో నీకు తెలుసు కదా. మరి వాడే నా గురించి అలా మాట్లాడేసరికి తట్టుకోలేకపోయా. అందుకే మాట్లాడడం మానేశా. పైగా ఎందుకు అలా చేశావు? అని రాజేష్‌ని అడిగితే, 'నీకు ఎవరు చెప్పారు?' అని అడిగాడే కానీ, అలా నేను మాట్లాడలేదు' అని చెప్పలేదు తాత. అది నాకు ఇంకా బాధనిపించింది' అని రమేష్, తాత ముందు ఏడుస్తూ చెప్పాడు.

రాజేష్ గురించి రమేష్‌తో ఎవరు చెప్పారో తాత తెలుసుకున్నాడు. ఆ పిల్లవాడు దినేష్‌ని పిలిచాడు. రాజేష్, రమేష్‌లని కూడా పిలిచి, ఓ చెట్టు చాటున ఉండమని చెప్పాడు. దినేష్‌తో తాత కాస్త గట్టిగానే 'అరే అబ్బాయ్.. క్లాసులో రమేష్ గురించి రాజేష్ ఏం చెడ్డ మాటలు చెప్పాడు' అని అడిగాడు. దినేష్ భయపడిపోతూ, 'ఏం చెప్పలేదు తాత.. ఊరికే అలా చెప్పా. వాళ్లిద్దరి స్నేహం విడిపోవాలని అలా చేశా. ఎందుకంటే నాకు రమేష్‌తో దోస్తి చేయడం ఇష్టం. రాజేష్‌తో విడిపోయి నాతో స్నేహం చేస్తాడని అలా చెప్పా.. కానీ రమేష్ నాతో స్నేహం చేయడం లేదు' అని గట్టిగా ఏడుస్తూ చెప్పాడు. చెట్టు చాటు నుండి ఇదంతా వింటున్న రాజేష్, రమేష్ తాత దగ్గరికి వచ్చారు. చెడు మాటలు విని తామెంత నష్టపోయిందీ తెలుసుకున్నారు. ఒకరికొకరు క్షమాపణలు చెప్పుకుని స్నేహం కొనసాగించారు.

- గొల్ల నవ్య, 9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హావేలి ఘనపూర్, జిల్లా : మెదక్,
96665 91708.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ వరుసగా ఉన్న అంకెలను కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.



నేను గీసిన బొమ్మ



తూగ శ్రీజ, 8వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్ బోరివంక, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా.

శ్రమకి 'పట్టా'భిషేకం

పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేస్తారు. రాత్రింబవళ్లు కాయకష్టం చేసేవాళ్లు కొందరైతే, తినీ తినక పిల్లల చదువుల కోసం దాచిపెట్టేవారు మరికొందరు. అయితే అమ్మానాన్నల కష్టం ఎంతమంది పిల్లలు అర్థం చేసుకుంటారు? తల్లిదండ్రుల కష్టాన్ని ఎంతమంది బిడ్డలు గుర్తిస్తున్నారు? పాకిస్తాన్‌లో ఇటీవల జరిగిన ఓ సంఘటన ప్రతి బిడ్డా తెలుసుకోవాల్సిన సత్యం. ప్రతి తల్లీదండ్రీకి భావోద్వేగ భరితం.

ఎప్పుడు జరిగింది.. ఎక్కడ జరిగింది.. అన్న వివరాలు లేకుండా హృదయాలు హత్తుకునే వీడియో అంటూ సోషల్ మీడియాలో ఓ వీడియో బాగా వైరల్ అయ్యింది. అది ఓ గ్రాడ్యుయేషన్ వేడుక. ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థులందరూ ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. వారితోపాటే తల్లిదండ్రులు కూడా వచ్చారు. ఒక్కొక్కరి పేరును పిలుస్తుంటే కరతాళధ్వనులతో స్వాగతం పలుకుతున్న స్నేహితులు, తమ కలలు సాకారం చేసుకునేందుకు వేదికపైకి వెళ్తున్న బిడ్డలను తదేకంగా చూస్తున్న తల్లిదండ్రులు అక్కడ కనిపిస్తున్నారు. అప్పుడే ఓ విద్యార్థి తన గ్రాడ్యుయేషన్ పట్టా తీసుకునేందుకు సిద్ధమయ్యాడు. అతని చేతిలో ఓ గ్యాస్ సిలిండర్ ఉంది. దాన్ని భుజంపై మోసుకుని వేడుక జరిగే వేదికపైకి చేరుకున్నాడు. అతను అలా వస్తున్నప్పుడు వేడుకకి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు నిలబడి మరీ గట్టిగా చప్పట్లు కొట్టారు. ఆ దృశ్యాన్ని చూస్తున్న కొందరికి భావోద్వేగంతో కన్నీళ్లు కూడా వచ్చాయి.

గ్రాడ్యుయేషన్ అందుకునేందుకు వచ్చిన ఆ యువకుని తండ్రి గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసేవాడు. తండ్రి కష్టాన్ని గుర్తించిన అతడు ఏ వృత్తి చేసి, తండ్రి తనని ఇంతటి వాడు చేశాడో సమాజానికి చూపించాలనుకున్నాడు. ఏమాత్రం బిడియ పడకుండా అంతమందిలో గ్యాస్ సిలిండర్ మోశాడు. ఆ ఆలోచన అక్కడున్న వారినే కాదు, ఆ వీడియో చూస్తున్న వారిని సైతం కన్నీటిపర్యంతం చేసింది. 'ప్రతి బిడ్డా తెలుసుకోవాల్సింది ఇదే..', 'అమ్మానాన్న కష్టానికి ఇంతకుమించిన గౌరవం లేదు' అని సోషల్ మీడియా అంతా ప్రశంసల వర్షం కురుస్తోంది.

యూరిక్ యాసిడ్.. ఈ కూరగాయలు తినొద్దు

శరీరంలో ప్యూరిన్ల విచ్ఛిన్నం ద్వారా యూరిక్ ఆమ్లం ఏర్పడుతుంది. సాధారణంగా ఇది మూత్రం ద్వారా శరీరం నుండి బయటకు వస్తుంది. దాని పరిమాణం పెరిగినప్పుడు, అది కీళ్లలో పేరుకుపోయి సమస్యలకు దారితీస్తుంది. యూరిక్ యాసిడ్ సమస్యలతో బాధపడేవారు కొన్ని రకాల కూరగాయలకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

పాలకూర : పాలకూర పోషకాలతో కూడి ఉంటుంది. ఇందులో ఇనుము, విటమిన్‌సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. అయితే, ఇందులో అధిక మొత్తంలో ప్యూరిన్లు కూడా ఉంటాయి. యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడేవారు పాలకూరను మితంగా తినాలి.

పుట్టగొడుగు : పుట్టగొడుగులలో అధిక మొత్తంలో ప్యూరిన్లు ఉంటాయి. ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని పెంచుతాయి. పుట్టగొడుగుల్లో ప్రోటీన్, యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. యూరిక్ యాసిడ్ బాధితులు వాటిని తినకుండా ఉండాలి లేదా తక్కువ పరిమాణంలో తినాలి.

కాలీఫ్లవర్ : కాలీఫ్లవర్‌లో ప్యూరిన్‌లు మితంగా ఉంటాయి. కానీ ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలను ప్రభావితం చేస్తుంది. ఈ కూరగాయలో విటమిన్ సి, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. యూరిక్ యాసిడ్ సమస్య ఉంటే, దీన్ని తక్కువ పరిమాణంలో తినాలి.

వంకాయ : వంకాయలో ప్యూరిన్ కంటెంట్ మితంగా ఉంటుంది. కానీ ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలను పెంచుతుంది. యూరిక్ యాసిడ్ బాధితులు వంకాయతో చేసిన వంటకాలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

జీలకర్ర నీళ్లు.. ఆరోగ్యానికి మేలు..

వంటింట్లో ఉండే జీలకర్రతో ఎన్నో ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయని అందరికీ తెలుసు. అయితే రాత్రంతా నానబెట్టిన జీలకర్ర నీళ్లని రోజుకు రెండుసార్లు తాగడం వల్ల మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఉదయం పరగడుపున ఒకసారి రాత్రి నిద్రకు ముందు ఒకసారి ఆ నీళ్లని తాగాలని వారు సూచిస్తున్నారు.

శరీరం డిటాక్స్ అవుతుంది

జీలకర్ర నీళ్లను రోజుకు 2 పూటలా తాగుతుంటే జీర్ణ సమస్యలు ఉండవు. ఈ నీళ్లను తాగడం వల్ల పలు జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. కడుపు ఉబ్బరం, మలబద్ధకం సమస్యలను తగ్గిస్తాయి. ఉదయం పరగడుపునే ఈ నీళ్లను తాగుతుంటే జీర్ణవ్యవస్థ రోజంతా చురుగ్గా పనిచేస్తుంది. ఎలాంటి ఆహారం తిన్నా సరే సులభంగా జీర్ణమవుతుంది. జీలకర్ర నీటిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపి శరీరాన్ని డిటాక్స్ చేస్తాయి. దీంతో శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. కొవ్వు సులభంగా కరిగిపోతుంది.

షుగర్ అదుపులో ఉంటుంది

జీలకర్ర నీళ్లను తాగడం వల్ల శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. రోజంతా బయట తిరిగే వారు ఎండ దెబ్బ బారిన పడకుండా ఉంటారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది. శరీరంలో వ్యర్థాలు చేరకుండా ఉంటాయి. చర్మం సంరక్షించబడుతుంది. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. ఆరోగ్యంగా ఉంటుంది. జీలకర్ర నీళ్లను సేవించడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సులభంగా గ్రహిస్తుంది. షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

కడుపులో మంటకు ఉపశమనం

జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీంతో శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. జీలకర్ర నీళ్లను తాగితే జీర్ణాశయంలో యాసిడ్ల ప్రభావం తగ్గుతుంది. యాసిడ్లు మరీ ఎక్కువగా ఉత్పత్తి అవకుండా చూస్తాయి. దీంతో కడుపులో, గుండెల్లో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది.

నిద్ర బాగా పడుతుంది

జీలకర్ర నీళ్లను రాత్రి నిద్రకు ముందు తాగితే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. దీంతో పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు.

చర్మ రక్షణకు..

జీలకర్రలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలు చర్మ సమస్యలను తగ్గిస్తాయి. మొటిమలతో బాధపడుతున్న వారికి ఈ నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ఈ నీళ్లను తాగుతుంటే వద్ధాప్య చాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది.

పారితోషికం ఇవ్వట్లేదు

పోలీసులకు 'గేమ్ ఛేంజర్' సినీ ఆర్టిస్టుల ఫిర్యాదు

'గేమ్ ఛేంజర్' సినిమాలో పనిచేసిన తమకు అగ్రిమెంట్ ప్రకారం రోజుకు రూ.1200 చొప్పున ప్రకటించిన పారితోషికం (రెమ్యునరేషన్) మంజూరుకోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు సినీ ఆర్టిస్టులు గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ సినిమాకు కో డైరెక్టర్‌గా పనిచేసిన స్వర్గం శివతో తాము ఒప్పందాన్ని చేసుకున్నామని పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు నుంచి చాలామందితో తాము కూడా హైదరాబాద్ వెళ్లి షూటింగ్‌లో పాల్గొన్నామనీ, ఒక్కొక్కరికి రూ.1200 చొప్పున ఇస్తామని చెప్పారన్నారు. సినిమా విడుదలై చాలా రోజులవుతున్నా తమకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. నిర్మాత్ దిల్‌రాజు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆర్టిస్టులు తరుణ్‌తోపాటుగా మరికొందరు కోరారు. తమను మోసం చేసిన స్వర్గం శివపై చర్యలు తీసుకోవాలని కూడా వారు కోరారు.

'హిట్..' నాని యాక్షన్

నాని నటిస్తున్న 'హిట్ : ది థర్డ్ కేస్' చిత్రం నుండి తాజాగా టీజర్ విడుదలైంది. సోమవారం హీరో నాని పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఈ టీజర్‌ని విడుదల చేశారు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. నాని పోలీస్ అధికారి పాత్రలో అర్జున్ సర్కార్‌గా కనిపించనున్నారు. శ్రీనగర్ నేపథ్యంలో ఈ కథ ఉంటుందని టీజర్ చూస్తే తెలుస్తోంది. వరుస హత్యలు.. అర్జున్ సర్కార్ వాటిని ఎలా ఛేధించాడు అనే కోణంలో ఈ సినిమా సాగనుంది. శ్రీనిధి శెట్టి కథానాయిక. మే 1న ఈ చిత్రం విడుదల కానుంది.

సేతుపతి రూ.1.30 కోట్లు ఆర్థిక సహాయం : సెల్వమణి

'కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయాంలో మూడేళ్లలోగా భూమి ఇచ్చి ఇళ్లు కట్టించాలని ఆదేశాలు జారీచేశారు. ఆ తర్వాత ప్రభుత్వం, పరిపాలన మారడం తదితర కారణాలతో నివాసాలు నిర్మించుకోలేకపోయారు. నా నేతృత్వంలో ఈ పెప్సీ ఏర్పాటైన తర్వాత అపార్టుమెంట్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేశాం. ఎంకె స్టాలిన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసి ఆ భూమిని మళ్లీ నివాసాలకు వినియోగించాలని కోరాం. అధికారులు, మంత్రులను సంప్రదించిన తర్వాత ఇల్లు నిర్మించు కునేందుకు ఉత్తర్వులు వచ్చాయి. నిరాశ్రయులైన మన కార్మికుల కోసం తొలి దశలో 1000 ఇళ్లు నిర్మించనున్నాం. గృహ నిర్మాణానికి ఒక్కొక్కరూ రూ.2.50 లక్షలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తెలుసుకున్న నటుడు విజయ్ సేతుపతి రూ.1.30 కోట్లు విరాళంగా అందించారు. ఈ డబ్బు సుమారు 50 కుటుంబాలకు ఉపయోగపడుతుంది. ఈ భూమిలో నిర్మించనున్న ఆరు టవర్లలో ఒకదానికి విజయ్ సేతుపతి పేరుపెట్టబోతున్నాం' అని సౌత్ ఇండియన్ ఫిల్మ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్, దర్శకులు ఆర్‌కె సెల్వమణి అన్నారు. ఎఫ్‌ఇఎఫ్‌ఎస్‌ఐ ఆధ్వర్యంలో సినీ కార్మికుల కోసం చెన్నై పక్కనే ఉన్న పాయనూరులో తమిళనాడు ప్రభుత్వం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కోలీవుడ్‌లో 23 విభాగాలకు చెందిన సుమారు 30 వేల మంది సభ్యులతో ఈ సంస్థ కొన సాగుతోంది. తమిళ నటీనటుల సంక్షేమం కోసం కృషిచేస్తోంది.

అమ్మ చాలా బాధపడింది

'మజాకా' సినిమా ప్రమోషన్స్‌లో నటి అన్షుపై దర్శకుడు త్రినాథరావు నక్కిన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. తాజాగా ఆయన ఆ వ్యాఖ్యలపై మరోసారి స్పందించారు. 'ఆరోజు నేను కావాలని ఆ విధంగా మాట్లాడలేదు. నేను ఆవిధంగా మాట్లాడినప్పటికీ తప్పు చేశాననే భావించా. స్టేజ్‌పై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి కదా అనిపించింది. అందుకే అందరినీ క్షమాపణ కోరాను. ఈ ఇష్యూ జరిగినప్పుడు నాకంటే మా అమ్మ బాగా డిస్టర్బ్ అయింది. స్టేజ్ మీద మాట్లాడేటప్పుడు ప్రతి మాటను అందరూ గమనిస్తుంటారు. భవిష్యత్తులో కాస్త జాగ్రత్తగా మాట్లాడు' అని అమ్మ చెప్పింది. ఆమెను చూసి నేనెంతో కంగారుపడ్డా. భవిష్యత్తులో ఎప్పుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదని నిర్ణయించుకున్నా' అని నక్కిన త్రినాథ్‌రావు అన్నారు. సందీప్ కిషన్, రావు రామేశ్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో నటించిన 'మజాకా' ఫిబ్రవరి 26న విడుదల కానుంది.

సారంగపాణి జాతకం

పరిపూర్ణ హాస్యరస చిత్రం

శివలెంక కృష్ణప్రసాద్, ఇంద్రగంటి మోహన కృష్ణ కాంబోలో వస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. ఈ సినిమాలో ప్రియదర్శి, రూప కొడవాయూర్ జంటగా నటిస్తున్నారు. ఈ వేసవిలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ విషయాన్ని మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. 'కుటుంబ సమేతంగా చూడదగ్గ పరిపూర్ణ హాస్యరసచిత్రం మా 'సారంగపాణి జాతకం'. అందుకే వేసవి సెలవుల్లో విడుదల చేస్తున్నాం. ప్రచార చిత్రాల్లో సారంగపాణి ప్రపంచం ఎలా ఉంటుందో ఇప్పటికే పరిచయం చేశాం. మనిషి భవిష్యత్తు చేతి రేఖల్లో ఉంటుందా? చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానమే ఈ సినిమా. రెండున్నర గంటలపాటు హాయిగా నవ్వుకునే సినిమా ఇది. పోస్ట్ ప్రొడక్షన్ తుదిదశకు చేరుకుంది. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం.' అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు. నరేష్ వీకే, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.

ఛేజి(కి)ంగ్ విరాట్

- ఛేదన 28శతకాల్లో 24మ్యాచుల్లో టీమిండియా గెలుపు

టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లి పాకిస్తాన్‌పై అజేయ శతకంతో తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. పాకిస్తాన్‌తో మ్యాచ్ అంటే చెలరేగి ఆడే కోహ్లి ఆ మార్క్ ప్రదర్శననే ఛాంపియన్స్ ట్రోఫీలోనూ చూపాడు. టి20 ప్రపంచకప్‌లో పాక్‌పై ఆడిన ఆటను మనం ఇంకా మరువకముందే.. మళ్లీ ఆ జట్టుపైనే మరో చిరస్మరణీయమైన ఆటను ప్రదర్శించి చిరకాలం గుర్తుండులా చేశాడు. ఇక పాకిస్తాన్‌పై కొట్టిన సెంచరీతో విరాట్ వన్డే కెరీర్‌లో 51వ శతకాన్ని పూర్తిచేసుకున్నాడు. ఈ ఫార్మాట్‌లో ఇన్ని శతకాలు కొట్టిన ఏకైక బ్యాటర్ విరాట్ కోహ్లి మాత్రమే. అంతకుముందు ఈ రికార్డు సచిన్ టెండ్యూలర్(49సెంచరీలు) పేరిట ఉండగా.. ఆ రికార్డును కోహ్లి ఎప్పుడో అధిగమించాడు. వన్డే ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన తొలి ఆటగాడిగా దూసుకెళ్తున్న కోహ్లి చేసిన శతకాలత్లో 28 శతకాలు ఛేదన సందర్భంగా చేసినవే. అందులో కోహ్లి కొట్టిన 24 సెంచరీల్లో భారతజట్టు విజయం సాధించడం మరో విశేషం.

ఫామ్‌లో లేదన్నారు: రిజ్వాన్

ఫామ్ లేమితో తంటాలు పడుతున్న విరాట్ కోహ్లిని పాక్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ మెచ్చుకున్నాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విరాట్‌ను ఔట్ చేయడానికి ఎంతో ప్రయత్నించామని, కానీ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్‌ను తమ నుంచి లాగేసుకున్నాడని పేర్కొన్నాడు. కోహ్లి ఫిట్‌నెస్ లెవల్, అతను కష్టపడిన తీరును కచ్చితంగా మెచ్చుకుంటాను. ఎందుకంటే అతను క్రికెటర్. మేమూ క్రికెటర్లమే. కోహ్లి ఫామ్‌లో లేదని అందరూ అన్నారు. కానీ, పెద్ద మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాడు' అని రిజ్వాన్ వివరించాడు.

క్రికెట్ కోహినూరు కోహ్లి: సిద్ధు

పాక్‌పై శతకంతో మెరిసిన కోహ్లిపై ప్రశంసల జల్లు కురుస్తోంది. విరాట్ కోహ్లి మరో రెండు, మూడేళ్లు క్రికెట్ ఆడతాడని మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధు పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఫామ్ లేమితో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న విరాట్ కోహ్లి.. ఛాంపియన్స్ ట్రోఫీలో శతకంతో రాణించి వారి విమర్శలకు సమాధానం ఇచ్చాడని తెలిపాడు. విరాట్ ఆటపై మక్కువ కలిగిన ఆటగాడని.. పాక్‌పై సెంచరీ చేసిన విధానాన్ని చూస్తే.. రాబోయే రెండు మూడేళ్లు ఆడతాడని తెలిపాడు. మరో పది, పదిహేను సెంచరీలు సాధిస్తాడని తాను పూర్తిగా నమ్మకంతో చెబుతున్నానని తెలిపాడు. ఎవరైనా కష్ట సమయాలను ఎదుర్కొంటారని.. గత ఆరు నెలల్లో విరాట్ విషయంలో చాలా జరిగిందన్నారు. పాకిస్తాన్‌పై విరాట్ చేసిన సెంచరీ చిరకాలం గుర్తుండి పోతుందన్నారు. విరాట్ కోహ్లి లాంటి క్రికెటర్లు తరానికి ఒకసారి పుడతారని.. అతను కోహినూర్ లాంటివాడని పేర్కొన్నారు.

సెంచరీతో తిరిగి ఫామ్‌లోకి : రోహిత్

'కోహ్లి భారత్‌కు ప్రాతినిధ్యం వహించడాన్ని ఇష్టపడతాడు. ముఖ్యంగా అతను జట్టు కోసం ఆడాలని కోరుకుంటాడు. ఎప్పుడూ తన అత్యుత్తమ ఆటను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాడు. కీలక సమయంలో తనలోని నైపుణ్యాలను మరింత మెరుగ్గా ప్రదర్శిస్తాడు. పాక్‌పై కోహ్లి భారీ ఇన్నింగ్స్ ఆడటం చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నవారిలో ఒక్కరూ కూడా ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే ఎన్నో ఏళ్లుగా జట్టు కోసం అతడేం చేస్తున్నాడో అందరికీ తెలుసు. కోహ్లి తనదైన స్టైల్‌లో మ్యాచ్‌ను ముగించడం బాగుంది' అని భారత కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు.

సెమీస్‌కు న్యూజిలాండ్

- బౌలింగ్‌లో మెరిసిన బ్రాస్‌వెల్
- రచిన్ రవీంద్ర సెంచరీ
- బంగ్లాదేశ్‌పై కివీస్ గెలుపు

బ్రాస్‌వెల్ (4/36)

రావల్పిండి: ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆతిథ్య పాకిస్తాన్ జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన గ్రూప్-ఎ లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా రెండేసి విజయాలతో ఈ గ్రూప్ నుంచి భారత్, న్యూజిలాండ్ జట్లు సెమీస్‌కు చేరగా.. మరో లీగ్ మ్యాచ్ మిగిలి ఉండగానే పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లు నిష్క్రమించాయి. ఇక బంగ్లాదేశ్‌తో సోమవారం జరిగిన గ్రూప్-ఎ రెండో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ బౌలర్లు అదరగొట్టారు. బ్రాస్‌వెల్(4/36), రూర్కె(2)48)కి తోడు హెన్రీ, జెమిసన్ ఒక్కో వికెట్‌తో చెలరేగారు. దీంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 236 పరుగులకే పరిమితమైంది. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హూస్సేన్ శాంటో(77) టాప్ స్కోరర్‌గా నిలవగా.. జాకర్ అలీ(45), రిషద్ హొస్సేన్(26) రాణించారు. మరో ఓపెనర్ తంజిద్ హొస్సైన్(24) కూడా ఫర్వాలేదనిపించారు. మెహిదీ హసన్(13), తౌహిద్(7), వికెట్ కీపర్ ముష్ఫికర్(2), మహ్మదుల్లా(4) నిరాశపరిచారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు తస్కిన్(10), ముస్తాఫిజుర్(3) రాణించలేకపోయారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ టాపార్డర్ బ్యాటర్లు నిరాశపరిచారు. ఓపెనర్లు యంగ్(0) డకౌట్ కాగా.. కాన్వే(30), విలియమ్సన్(5) రాణించలేకపోయారు. దీంతో న్యూజిలాండ్ జట్టు 72పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో భారత సంతతికి చెందిన కివీస్ మిడిలార్డర్ బ్యాటర్ రచిన్ రవీంద్ర(112) సెంచరీతో మెరిసాడు. 105బంతుల్లో 12ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 112పరుగులు చేసి రిషాద్ హొస్సైన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత పాకిస్తాన్‌పై సెంచరీతో రాణించిన లాథమ్ మరోసారి అర్ధసెంచరీతో మెరిసాడు. గ్లెన్ ఫిలిప్స్‌తో కలిసి మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించాడు. దీంతో న్యూజిలాండ్ జట్టు 46.1ఓవర్లలో 5వికెట్లు నష్టపోయి 240పరుగులు చేసి విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బ్రాస్‌వెల్‌కు దక్కింది.

భారత హాకీజట్లకు నిరాశ

ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్

భువనేశ్వర్: ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు వరుసగా పరాజయాన్ని చవిచూశాయి. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 2-3గోల్స్ తేడాతో ఇంగ్లండ్ చేతిలో పోరాడి ఓటమిపాలైంది. ఇక మహిళల జట్టు 2-4గోల్స్ తేడాతో పటిష్ట నెదర్లాండ్స్ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. నేడు జరిగే రివర్స్ మ్యాచ్‌లోనూ ఈ రెండుజట్లు మరోసారి తలపడనున్నాయి.

ఛాంపియన్స్ ట్రోఫీ పాయింట్ల పట్టిక

గ్రూప్-ఎ	ఆ	గె	ఓ	పా	నె.ర.
న్యూజిలాండ్	2	2	0	4	+0.86
భారత్	2	2	0	4	+0.64
బంగ్లాదేశ్	2	0	2	0	-0.44
పాకిస్తాన్	2	0	2	0	-1.08

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68